ప్రారంభ సంచిక

సాహిత్య త్రైమాస పత్రిక

[illegible]

31.1.71

సృజన

సాహిత్య త్రైమాసపత్రిక

జనవరి — మార్చి

1971

ఒక రూపాయి

నాలుగు సంవత్సరాలు తెలుగులో

ఆధునిక సాహిత్య వేదికగా

అపూర్వమయిన సంచలనాన్ని కలిగించిన

సృజన

ఫిబ్రవరి 1971 నుంచి మాసపత్రికగా వెలువడుతుంది.

శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, కె. వి. రమణారెడ్డి, నిఖిలేశ్వర్ మున్నగువారి వ్యాసాలతో యింకా కవితలు, కథలు, సమీక్షలతో తొలి సంచిక ఫిబ్రవరి మొదటివారంలో వెలువడుతుంది.

నేడే సంవత్సర చందాదారులుగా చేరి మీ కాపీ పొందండి.

విడి ప్రతి : ఒక రూపాయి

సంవత్సరచందా : పదిరూపాయలు

అర్ధసంవత్సర చందా ; ఆరు రూపాయలు

వివరాలకు, ప్రతులకు : సృజన, పి. బి. 67, వరంగల్-2.

తాజాకలం : అగస్ట్ - అక్టోబర్ సృజన కొద్ది కాపీలు మాత్రం ఉన్నాయి. కావలసినవారు పై అడ్రస్‌కు 125 పైసలు పంపించగలరు.

వేమన

సాహిత్య త్రైమాసపత్రిక

సంపుటి : 1 జనవరి — మార్చి 1971 సంచిక : 1

సంపాదకుడు

కె. శివారెడ్డి యం. ఏ. (లిట్)

గౌరవ నిర్వాహకుడు

గుత్తికొండ సుబ్బారావు

సలహా మండలి :

శీలా వీర్రాజు

వి. సీతారామరెడ్డి

ఏ. సుబ్బారావు యం. ఏ. (లిట్)

ఈ సంచికలో......

1. వెన్నెల నన్నురమ్మంది (కవిత) —మిరియాల రామకృష్ణ 9
2. చూశాను నేను (కవిత) —బి. శివ 14
3. స్వాగత కలశం (కవిత) —సురేష్ 16
4. ఏది ప్రజాకవిత ? —నూతలపాటి గంగాధరం 17
5. వసుమతి పాపం ఒంటరిది (కవిత) —భైరవయ్య 27
6. అగ్నిని ఆర్పేయకండి (కవిత) —ఏ. సూర్యప్రకాశ్ 32
7. వర్తమాన సాహిత్యంలో వక్రరేఖలు —సోమసుందర్ 38
8. తూకం రాళ్ళు (కథ) —శీలావీర్రాజు 43
9. రచన ఎవరికోసం ? —నిఖిలేశ్వర్ 53
10. గడ్డకట్టిన నిజం (కవిత) —పరిగి రాధాకృష్ణ 57
11. మార్చి (కవిత) —యం. కె. సుగమ్‌బాబు 59
12. మరామత్తు పని (కవిత) —గుత్తికొండ సుబ్బారావు 62
13. ఏది అభ్యుదయ కవిత ? —అద్దేపల్లి రామమోహనరావు 63
14. వేకువ (కవిత) —కె. శివారెడ్డి 72
15. శిలాసుమాలు (కవిత) —దాశరథి 75
16. నేనూ, నా రచన —కుందుర్తి 77
17. నీపాట (కవిత) —యన్. గోపి 89
18. హర్రాజ్ (కవిత) —పి. లక్ష్మీనారాయణ్ 91
19. బాధ్యత (కవిత) —నగ్నముని 94
20. రా (సమీక్ష) —మామిడి రమాకాంతరావు 97
21. త్రివేణి (సమీక్ష) —మనోమోహన్ 108

సంపాదకీయం

ఈనాడు పత్రికల కేమీ కొదవలేదు. వ్యాపార, సాహిత్య పత్రికలు, అనేకం వస్తున్నాయి. పోతున్నాయి. ఒకదశాబ్దం క్రిందటికీ నేటికీ చాలా అంతరం కనిపిస్తుంది. అది సమాజంలో ఒక చైతన్యం, సంచలనం రావటమే ! ఇదివరకు లేనన్ని సాహిత్య పత్రికలు ఈనాడొస్తున్నాయి. హిందీ భాషతో పోల్చుకుంటే తెలుగులో వచ్చే పత్రికలు చాలా తక్కువే ! ఈనాటి యువ తరంలో వచ్చిన సాహిత్య, రాజకీయ చైతన్యం మరే కాలంలోనూ లేదు.

మేం యువకులం. ఆ సంచలనంలో మా వంతూ ఉంది, మా గొంతుకలూ ఉన్నాయి. ఆ చైతన్యంలో మా స్రవంతీ ఉంది. సాహిత్యపత్రికలెప్పుడూ చేతిచమురు బాపతే. అయినా అందరికీ ఒక నిష్పక్షపాత వేదిక కల్పించాలన్న తహతహ, నిజాయితీతో సాహిత్య సేవ చేయాలన్న దీక్ష, స్వచ్ఛందమైన సాహిత్యాన్ని మీ కందించాలనే ఆకాంక్షతోనే ఈ వేకువ దూతికను మీ ముందుంచుతున్నాం. రచనలు పంపమని తరతమ భేదాలు లేకుండా అందరికీ రా శా [illegible], ఇచ్చవచ్చినవారు పంపారు. వేస్తున్నాం.

యువతరంలోని జాగృతినీ, అగ్నినీ అర్థం చేసుకోలేని సాహితీ వృద్ధులు- "ఇన్ని పత్రిక లొస్తుంటే- మీరూ పత్రిక ఎందుకు పెట్టాలి, మీ ఉద్దేశ్య మేమిటి" అంటూ రాశారు. సమాధానా లిచ్చాం-

మళ్ళీ యిస్తున్నాం. రెమ్యునరేషన్ వ్యాసాలు రాసే వాళ్ళు మాకు పంపకపోయినా బాధలేదు. ఆధునిక సాహిత్యంలో వాళ్ళే శిలాస్థంభాలనుకోవటం, శుద్ధ తెలివి తక్కువ. వాళ్ళే సాహిత్యాన్నీ, జాతినీ, నడిపించారను కోవటం, నడిపిస్తా రనుకోవటం- వారివారి అగ్గిపెట్టె బుద్ధులకు తార్కాణం.

మరొక్కసారి చెబుతున్నాం— ఇది ఎవర్నీ సైడు చేయడానికి నెలకొల్పబడలేదు.

ఒక వేదికగానే మీ మధ్యకొచ్చింది. నిజా యితీగలవాళ్ళు, ప్రగతి వాంఛించే వాళ్ళు- నిజమైన రచయితలు- ఎవరైనా సరే ధైర్యంగా వారివారి అభి ప్రాయాలను వెలిగించుకోవచ్చు- జాతికి కళ్ళుగా మారొచ్చు. అన్యాయాన్ని సహించలేనివాళ్ళు నిప్పులు పంపండి. పుచ్చి, బూజుపట్టిన ఈ వ్యవస్థను కూల దూసే ఫిరంగులు పేల్చండి. జీవితాన్ని వ్యాఖ్యానిం చండి;

రండి! వయస్సు మళ్ళిన, ఎముకలు కుళ్ళిన సోమరులారా! చావండి! నెత్తురుమండే, శక్తులు నిండే యువకుల్లారా రండి: ద్రోహాలను తూలగొట్టి, దోషాలను తుడిచిపెట్టేందుకు—

ఇది మేం చేపట్టిన వేకువబాకు. ఇది చీకటి గర్వాన్ని చీలుస్తుంది. వెలుగు రంకె వేసి దూకుతుంది

తిలక్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి

ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో ఒక విశిష్టతను పొంది, "కవితా సతి నొసట నిత్య రసగంగాధర తిలకం"లా వెలిగిన స్వర్గీయ బాలగంగాధర తిలక్ కవితా సంపుటి "అమృతం కురిసిన రాత్రి"కి ఈ యేడాది కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించిందని విని సంతోషించని తెలుగు వాడెవడూ వుండడు —ఆ సంతోషంలో మేమూ పాలు పంచుకొంటున్నాం—

—సంపాదకుడు

వాడీ వేడీ గల యువచైతన్యకారుల సాహిత్య వేదిక

విద్యుల్లత

యువ సాహిత్య మాస పత్రిక

కరీంనగర్–1

విడి ప్రతి : 60 పైసలు

సంవత్సర చందా – 6 రూపాయలు

వెన్నెల నన్ను రమ్మంది

మిరియాల రామకృష్ణ

'నువ్వు కూర్చున్న గదిలో
వైరంలాంటి కపటం లాంటి
ఈర్ష్యలాంటి ద్వేషంలాంటి
అజ్ఞానం లాంటి స్వార్థం లాంటి
గుబురు మీసాల కసాయి చీకటి
కరెంటు కిరణాల కిరీటాన్ని
పడగొట్టి విశ్రాంతి తీసుకొంటూంది

నువ్వు చదవాలనుకున్న
కొత్త పుస్తకాల పేజీ పేజీలోనూ
ఇరుల కటారులు దాగి ఉన్నాయి
వైరి గుడారాలు వేసి ఉన్నాయి.

ఆ గదిలో అలా
రేకులు విప్పని పువ్వులా
రెక్కలు విప్పని పక్షిలా
ఇవతలికి రాని భావంలా
గుండెలోకి సోకని రాగంలా
అలా కూర్చున్నావా ఇంకా

ఆ గదిలో నిరాశలాగా నిర్వేదంలాగ
సీరసంలాగ నిట్టూర్పులాగ
అలా కునుకుతున్నావా ఇంకా
ప్రమాదం ప్రమాదం
అమావాస్య కాదు ఈ దినం

ఇటు చూడు వచ్చి
ఇవతల నేనున్నాను
జాబిల్లిలోంచి జాజితీగలా
జాజి పువ్వులోంచి పుప్పొడిలా
పుప్పొడిలోంచి నెత్తావిలా
ఇవతల నేనున్నాను
భూతలం నిండా వ్యాపిస్తున్నాను
భూరి సంపదలిస్తున్నాను
లాస్య లలిత మంగళరాగం వినిపిస్తున్నాను
సుఖస్వర వికస్వర స్వాగత మిస్తు న్నాను
ఆ మారుమూల గదిలోంచి ఇవతలికి రా !

ఈ శరదృతువులోని తెలిమొయిళ్ళు
నాతోపాటు కిందికి దిగిరాలేక
సామాన్యుడి స్నిగ్ధహస్తం పట్టలేక
శ్రామికుడి శిరోజాలు నిమరలేక
అంత ఎత్తుగా
అంత సులమీది ఆగర్వ శ్రీమంతుల్లాగ
ఆశా దిగంతాల కెగిరే హృదయాల్లాగ
గతాకాశ విమానాల కెక్కే మమతల్లాగ

నన్ను చూసి మంచుగాలి
కలకలం నవ్వుతూ కైవారం చేస్తోంది చూడు
నన్ను చూసి దిగంతాలు
చేతులు దించి నమస్కరిస్తున్నాయి చూడు
నిద్ర ముసలివాళ్ళదగ్గరా
ముద్దులొలికే పిల్లలదగ్గరా
ముడుచుకు పడుకుంది చూడు
నువ్వు లే!
ఈ వెన్నెల నిండిన రాత్రి
నిద్ర నిషిద్ధం
నిట్టూర్పు అసంగతం
నిరాశ అసహజం

మానవుడవని వెదుక్కుంటూ వచ్చాను
మంచి తనాన్ని ఊహించుకొంటున్నాను
జన్మ జన్మాల వాసనలు
జ్ఞప్తికి తెదామని వచ్చాను
బాధ్యతల సరోవరాల్లో విరిసే
బంగారు కలువలు చూపడానికి వచ్చాను
స్వాతంత్ర్యవీథుల్లో ఒప్పులకుప్ప
లాడుకునే భవిష్యత్తులను
చూపిస్తావని వచ్చాను
ప్రశాంతి నిచ్చే నా ఒడిని
నీ కోసం కేటాయించాను
పొంగి పొర్లే గుండెలనూ
రగిలిమండే జ్వాలలనూ కలిపి

ఎన్ని కవితా తరంగాలను పొంగించినా
చెలియలి కట్టలా
మహీతలంమీద నీ మహిమలు
చూదామని వచ్చాను
ప్రేయసిలా రమణీయదృశ్యంలా
మధుగీతంలా పరిమళంలా వచ్చాను
కన్నులు
కైలాసమంత పాలతలం నిండా
నిండించుకుని చూడు.
ముఖాన్ని భూగోళమంత చేసి
అంతరంగాన్ని అర్ణవమంత చేసి
స్పందన గుండెల్లో నిలిపి
అందం అనుభూతికి అంకితంచేసి
ఆనందం ఆప్తకోటికి అందించి
కోటిరహస్యాలుగల ప్రపంచమంతా
కోమలమైన చూపుతో
నా వెలుగులో చూడు
నాలో కరిగి నావైపు జరిగి
నాతో పాడు
చీకటిని వదిలిన రాత్రిలా
చీకాకును విడిచిన ఋషిలా
చింతలు తుడిచిన దైవంలా
నాలోకి రా
నా చూపుల్లో చూపులు కలిపి చూడు
కోటి స్వర్గాల లాంటి స్వప్నాలు
లక్ష పరిమళాల లాంటి శాంతులు

వెయ్యి లాస్యాలు లాంటి చైతన్యాలు
నాలో ఉన్నాయి చూడు
మనిషిలా చూడు
మారణాయుధం పారేసి రా
మలీమసాలు కడుక్కుని రా
ఆకాశాన పరుగెత్తే అనిలం లా
నింగిని పురివిప్పే నీలిమ లా
ఆవేశం లా జ్వాలలా
ఆలోచనలా తరంగంలా
నా ముందు నర్తిద్దువుగాని రా !
నా లాగే వర్తిద్దువుగాని రా !

మనిషికోసం కవిత్వం
మంచి కోరి నవ్యత్వం
నవ్యత్వం ప్లస్ మానవత్వం
ఈజ్ ఈక్వల్ టు కవిత్వం.

శ్రీ శ్రీ

చూశాను నేను

బి. శివ

మానవత్వపు మార్గంలో
మమతల గుర్తులు కనిపిస్తాయని
విశ్వాంతరాళంలో విహరిస్తూ
శాంతిపావురం కనిపిస్తుందని
ఆశతో అడుగులు వేసుకొంటూ
క్రిందుమీదులు చూసుకొంటూ
కాలపు అరణ్యంలో
అనుభవాల కాళ్ళతో నడుస్తున్నాను-

దారి పొడుగునా చెట్ల
విక్రమార్కుడి సింహాసనపు మెట్లలా
చెప్తున్నాయి నిజాల యిక్కట్లు —
చింతచెట్టు పక్కన సత్యాన్ని
మామిడిచెట్టు పక్కన మంచిని
నిద్రగన్నేరుచెట్టు పక్కన నిజాయితీని
నేరేడు చెట్టు పక్కన నీతిని
విలువునా పూడ్చిన రహస్యాలు విన్నాను —

గాలి కదలికల్లో
ఆకుల గల గలల్లో
కోటాను కోట్ల అసహాయులగళాల
చప్పుళ్ళు విన్నాను —

శ్రమజీవుల బ్రతుకుల్ని హరించిన
రాతిగుండెల ధనిక వర్గపు కొండలోయల్లో
అభాగ్యుల కన్నీటి జలపాత ధ్వనుల
విషాద గీతికలు విన్నాను —
క్రూరమృగాల దౌర్జన్యాల పదఘట్టనలతో
అమాయక జీవుల గుండెలు చితికి
రక్తపు మడుగులుగా మారడం చూశాను —

బ్రతుకు వేదనల పరివేషంతో
నిరాశల మబ్బునీడల్లో
తలదాచు కొంటున్న
సామాన్య మానవుడిలా
అస్తమిస్తున్న సూర్యుడి
ఆవలి అంచులు చూశాను !

స్వాగతకలశం

ఎక్కుపెట్టిన విల్లులాంటి జీవితం
ఎందుకో నిర్వ్యాపారమవుతోంది

మూని వాకిలిలో కుటజాగ్రంపై
వర్తమాన బాధ కుసుమించింది

పుంజుకోడి నెత్తిమీద తురాయి
సంకేత మవుతోంది రేపటి పలావుకు

చచ్చిన సూర్యునికోసం ధరిత్రి
దాల్చిన విషాద చిహ్నం చీకటి

చచ్చిన సూర్యుని సమాధికి ఎపిటా
"చంద్రరేఖ"

నిత్యం చచ్చే ఆదిత్యుని కోసం
నిజంగానే ఏడుస్తోంది కీచురాయి

సంప్రదాయ తిమిరం అందించిన
స్వర్ణారుణ కలశం ఉదయం.

— సురేష్

ఏది ప్రజా కవిత?

నూతలపాటి గంగాధరం

ఆధునికాంధ్ర సాహిత్యంలో ప్రజా కవిత్వమనేమాట గురజాడ నుంచి వినిపిస్తుంది. ప్రాచీన కవిత్వంలో కూడా ప్రజా కవిత్వం లేకపోలేదు. జానపద వాఙ్మయం సంగతి కాదుగాని, శైవ సాహిత్యాన్ని ఆనాడు ప్రజా కవిత్వంగానే భావిస్తూ వచ్చారు.

ప్రజా కవిత్వాన్ని రెండు రకాలుగా విభజించ వచ్చు. ప్రజల కోసం వ్రాసిందనీ, ప్రజల గురించి వ్రాసిందనీ. ఆనాడు, ఈనాడు గూడ ప్రజల కోసమని రాసిన కవిత్వం మృగ్యమనే చెప్పాలి కవిత్వాన్ని సామాన్య ప్రజానీకానికి కర్థమయ్యేలా రాయటమంటే మాటలేం కాదు. అయితే సామాన్యుడు ప్రాచీన సాహిత్యాన్ని ఆనందించ గలిగినట్టు ఆధునిక సాహిత్యాన్ని అనుభవించలేక పోతున్నాడు. (మార్కెట్టులో ప్రాచీన సాహిత్యానికున్నంత గిరాకీ ఆధునిక సాహిత్యానికి—అదెంత గొప్ప—కొత్త కవిత్వమైనా కానీ— లేకపోతోంది) దీనికి కారణం లేకపోలేదు. ప్రాచీన సాహిత్యమంతా కథల రూపంలో ఉంది. చెప్పే పద్ధతిలో కొంత భాషాకాఠిన్యం అవీ అడ్డు వచ్చినా కథని ఆధారం చేసుకుని సామాన్యుడు ముందుకు సాగిపోతాడు. ఆధునిక సాహిత్యంలో కథ వేరుగా కవిత్వం వేరుగా విడిపోయింది. నేటి కవిత్వంలో భావ చిత్రాలు మాత్రమే ఉంటాయి. ప్రాచీన కవి కథకు సంబంధించిన శిల్పాన్ని చూపేవాడు. సామాన్యుడికది సులభంగా అర్థమయ్యేది; తద్వారా అతన్ని ఆకట్టుకునేది. ఆధునిక కవి భావానికి సంబంధించిన శిల్పాన్ని చూపుతున్నాడు. ఈ శిల్పంలో చాల గడుసుతనం ఉంది. ఆ గడుసుదనం సామాన్యుడి కందుబాటులో లేనిది. అందుబాటులో లేకపోయినా, ఏలాగో తంటాలు పడి సామాన్యుడు దానితోనే ప్రభావితుడవుతున్నాడు.

సాహిత్య తత్వాన్ని పరిశీలించి చూస్తే ప్రాచీన సాహిత్యంలో బాల సాహిత్య లక్షణాలే అధికం. బాల సాహిత్యంలో ఒక కథ. ఆ కథలో పిల్లల మనస్తత్వాని కనుకూలమైన అద్భుత సన్నివేశాలూ, చివరి కందులో ఒక నీతి ఉండాలి. దాదాపు మన ప్రాచీన కావ్యాలన్నీ అద్భుత గాథల నిలయాలే! అన్నీ చివరి కేదో ఒక నీతిని బోధించేవే! మన ప్రాచీన కావ్యాలను చాల మట్టుకు కొద్ది మార్పులతో పిల్లలకు పాఠ్య గ్రంథాలుగా ప్రవేశ పెట్టవచ్చు.

ప్రజలకోసం కవిత్వం వ్రాసే ప్రాథమిక దశను దాటి వచ్చేశాము. ప్రజలకోసం రాయాలంటే ప్రాచీన సాహిత్యానికి మల్లే బాల సాహిత్య స్థాయిలో రాయవలసిందే! ఇప్పుడు బాల సాహిత్యం ప్రత్యేక శాఖగా ఏర్పడి అభివృద్ధి చెందుతోంది. కాబట్టి ఇప్పుడా ఇబ్బంది లేదు. ప్రజల గురించి వ్రాయబడేదే నేడు ప్రజా కవిత్వం. ఆ పేరుతో వచ్చిన–వస్తున్న అభ్యుదయ కవిత్వమంతా ప్రజలగురించి రాయబడిందే! ప్రారంభంలో వచ్చిన గురజాడ కవితా ఖండికలు కొన్ని దీనికి అపవాదుగా నిలువ వచ్చు.

పోతే సామాన్యుడికొక స్థిర అభిప్రాయాన్ని ఏర్పరచి ఏకముఖంగా ముందుకు నడిపించక, పలు ముఖాలతో అస్తవ్యస్తంగా త్రొక్కిడి పడుతూ అతన్ని చికాకు పరుస్తున్న నేటి సాహిత్య మార్గాల్ని గురించి కొంత పరిశీలించి చూద్దాం

నేటి సాహిత్యం ముఖ్యంగా మూడు మార్గాల్లో పయనిస్తోంది.

ఒకటి : సనాతన సంప్రదాయాన్ని సమర్థించేది.

రెండు : ప్రగతికోసం హింసా ప్రవృత్తి నవలంబించేది.

మూడు : సామ్య మార్గంలో ప్రగతిని కోరేది.

మొదటి దానిలో గొట్టు ఛాందసత్వం కరడుగట్టి ఉంది. రెండవ దానిలో ఆటవిక దశను దాటని అనాగరికత ఉంది. మూడవదానిలో మానవత నాధారం చేసుకున్న ప్రగతి వాదం ఉంది.

మొదటి దానికి వేదాలు ప్రమాణాలు. వాళ్ళ మార్గాలు ప్రాచీన లక్షణ శాస్త్రాలు నిర్దేశించినవి. వారి ఆలోచనలు ఆధ్యాత్మికమైనవి.

రెండవదానికి మావో ప్రవచనాలు ప్రమాణాలు. వారి మార్గం హింస, వారి ఆలోచనలు పైశాచికమైనవి.

మూడవది మార్క్సిజాన్ని మనదేశ నైసర్గిక స్వరూప స్వభావాల కనుకూలంగా స్వీకరించి హేతుబద్ధమైన ప్రగతిని సాధించాలంటుంది.

మొదటిదానిలో ఛాందసత్వంతోపాటు మూర్ఖత్వమూ మేళవింపబడింది. రెండవదానిలో మూర్ఖత్వంతోపాటు అజ్ఞానం జత పరచబడింది, మూడవదానిలో ఆధునికత్వంతోపాటు మానవత్వం అనుసంధింపబడింది.

విశ్వనాథను గురించి వ్యంగ్యంగా చెప్పిన తిలక్ గేయం మొదటి దాని పరిస్థితిని పూర్తిగా కన్నులకు కట్టిస్తుంది :

'మానాదే-మహాగట్టివాడు-మకుటంలేని మహారాజయ్యేవాడు
కావి ముసలిదాన్ని, మసక మసక కన్నుల దాన్ని,
మూల మూల ముడుచుకు కూర్చున్నదాన్ని
మనువు చేసుకోవాలన్న ఉబలాటంతో
మంచీ చెడ్డా మరచి పోయాడు
మర్యాదల్ని అతిక్రమించాడు
మరి పనికి రాడు.

దీనికి వేరే వ్యాఖ్యానం అవసరంలేదు. పైతరహా కవిత్వం 'పనికిరాదు మరి !'

రెండవదాని విషయంలో గూడా శ్రీశ్రీని గురించి తిలక్ అన్నది అచ్చు గుద్దినట్టు సరిపోతుంది. 'విదేశాల చవకబారు పానీయాలు సేవించడం' వల్లనే వీరికీ జాడ్యం సంక్రమించింది. వీరికిప్పట్లో మనదేశనైసర్గిక స్వరూప స్వభావాలు అవగాహన అవుతాయనే ఆశలేదు.

ఒక ఉద్యమంకానీ, ఒక తిరుగుబాటుకానీ అది ఆదేశం యొక్క నైసర్గిక స్వభావాన్ని లేక కనీసం స్వభావంలోని కొన్ని గుణాలనైనా ఆధారం చేసుకొని నిలదొక్కుకుని, ఆదేశ పరిస్థితిని తనాశించిన మేరకు క్రమంగా ప్రగతివైపు మార్చాలి. అప్పుడు కానీ ఆ ఉద్యమం, ఆతిరుగుబాటు విజయవంతం కాదు.

మార్క్స్ సిద్ధాంతాలు సమాజ ప్రగతికి ఉత్తమమైన మార్గాలు, నిజమే కానీ వాటి నలాగే ప్రవేశ పెట్టితే ప్రయోజనం లేదు. ఆయా దేశాలు వాటిని తమకు అక్కర అయిన విధంగా మార్చుకుని ప్రవేశ పెట్టుకున్నాయి. ఆ విధంగా పుట్టినవే లెనినిజం, చౌనిజం, మావోయిజం మొదలైనవెన్నో. వీటి కన్నింటికి పునాది మార్క్సిజమే; అలాగే మార్క్స్ సిద్ధాంతాలను మనదేశ నైసర్గిక స్వభావాని కనుగుణంగా మార్చుకుని ప్రవేశ పెట్టుకోవాలి. అలాకాక ఇతర్లని కాపీ కొట్టితే అది మన దేశానికి సరిపడదు అది మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించదు. ఉదాహరణకి లెనినిజాన్ని తీసుకుందాం. మార్క్స్ సిద్ధాంతాల్ని లెనిన్ తన దేశకాలాల కనుగుణంగా వాటిని ప్రవేశపెట్టాడు. లెనిన్ ఆచరణని మనం కాపీ కొట్టాలంటే మనదేశం రష్యాకాదు. ఆనాడు రష్యాని నిరంకుశంగా పరిపాలించిన జార్ చక్రవర్తిలాగా మనదేశాన్నిప్పుడు ఏ చక్రవర్తీ పరిపాలించడంలేదు. మనది ప్రజా ప్రభుత్వం ఈ ప్రజా ప్రభుత్వంలో కొన్ని లోపాలున్నాయి. లోపభూయిష్టమైన ఈ ప్రభుత్వాన్ని పడగొట్టాలంటే ముందు ప్రజల్ని మెప్పించాలి. ప్రజల మెప్పు పొందని ఏ ఉద్యమమూ ఒక్కడుగు ముందుకు వేయదు, అలాకాక మరొకడ్ని కాపీ కొట్టడానికి పూనుకుంటే ఎదుటివాడిని చూచి మనమూ వాతలు పెట్టుకోవడమే అవుతుంది ఇప్పుడు మనకు కావలసిందిలెనిన్ కాని మరొకర్ని కానీ కాపీ కొట్టడం కాదు. లెనిన్ లాంటి ప్రతిభావంతుడు మనలో ఒకడు పుట్టి, మార్క్స్ సిదాంతాలను మనదేశ నైసర్గిక స్వభావాల కనుగుణంగా మార్చి. సమాజాన్ని ఆ మేరకు నడిపి చేవాడు కావాలి.

పైన చెప్పిన రెండవ వర్గంవారు లెనిన్, మావో ఇజాలకు కార్బన్ కాపీలు. ఇలా కార్బన్ కాపీలు తీయడం వల్లనే వారికి మనదేశ నైసర్గిక స్వరూప స్వభావాలు అవగాహన కాలేదని అర్థమైపోతోంది. మూడవ వర్గం మార్క్స్ సిద్ధాంతాల్ని మనదేశ నైసర్గిక స్వరూప స్వభావాల కనుగుణంగా మలచుకొని సమాజ ప్రగతిని సాధించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మార్గంలోనే మనదేశం బాగుపడాలి. లేకుంటే అన్యథాశరణం నాస్తి.

సాయుధ పోరాటం వినాదాల నాధారం చేసుకుని లేచిన ఉద్యమం ఏదైనా కానీ అది మన దేశంలో నేల విడిచిన సామే అవుతుంది. వారెన్ని దప్పులు వాయించినా వారికి మనదేశంయొక్క సమాజంయొక్క, ప్రజల యొక్క నైసర్గిక స్వరూప స్వభావాలు అర్థం కాలేదనే చెప్పాలి. మనదేశంలో సాయుధ

పోరాటం విఫలమైంది. విఫలత్వాన్ని గుర్తించి కూడా దాని నాయకులింకా కొన్ని ఊత పదాలతో ఊరేగుతున్నారు. నక్సలైట్ ఉద్యమం ప్రజోద్యమం కాదు. అది ప్రజలలో ఇమడలేదు. ప్రజలు వ్యతిరేకించిన ఉద్యమం విజయం సాధిస్తుందనుకోవడం మూర్ఖత్వం. ఆ ఉద్యమం ఎప్పుడు ప్రజలది కాక పోయిందో. దాన్ని ఆధారం చేసుకుని వచ్చిన కవిత్వం కూడా ప్రజా కవిత్వం కాదు. ప్రజా కవిత్వం కానిది ప్రజల్ని ఎలా ప్రభావితం చేస్తుంది ?

సాయుధ పోరాటం అనే మాట నేటి మన కవిత్వంలో దిగంబర కవుల నుంచి ప్రారంభమైంది. దీనికి చాలా పిల్లలు పుట్టాయి. తిరుగుబాటు కవిత్వమనీ, సంఘర్షణ కవిత్వమనీ ఇంకాఎన్నో. దిగంబర కవుల కంఠంలో శ్రీశ్రీకి బెదిరింపు వినబడింది. తను వాళ్ళకి తాళం వేయకపోతే వాళ్ళు తన నెక్కడ విశ్వనాథ వర్గంలో జమకట్టేస్తారేమో నని దిగంబర కవుల బట్రాజయ్యాడు. దిగంబర కవులు శ్రీశ్రీలోని ఈ దౌర్బల్యాన్ని పసి గట్టారు. అదును చూచి 'ట్రాప్' చేశారు. దిగంబర కవుల్లో కొత్త సభ్యుని పేరు నమోదు కాగానే 'దిగంబర'—'విప్లవం'గా మారింది. తప్పటడుగులు వేస్తున్నవాళ్ళు రిటైరు అయిన వాళ్ళూ అంతా కలసి మేం 'విప్లవ కవులం' అన్నారు అది చివరికి విరసమై కూర్చుంది.

'నవత్వం + మానవత్వం = కవిత్వం' అని నిర్వచించిన శ్రీశ్రీ నేడు హింసను సమర్థిస్తున్నాడు. నవత్వమంటే సరే- తల క్రింద బెట్టి నడిచినా అదో నవత్వమని బుకాయించవచ్చు. మానవత్వాని కిప్పుడు ఏం నిర్వచనం ఇస్తాడు ? మనిషిని మనిషి నరుక్కోవడం మానవత్వమంటాడా ? అదే మానవత్వమైతే మరి దానవత్వమనేది ఎక్కడుంది ?

'మేం తిడుతున్నాము. ఎవర్ని? తిట్టవలసిన వాళ్ళనే తిడుతున్నాము'— అంటున్నారు వీళ్ళు. తిట్టేది కవిత్వం కాదు. మనిషిని మట్టుబెట్టాలనేది అంత కంటేకాదు. వ్యక్తిని కానీ, వర్గాన్ని కానీ, సమాజాన్ని కానీ మార్చేది కవిత. పరిమార్చేది చట్టం. చట్టం కూడ మనిషి శ్రేయస్సునేకదా వాంఛిస్తుంది. పరిమార్చితే అది చట్టం ఎందుకవుతుంది ? అంటారేమో ! వివరిస్తాను.

తప్పు చేయని వాడిని గురించి ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ లేదు. మేధావి వర్గంకానీ, ప్రభుత్వ శాసనాలు కానీ ఆలోచించవలసిందల్లా తప్పు చేసిన వాడిని గురించీ, పతనమైన వాడిని గురించీ మాత్రమే ! చేసిన తప్పుకు వ్యక్తిని బలి

చేస్తుంది చట్టం. చేసిన తప్పువల్ల జరిగిన నష్టాన్ని, జరుగనున్న ఘోర భవిష్య త్పరిణామాన్ని వివరించి ఆ వ్యక్తి ఇంక తప్పు చేయకుండ అంతర్ని ర్దేశం కవిత్వం చేస్తుంది. మన సమాజం కవిత్వానికి మారే స్థితిని ఎప్పుడో దాటి పోయిందంటారేమో ! ఆ మాటలో కూడ నిజం లేక పోలేదు. మేక పెంటికల లాంటి 'లిమబుక్కు'ల కవిత్వానికి మాత్రం మారదు. ఎందుకంటే అది కవిత్వం కాదు కనుక !

'నేను ముసలి వాణ్ణి
కాను అసలు వాణ్ణి
పడగెత్తిన తాచుపాము బుసల వాణ్ణి
పీడితుల వెంటేసుకు పసలు వాణ్ణి
అందుకున్న ఆకాశపు కొసల వాణ్ణి'

అని బుడబుక్కల వాని స్వీయశంఖ పూరణ కోసం, పర దూషణ కోసం ప్రత్యే కింప బడిందది.

నేను చెప్పేది నిజమైన, శక్తివంతమైన కవిత్వాన్ని గురించి ! ఏనాటికైనా నిజమైన కవిత్వానికి సమాజం ప్రభావితమై తీరుతుంది. ప్రభావితం కాలేదంటే అది సమాజ లోపం కాదు. కవితా శక్తి లోపమే అంటాను. నేటి కవిత్వంలో ఆ లోపం ఎందుకు వచ్చిందో, నేటి సమాజాన్ని బలంగా ప్రభావితం చేయలేని దౌర్బల్యం ఎక్కడ ఉందో -దాన్ని గురించి ఎవరూ ఆలోచించడం లేదు.

ప్రభావితం చేయడం కవిత్వానికి పనికి రాదు. శాసించడమే దానికింక శరణ్యమంటారేమో ! అది మూర్ఖవాదమంటాను శాసిస్తే ఎంత శిశువైనా ఒక సారి సహిస్తాడేమో ! రెండోసారి ఎదురు తిరుగుతాడు. ప్రజల సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఇందుకు చారిత్రక సంఘటన లెన్నో సాక్ష్యం చెబుతున్నాయి. ఇంక కవిత్వం శాసిస్తే ఎవడు వింటాడు ? అక్షరానికో ముక్కగా చించి అవతల పారేస్తాడు. సంగీతంతో ప్రకృతిలో, పశు సస్యాదులలో మార్పును, మంచి ఫలితాలను పొందవచ్చునని శాస్త్రీయంగా నిరూపిస్తున్నారు. సాహిత్యంతో మనిషిని ప్రభావితుణ్ని చెయ్యడం దుర్లభమేమీ కాదు, సవ్యమైన మార్గంలో ఆలోచించడం మానుకున్నవారికి అన్నింటా పెడర్థాలే కనిపిస్తాయి. ప్రబంధ కవులకు అన్నింటా శృంగారమే కనిపించింది. వీరి కన్నింటా

జుగుప్సే కనిపిస్తోంది. ఇది చికిత్స కందని కామెర్ల రోగం. వీరు అంటే దిగంబర కవులా? విప్లవ కవులా? అని తేల్చుకోవడం గూడా గొడవే! వీరిని దిగంబర కవులంటే — 'మేమింకా ఇక్ష్వాకుల కాలంలో ఉన్నావు. మేమెప్పుడో విప్లవ కవులుగా మారిపోయా' మంటారు. పోనీ విప్లవ కవులనే అంటామనుకో 'మేమింకా వి. ర సం. పేరుతో కవిత్వం ప్రచురించనే లేదే! దేన్ని ఆధారంగా మమ్మల్ని తూకం వేస్తావు?' అంటారు అవకాశవాదులకు నోరు పెద్దది. ఏమైనా అంటారు. తమని గురించి ప్రచారం చేసుకుంటున్న పెద్ద పెద్ద మాటలు (అవి వారికే మింగుడు పడవు) మాత్రం చాలానే ఉన్నాయి. 'జ్యోతి' పాఠకు లెవరో అన్నట్టు– 'విప్లవ సాహిత్య సమస్తం పరదూషణ పరాయణత్వం' విప్లవ కవులు ప్రజల్ని గాలికి వదిలి ఎదుటి వాడ్ని వెక్కిరించి, తమ్మ హెచ్చు వేసుకుని ప్రచారం చేసుకొనే కేవలం ప్రచార కవులు. పోతే వీళ్ళతో మరొక ఇబ్బంది కూడా ఉంది. నిన్న దిగంబర కవులు నేడు విప్లవ కవులు. రేపు మరే కవులుగా మారుతారో– చెప్పలేం! బుద్ధి స్థిరత లేనివాళ్ళు ఎన్ని పేర్లయినా పెట్టుకుంటారు. ఆచరణ శూన్యమైన వాళ్ళు ఎన్ని ఉపన్యాసాలైనా ఇస్తారు. కవిత్వంతో సమాజాన్ని ప్రభావితం చెయ్యలేమనే దౌర్బల్యం వీరిలో ప్రబలిపోయింది. పోనీ ఆచరణలోనైనా వీరు చెప్పే సిద్ధాంతాల్ని ప్రవేశపెడుతున్నారా? అంటే అదీలేదు. అందుకే ఇలా ఊసర వెల్లులై పోతున్నారు.

కవిత్వానికి ఆర్తి మొదటిది. ఆవేశం తర్వాతిది. మనసులో ఆర్తిని బలమైన శబ్దచిత్రాల్లో పలికించ లేనపుడే కవిదుర్బలమైన ఆవేశంలో కవిత్వాన్ని చవకబారు పదజాలంలోకి దిగజార్చుతాడు శక్తివంతమైన ప్రభావాన్ని చూపలేనపుడే కవిత్వం ఫలిత శూన్యమైన, పరిహాసాస్పదమైన శాపన పత్రంలా తయారవుతుంది వీరిలో ఆర్తి కనిపించడంలేదు. ఆర్తిలేని కవిత్వం సమాజాన్ని ప్రభావితం చేయలేదు. వీరిలో ఆర్తికి బదులు చవకబారు ఆవేశం మాత్రమే మిగిలింది. శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాలలో ఎంతో ఆర్తి ఉంది. అందుకే అంత బలంగా పలికాయి రాను రాను శ్రీశ్రీలో ఆ ఆర్తి నశించింది. ఒట్టి ఆవేశం మాత్రమే మిగిలింది ఆర్తిలేని కవిత్వం ప్రచార సాహిత్యంగా తయారవుతుంది.

ఎదుటి వ్యక్తిగాని, పక్షంగాని, తప్పుదారి పట్టినప్పుడు విమర్శించ వలసిందే! విమర్శ అంటే వెక్కిరింతలూ, కారుకూతలూ కావు సహేతుకమైన

విమర్శ కావాలి. సహేతుకమైన విమర్శల కెవరైనా, ఎప్పుడైనా స్వాగతం పలకతారు. వీరి విమర్శలు సహేతుకమైనవి కావు పైగా ఒకటే గోలా అరుపూ! వీళ్ళిలా ఎందుకు రంపుచేస్తున్నారంటే కారణం లేకపోలేదు. ఎదుటి వాళ్ళ మార్గం ప్రజల్ని ఆకర్షిస్తోంది. అందులో వీళ్ళ మల్లే పెద్ద పెద్ద దోషాలు లేవు. వ్యక్తిగతమైన ఒకటీ రెండూ చిన్నచిన్న దోషాలున్నా వాటిని సహేతుకంగా విమర్శించగల శక్తీ ఓపికా వీరికిలేవు. పైగా తాము ప్రచారం చేసుకుంటున్న ప్రణాళిక అడుగడుగా బొందలే! ప్రజల తిరస్కారాలే! వాటి నన్నింటిని కప్పిపుచ్చుకోవడానికే ఇలా రంపూ, వెక్కిరింపూ అడ్డు వేసుకుని బ్రతుకుతున్నారు, వీరి ప్రణాళికనే వీళ్ళు కుదురుగా నిర్మించుకోలేరు. ప్రాథమికంగా వీరి ప్రయత్నాలు నిష్ఫలమై పోతుండగా దాన్ని అమలులో పెట్టడానికి తగిన శక్తీ, దమ్మూ ఎవరి నుంచి అరువు తెచ్చుకుంటారు?

వీరివల్ల కారుకూతలే నేటి కవిత్వమని సామాన్యుడికి భ్రాంతి కలిగించేంత విస్తృతమై పోయింది. సాహిత్యంలో ఇలాంటి కల్మష వాతావరణాన్ని మొదట ప్రవేశ పెట్టింది శ్రీశ్రీ. ప్రారంభంలో శ్రీశ్రీ దీన్ని కొంత ఔచిత్యవంతంగా వాడుకున్నా రానురాను కవిత్వానికి స్వస్తి చెప్పి ఇలాంటి కవిత్వానికే పట్టం కట్టి విపరీత ధోరణిలోకి జార్చి వేశాడు.

సాహిత్య శిల్ప ప్రయోజనాలలో చారిత్రక పరిణామాన్ని సృష్టించే ఉన్నత ప్రమాణాల కవిత్వాన్ని నిర్మించి యుగకర్త శిఖరాన్ని అందుకున్న తర్వాతనే శ్రీశ్రీ ఈ విపరీతమైన పోకడలన్నీ పోతున్నాడు. యుగకర్త అన్న తర్వాత తన కవిత్వానికేకాదు తన తర్వాతి తరంలోని మంచి చెడ్డలకు కూడా తానే బాధ్యత వహించాలి. శ్రీశ్రీ ఈ రకమైన బాధ్యతను విస్మరించాడు శ్రీశ్రీ ప్రారంభంలో తెలుగు సాహిత్యానికెంత మేలు చేశాడో తర్వాత అంత-కన్నా ప్రమాదకరమైన హాని చేస్తున్నాడు. తన తర్వాత యువతరానికి కసి-కారుకూతలే ఉత్తమ కవిత్వమనే భ్రాంతిని కలిగించి చెడగొడుతున్నాడు.

'వీళ్ళకి కళలన్నా రస
మన్నా చుక్కెదురు
గోలచేసి అరవడ మొక
టే వీళ్ళెరుగుదురు'

అవి వెనక ప్రాసక్రీడలాడిన శ్రీశ్రీ—నేటి తన కవిత్వంలో కళ ఉందా, రస

ముందా అని చూసుకుంటున్నాడా ? గోల, అరుపు తప్ప తన కవిత్వంలో ఏమీ మిగులలేదని ఎందుకు గుర్తించడు ?

తమ నాయకుడేం చేసినా అది గొప్ప పనిగానే భావించి అమాయకంగా దాన్ని విశ్వసించి అనుసరించడం యువతరానికి సహజం ; అది వాళ్ళ తప్పు గాదు. వాళ్ళకి నాయకుడూ, యుగకర్తా అయిన శ్రీశ్రీ దోషం ఇది. శ్రీశ్రీ లోని ఈ దోషం క్షమించరానిది. ఎందుకంటే భవిష్యత్సాహిత్య నిర్మాతలైన యువతరంలోని ప్రతిభఅంతా ఇప్పటికే మోసులోనే కుళ్ళి కంపుకొడుతోంది. వాళ్ళకు పుట్టే సంతానం పిండంలోనే ముర్రిగి మరెంత వికృత రూపాన్ని దాలుస్తుందో, తలచుకుంటే ఎవరికైనా భయం పుట్టుకొస్తోంది.

విరసంపుట్టి, అరసం పుచ్చుకున్న తర్వాత శ్రీశ్రీ విరసాన్ని వెనకేసుకు వస్తూ, ఎదుటి పక్షం (అ. ర. సం.) వారిని పేరుపేరునా 'జ్యోతి' మాస పత్రికలో అసందర్భంగా తిట్టిపోయడం ప్రారంభించాడు, తన పక్షం వారి మెప్పు పొందడానికోసం ; తిట్టడం మీకే కాదు మాకూ చేతొచ్చు అని ఎదుటి పక్షం నుంచి దాశరథి కంచు కంఠంతో లేచాడు. శ్రీశ్రీ ఒకింతగా తిడితే దాశరథి పదింతలుగా వాతలు పెట్టాడు. ఇందుకు దాశరథిని నిందించి ప్రయోజనంలేదు. మొదట ఎదుటి వాళ్ళని ఈ మార్గానికి ప్రేరేపించిన శ్రీశ్రీని నిందించాలి. అదే పత్రికలో దాశరథి 'హుత భుక్కులు' చదివిం తర్వాతైనా తను చేసిన తప్పుకు శ్రీశ్రీ నిజంగా సిగ్గుతో -- ఎంచుకోవాలి. శ్రీశ్రీ కింకా తెలిసి రాలేదంటే అది (అతన్నింకా మహాకవి ఆరాధిస్తున్న) మన దౌర్భాగ్యమే అనుకోవాలి. వీరి కీచులాటల కొమ్మలకు తగులుకుని మరింకెంత మంది మేధావుల దుస్తులో చిరిగిపోతున్నాయి. వీరి పెడసర పరిభాషా పదజాలంవల్ల సామాన్యుడికి నేటి ప్రతిభావంతులైన సాహి త్యమూర్తులందరిమీదా గౌరవం నశించి పోతోంది. తద్వారా ప్రజల దృష్టిలో సాహిత్యమంటే ఒక గడ్డి బొమ్మగా రూపుకట్టే ప్రమాదముంది

శ్రీశ్రీని గాని మరొకర్నిగాని భవిష్యత్తు మీద ఆశపెట్టుకున్న నాలాంటి యువకవుల పక్షం నుంచి నేను కోరేదేమిటంటే__పదిమందినీ తిట్టి పేరు తెచ్చుకోవాలని ప్రచార కవిత్వం రాసే బదులు. చేతనైనంతలో చైతన్యవంతమైన ప్రజాకవిత్వం వ్రాయమంటున్నాను. శక్తివంతమైన తమ ప్రతిభను పెడ మార్గాలలో ప్రవేశపెట్టి అదే ప్రజాకవిత్వమని తర్వాతి తరాన్ని మోసగించవద్దని ప్రార్థిస్తున్నాను.

"స్వాతంత్ర్యం, సమభావం,
సౌభ్రాత్రం. సౌహార్ధం,
పునాదులై ఇళ్ళులేచి
జనావళికి శుభం పూచి—
శాంతి శాంతి కాంతి శాంతి
జగమంతా జయిస్తుంది
ఈ స్వప్నం నిజమౌతుంది—"

—శ్రీశ్రీ

వసుమతి పాపం ఒంటరిది

భైరవయ్య

మంటలెండుతున్నాయి
వెన్నెలనే పదం ఉండేదని పండితుల వాదన.

వసుమతి పాపం ఒంటరిది
ఆమె చుట్టూ ముళ్ళు - బొమ్మ జెముళ్ళు
తలమీద రాబందులు ఇనుప డేగలు
రొమ్ము మీద పుండు
రొమ్ములపై ఆడుకునే పిల్లలు
ఇప్పుడు కెలుకుతున్న రాచపుండు

వసుమతి పాపం ఒంటరిది
ఆమెగోడు వినే వారెవ్వరూ లేరు
రొమ్ముల్లో మానని పీక్కాం పుండు
కెలుకుతున్న వెస్టోషియాలు - కాంబోడియాలు
ప్రెసిడెంట్లు - ప్రీమియర్లు
శస్త్ర చికిత్స పేరుతో
అణ్వాస్త్ర చికిత్స
పాలిండ్లలో పాషాణం పోసి
పాలిచ్చిన రొమ్ములనే తుచ్ఛమైన కోర్కెతో మర్దించి
పాపం తల్లి హృదయం ద్రవించి
రక్త శువులు స్రవించి

వసుమతి పాపం ఒంటరిది
కన్న బిడ్డలు కన్నీళ్లు తుడవాల్సిన వాళ్ళు
కరుకుదనంతో ఎముకలు కొరుక్కు తింటుంటే
కదల్లేక స్తంభించింది
తన వక్షోజాల్లోంచి స్రవిస్తున్న చీముని
తమకంతో నాకుతున్న అసుర కృత్యాన్ని
తన నెత్తుటితో దప్పిక తీర్చుకుంటున్న
జీవుల నిరంత దాహాన్ని
అవలోకిస్తూ కూర్చుంది

ఎన్ని కలలు
ఎన్ని ఆశలు
ఎన్ని సుందర స్వప్నాలు
అన్నీ—అన్నీ
తన బిడ్డలు
బంగారు గుమ్మలు
బాచాల కొండలు
ఏరీ—ఏరీ
తలలు నరుక్కునే వాళ్ళు
సజీవ నర మాంస భక్షకులు
తల్లి కడుపు కోసి
గుండెలో గోతులు తవ్వి
తమి తీరని ఆకలితో . . .

ఎప్పుడు . . . ఎప్పుడు విముక్తి
ఈవిశృంఖలత
ఈ కావేషం - కార్పణ్యం
జీవ చైతన్యాన్నిచ్చే తల్లి స్తన్యం కోసి

పొగాకు సంచీ చేసుకునే నాగరికత
శాస్త్ర పరిశోధనల పేరిట
సశాస్త్రీయంగా జీవ చైతన్య నిర్మూలన
ఒక్కొక్క అణ్వస్త్ర పరీక్ష వెనుక
ఎన్ని ఆక్రందనలు
ఎన్ని ఆకలి కేకలు
ఎందరు పసిబిడ్డలు
ఎంత మంది అష్టావక్రులు
నాడు జర్మనీలో మొలిచిన గజ్జి పొక్కు
తామరలా ఒళ్ళంతా పాకుతోంది
ఎప్లాస్టిక్ ఎనీమియా ఒచ్చి
కుష్ఠు రోగ మొచ్చి
శరీరంలో ఒక్కొక్క ఖండమే కుళ్ళిపోతోంది

ఆ నాడు
వాన జల్లులు
మనసులో మధురమైన హాయిని నింపేవి
నదుల కడుపులు పండి
ఈ జగత్తు పులకించి
పువ్వులు పరిమళించి
తొలకరి చినుకుల్లో తడిసిన వసుమతి
సుగంధాలు వెదజల్లేది

నేడు
అణ్వస్త్రాల తుఫానులు
నగరాల పల్లెల పొత్తిళ్ళలో మారణ హోమాలు
విరుల వికృతాకారాలు
విషాన్నం భుజించిన

వసుమతి శరీర దుర్గంధాలు
ప్రతి అడుక్కీ ఒక అగ్ని పర్వతం బద్దలై
నిమిషానికో దేశ చైతన్య స్రవంతి ఎండిపోయి
ఆది మానవ నాగరికతలోకి
ప్రపంచం పరుగు
పందెపు గుర్రం నురుగు
అందుకు ప్రపంచాధినేతల
నాగరికాగ్రగాముల
ఆధునికాణ్వస్త్ర ప్రయోగ శీలుర
ఉత్సాహ వైఖరి
యుగ పరిసమాప్తి చేస్తామని
భూమిని బద్దలు చేసి
తునా తునకలుగా
ఈ విస్తృత విశ్వంలో విసిరేస్తామని
తామున్న చెట్టుకొమ్మ తామే నరుక్కుంటామని
వారి ఏకగ్రీవ తీర్మానం

వసుమతి పాపం ఒంటరిది
హిరణ్యాక్ష బారినుండి కాపాడిన వరాహం
ప్రస్తుతం బురద గుంటలో పొర్లాడుతున్నట్లున్నది

అణు దుమారం చెలరేగింది
సముద్రంలో సహారా ఎడారిలో
పరమాణు పరిమళం వ్యాపించింది
పచ్చని పైరు భూమి ఎడారితో వియ్యం కట్టింది

నదీ జలాలకి పుట్టుకలో సంధి కొట్టింది
సాగరంలోబడ డాగ్ని తప్ప మరేదీ లేదు

గాల్లో గరళం—భూమ్మీద లావా
విందులు చేసుకుంటున్నాయి.

పచ్చి మాంసం తింటున్నాడు నూతన యుగ మానవుడు.

కవిత్వంలోనూ, జీవితంలోనూ *Economy of words and thoughts* లేకపోవడం దేశభక్తి కన్న హీనమైన పాపం, ఆత్మలోకంలో దివాలా.

-- చలం

అగ్నిని ఆర్పేయకండి!

ఏ. సూర్య ప్రకాశ్

అగ్నిని ఆర్పేయకండి
అగ్నికి వాయువు తోడై
మంటలు మింటి నంటి
బ్రతుకుల్ని పరశురామ ప్రీతి చేసి
లోకాన్ని స్మశానం చేయకుండా
అప్రమత్తంగా గమనించండి చాలు
అంతే కాని
అసలు అగ్ని వద్దే వద్దని వాదించకండి

అగ్నిని సొంతం ఆర్పేస్తే
వుండదు వేడి వుండదు వెలుగు
వుండదు ఉత్తేజం వుండదు చైతన్యం
హృదయంలో మస్తిష్కంలో
చీకటి గడ్డ కడుతుంది
చలి ఎముకలు కొరికేస్తుంది
గుబులు గుండెల్ని పిండేస్తుంది
నాలుకపై నిట్టూర్పు పిడచ కడ్తుంది.

నిక్కుతూ నీలుగుతూ
ముక్కుతూ మూలుగుతూ
కణకణలాడే నిప్పు కణిక మీద
కన్నీటిధార కురిపించి
చప్పగా చల్లార్చకండి
శవంలా జడంగా బ్రతక్కండి!
అగ్నిని ఆర్పేయకండి!!

వర్తమాన సాహిత్యంలో వక్రరేఖలు

ఇటీవల మనదేశంలో విచిత్రమైన 'విప్లవ' రచయితలు బయలుదేరారు. వీరు మార్క్సిజాన్ని ఒక విప్లవసిద్ధాంతంగానే తప్ప- ఆచరణ ప్రేరేపకశక్తిగా (Guid for Action) గుర్తించరు. అంటే రక్తసిక్త విప్లవానికి అమాయకులైన అతృప్త జనావళిని ప్రేరేపించడమే తప్ప- తాము స్వయంగా 'విప్లవం'లోకి దుమకరు. ఇలాంటి వాచావిప్లవకారులకు శేషజీవితంలోని శ్రీశ్రీ నాయకుడు కావడం అన్నిటికన్న శోచనీయస్థితి. ఇట్టి వీర విప్లవ రచయితలు- ఆచరణలో తమ ఉనికిపట్లను జాగ్రతగా కాపాడుకుంటారు. మాటలలో వీరివాస్తవిక వాదులుగా నటిస్తారు. తాడూ బొంగరంలేని- తిరుగుబాటు సాహిత్యాన్ని సృష్టిస్తారు. మరికొంతమంది రచయితలు, తాము సృష్టిస్తున్న సాహిత్యం ఎలాంటిదైనా విప్లవ వాచాలత్వంతో వీరవినాదాలుమాత్రం వల్లిస్తుంటారు. అలా విప్లవ వినాదాలు వల్లించని యితర రచయితలను అవకాశవాదులనో, వంటయింటి కవులనో— ఏమరకుండా నిందిస్తూవుంటారు. ఇదే వీరి ప్రధాన విప్లవ భూమికగా భ్రమిస్తూ వుంటారు.

సర్వవంచనలకీ ఆదిమూలం ఆత్మవంచన. ఆ శిల్పంలో గణనకెక్కిన వారి లోకవంచనా కార్యక్రమం- అతి సులువుగా, సజావుగా సాగిపోతుంది

సోమసుందర్

ఎవరిఖర్చుమీదనైతేనేం ?— వందలాది రూపాయలు వెచ్చించి విదేశీ పానీయాలనుచివరిబొట్టువరకూ గటగటా త్రాగి. (Drank to the brink) స్వంత డబ్బులతో కాస్త మంచిబట్టలు కుట్టించుకొన్నవాళ్ళని బూర్జువా రచయితలుగా నిందించడం ఇలాంటివారి ప్రధాన విప్లవం. మరొకరకం విప్లవ రచయితలున్నారు. వంటసారా మొదలుకొని (అది వున్నప్పటి సంగతే?) విదేశీపానీయాలవరకూ నిత్యం పారాయణం చేస్తూ, విప్లవ నినాదాలు మాత్రం కురిపిస్తూ ఉంటారు. మరికొందరు ఆరుద్ర చెప్పినట్టుగా. అధర్మాన్యాయి పుట్టు జుత్తు లివ్వడానికి- శ్రీనివాసుని కొలువుకి పోయే రచయితలు మాట మాటకు విప్లవవీర నినాదాలుచేస్తూ వుంటారు.

మరికొందరు— ఎవరో పలుకుబడిగల ఒక మహా సంపాదకుని ఆశ్రయించుకొని బ్రతుకుతూ, వారి చలువవల్ల గృహశాఖామాత్యులకు పాదాక్రాంతులై- జెయిళ్ళనూ నిర్బంధాలనూ తప్పించుకొని కాలం వెళ్ళమార్చుకుంటున్న రకం వారు !

మొత్తానికి నానా గోత్రీకులూ కూడా. విప్లవనినాదాలతోనే తప్ప విప్లవాచరణతో తమకు నిమిత్తం లేదనే దృఢనిశ్చయంతో బ్రతుకుతున్నవాళ్ళే ! ఇలాంటి చీపురుపుల్లవంటి పిండిబొమ్మలద్వారా దేశంలో సంభవించేది ఎలాంటి విప్లవమో అందరికీ తెలుసు ! ఆచరణతో నిమిత్తంలేని విప్లవ నినాదాలవల్ల జాతి విప్లవ చైతన్యాన్ని కోల్పోతుంది. తాత్త్వికావగాహన లేని విప్లవ కార్యాచరణ వల్ల జాతికి అంధత్వం సిద్ధిస్తుంది. ఇది మాత్రం త్రికాలాబాధితమైన సత్యం.

సాహిత్యంలో మిలిటెంటు పోర్సుగా తమను తాము చిత్రించుకొనే దిగంబరులు (Self styled) తమ ఆరుగురిలోనూ ఒకరిని తమ బృందంనుంచి (Band) యిటీవల తొలగించివేశారు. మిగిలినవారూ ఈ కుష్టువ్యవస్థలో చక్కగా ప్రభుత్వోద్యోగాలో మరో ఉద్యోగాలో చేసుకుంటున్నవారే; ఎవరూ ఎక్కడా ఉద్యోగాలు లేకుండా "ఊడగొట్టిన మంచంకోళ్ళవలె" పస్తులతో బ్రతకమని ఎవరూ చెప్పరు. కాని తమ 'ఆశయాల'తో నిమిత్తం లేని వ్యవస్థతో ఆర్థికసంబంధాలు కలిగివున్నవాళ్ళే !

ఏమైనా మహాస్వప్నకొాక మంచి అవకాశం లభించింది. కృతకమైన, నిర్లిష్టమైన, ఆత్మవంచనా పరమైన— ఈ దిగంబర (పగటి) వేషధారణం విప్పేసి, రంగులు కడిగేసుకొని, తన సత్స్వరూపాన ప్రజల ముందుకువచ్చి, ఆచరణలో చిత్తశుద్ధినీ, తాను నమ్మిన రీతిలో ఉత్తమ కవితాభివ్యక్తినీ ప్రదర్శించుకొొందుకు చక్కని అవకాశం లభించింది ఆచరణలో తన హృదయ పరివర్తనాన్ని రుజువు చేసుకొంటే, అభ్యుదయ సాహిత్యమూ, అస్మదాదులమూ స్వాగతం పలకగలగడంలో సందేహంలేదు.

* * * *

ఇటీవలి కొద్దికాలంలో కారణాంతరమైనా ప్రఖ్యాతిలోకి వచ్చిన రచయిత ఒకరున్నారు. వారు ఉన్నత విద్యాధికులేనట. ఆంధ్రాంగ్లాలలో రచనలుచేసి నలుగురికంటా పడ్డవారు. వారీమధ్య అతివాద ధోరణిలో చాలా "సాహిత్య విమర్శలు సరఫరా చేశారు దిగంబరులను బలపరుస్తూ విరివిగా వ్యాసాలు రాశారు. వాటన్నింటి మాటకేంగాని, సృజనలో శ్రీశ్రీ పై— విప్లవపథనిర్దేశకుడు" అనే వ్యాసం రాశారు. అందలి కొన్ని అభిప్రాయాలుమాత్రం పరిశీలనార్హాలు.

ఇది కేవలం— సోదాహరణంగా రుజువు చేయడానికి పూనుకోని ప్రశంసా వ్యాసం. కనుక విమర్శించితే, "ఏదో హేలగా వ్రాసినది— దానినంత పట్టించుకోవాల్సిన పనిలేదు !" అని వారో, వారిని బలపరిచే "విమర్శకాగ్రేసరు"లో సీఘ్ననముల వచ్చు.

శ్రీశ్రీ సాహిత్య జీవితాన్ని సమగ్రంగా పరిశీలించ నిరాకరించి, ఆయన అడపా తడపా వాక్రుచ్చిన విప్లవ వినాదాలను మాత్రమే స్వీకరించి భజించే వ్యాసమిది. కనుక ఆ వ్యాసాన్ని ఆ పరిధిలోనే అవగాహన చేసుకొని కొంత వెసులుబాటు కేటాయించవలసి వుంటుంది.

కాని చిక్కేమిటంటే — శ్రీశ్రీ తప్ప తక్కుంగల కవి రచయితలంతా గబ్బు ఆలోచనా పరులేనని ఒక మహా సిద్ధాంతాన్ని ఈ వ్యాసం మన ముందుంచుతుంది.

శ్రీశ్రీ లేఖినిని ఈ వ్యాసకర్త యిలా కీర్తించారు. "ప్రజలనే స్వర్గా జ్ఞానం అతని కలానికుంది. చరిత్ర అనే లోచనాలు ధరించిన కల మది.

గ తాన్కిదృష్టిని అలవర్చుకున్న గంట మది'' అన్నారు వీరు శ్రీశ్రీ గారిలో కొరవడినదిదేనని ఇదే సంచికలో ఇతర విమర్శకులు సోదాహరణంగా రుజువు చేశారు.

శ్రీశ్రీ ప్రతిభా విశేషాలను, దర్శనను తరువాతి తరాల రచయితలంతా హృదయపూర్వకంగా ప్రస్తుతించిన వారే. కాని యీ ప్రస్తుత ప్రశంసలోగల సద్గుణమేమిటంటే – శ్రీశ్రీ తప్ప వేరొకరెవ్వరూ విప్లవ కవులే కారు అనే నిర్ణయానికి ప్రజల్ని నడిపించాలనుకోవడం. అదైనా శ్రీశ్రీ శ్రీకాకుళం పోరాటాలను బలపర్చినంత వరకే విప్లవ కవి! అది విరమించాడో దేవిడీ మన్నాయే!

గతంలో మితవాద విమర్శకులు వర్తమాన కవులను త్రోసి రాజనే ఉద్దేశంతో – "శ్రీశ్రీ ఒక్కడే కవి; తరువాతి వారెవరూ కవులేకారు." అనే ఒక ప్రవాదాన్ని మోపి దేశంపై చాలా పెంట త్రోలారు. కాని ఆ విమర్శకమ్మన్యుల వావాలేమీ మిగలలేదు. శ్రీశ్రీ ఎంత కవో, తరువాతి వారు అంతకిస్నెట్లు అధిక కవులుగా సుప్రతిష్ఠులయ్యారు. వారివి బుద్ధి పూర్వకంగా అప్రతిష్ఠ పాల్జేయాలనే ఉద్దేశం యిలాంటి విప్లవ వ్యాసకర్తల్లో మితిమీరుతోంది. కనుకనే యిప్పుడు మళ్లీ – 'శ్రీశ్రీ ఒక్కడే కవి; తరువాత దిగంబరులు తప్ప మరెవ్వరూ కవులేకారు' అనే ధోరణి పేట్రేగుతోంది. ఇవి చరిత్రనీ, వ్యక్తుల పాత్రనీ బుద్ధి పూర్వకంగా అపభ్రంశం పాల్జేయడమే (falsification) తప్ప అన్యం కాదు.

ఈ వ్యాస కర్త యిలా అంటున్నారు : "ఆ ఎక్కిన కైపు (శ్రీశ్రీకెక్కిన మార్క్సియన్ తత్త్వమట!) ఆనాడు ఎలా వుందో, ఈనాడు అలాగే వుంది. కొందరిలో మాదిరి అది దిగి పోలా! పైగా అది గుణకారం పొందుతోంది." అని వీరు చెప్పిన సత్యమిది "శ్రీశ్రీగారికి కైపు' ఎక్కిన మాటతో ఎవరికీ వివాదం ఉండాల్సిన పనిలేదు. ఆ కైపు మార్క్సియన్ కైపుకాదని – ఒక విమర్శకాగ్రేసరు లిదివరకే రెండు మూడు వ్యాసాలతో రుజువు చేశారు. పోతే "కొందరిలో మాదిరి అది దిగిపోలా!" అన్న వీరి మాట సంపూర్ణ సత్యం కాదు. కారణమేమంటే – ఈ కొందరిలో ఆ శ్రీశ్రీగారి కెక్కిన కైపు

మాదిరిది. ఎన్నడూ ఎక్కనే లేదు! ఎక్కనిది గుణకారం పొందడమో, దిగిపోవడమో జరగడం సంభవమే కాదు! శ్రీశ్రీగారిలో గుణకారం పొందగా వచ్చిన రాశేనేమో "మేమే" వగైరా సక్రియలిస్టు హీన సారస్వత లక్షణాలు!

"ఇటీవలి కాలంలో జ్వాల, ప్రజారథం పత్రికల కిచ్చిన యింటర్వ్యూలు; ఇవి విప్లవకవిగా శ్రీశ్రీ మనోభావాలు ఎంతటి జ్వరోగ్రతలో నేడు ముందుకు సాగుతున్నాయో స్పష్టం చేస్తాయి." అన్నారీ వ్యాసకర్త. అసలు జ్వాల పత్రిక వాళ్ళు యింటర్వ్యూలో తానన్న మాటలకు అపార్థాలు కల్పిస్తూ రాశారని శ్రీశ్రీ గారంటున్నారు. అసలింతకీ ఎవరవకాశవాదులో భగవంతుడికి తెలియాలి! కాని ఈ వ్యాసకర్తకి ఎంత విప్లవ దురభిమానం ఉన్నా ఒక విజం మాత్రం చెప్పకుండా ఉండలేక పోయారు. 'శ్రీశ్రీగారికి కైపు మాత్రమే కాక జ్వరోగ్రత కూడ' ఉన్నదని! కాని జ్వరోగ్రతలో ముందుకు సాగితే — వచ్చేది అసంబద్ధ అసంగత సంధి ప్రేలాపనలేకాని అన్యం కాదని వీరికి తెలుసు. తెలిసే శ్రీశ్రీ పర్యవసానాన్ని విశదీకరిస్తున్నారేమో మరి!

తాత్త్వికావగాహనా విరహిత వినాదాలూ, చౌకబారు ట్రిక్కులూ—ఆరుద్ర చెప్పినట్లు గేలరీకోసం ప్లే చేసేవారు—గమ్మత్తులతో ప్రజల్ని ఆకర్షించగలరేమో ఒప్ప, ప్రజలకు సంశయ కల్లోలంలో ఆధార భూతులు కాలేరు! (ఆషాఢ భూతు లవుతారని చెప్పడం వ్యాసకర్త ఉద్దేశం కాదు కదా!)

జ్వాల యింటర్వ్యూలో శ్రీశ్రీగారు తాను సినీమాయలోకం నుంచి విరమించి శ్రీ కాకుళం వెళ్ళిపోతున్నానని ఆనాడు ఉద్ఘాటించి మనల్నందరినీ భయ పెట్టారు! కాని ఈ నాడు మళ్ళీ-తాను శ్రీ కాకుళం వెళ్తానన్నది — 'పోరాటానికి కాదు, పరిశీలించడానికే నంటున్నారు సృజన యింటర్వ్యూలో. ఇలాంటి స్వవచన వ్యాఘాతాలు శ్రీశ్రీగారి మార్క్సియన్ పైపుకు తొలినాటినుంచీ అల వడినవేనని మనం అనరాదు. కారణమేమంటే వారు శ్రీకాకుళం వెళ్ళనూ వెళ్ళేరు అయితే 'విప్లవానికి' కాదు. సన్మానం అందుకోడానికి!

"రాజకీయార్థిక పరిణామాల్ని పసిగట్టలేని పసివాడు కాడాయన. ఆయన పసి తనమల్లా పాత పుణ్యం పేరుతో పేరుకు మాత్రం బ్రతుకుతూ కొంత మందిలా తప్పించుకు తిరగలేకపోవడమే! అందుకే యితరత్రా అనేకమంది

'అభ్యుదయ కవులు" వెనకబడిపోతూంటే ఈయన ఉన్నకొద్దీ యువకుడవు తున్నాడు. భావాల్లో ! (చూడు సృజన : పుట 8) అన్నారీ వ్యాసకర్త విప్లవ తత్వజ్ఞులు సమ్యక్ దర్శన చేస్తారు. అలా చేయాలని సర్వులూ ఆశించాలి. కాని 'పపి' గట్టడం ఏ జీవి లక్షణమో మనం వివరించుకోకూడదు. శహబాష్ ! ఈ వ్యాసకర్త గారి దార్శనికత వర్ధిల్లు గావుత !

ఆచరణతో నిమిత్తంలేని చౌకబారు విప్లవ నినాదాలు ఇవ్వనొల్లని కవులంతా పాత పుణ్యంతో పేరుకు మాత్రం బ్రతుకుతూ తప్పించుకు తిరుగుతున్న వాళ్లేనట ! ఆచరణ మాట ఎలా ఉన్నా-తనను ఓప్పించి లోకమంతా పిడుగు పడినా పర్వాలేదనే పేరిసెట్టి మనస్తత్వంతో పై విప్లవనినాదాలుచేసే వాళ్ళంతా శ్రీశ్రీవలె మొనగాళ్ళన్న మాట ! ఆచరణతో నిత్త లేకపోయినా పర్వా లేదనుకొనే వినూత్న మేధోవాదం యిలాంటి అరిష్ట వాదాలకు కారణమవు తోందన్న సత్యం ఈ వ్యాస కర్తల కెప్పటికీ అర్థం కాదు. కనుకనే, ఈ దేశంలో ప్రస్తుతం పెంపొందుతూన్న కవితావగాహనా దారిద్ర్యం యిట్టి శుష్క విప్లవ ప్రియులలో వర్ధిల్లుతోంది.

శ్రీశ్రీ యిటీవల రచించిన మహా కావ్యాలు... జ్వాల ప్రజారథాలకిచ్చిన ఇంటర్వ్యూలు కారణమేమంటే ఈ వ్యాసకర్త ముందు పేరాలో- "మరో ప్రపంచం, దేశచరితలు, ప్రతిజ్ఞ ; రథ చక్రాలు నేటికీ ఎలా కాలాతీతాలో- ఖడ్గసృష్టి. శరశ్చంద్రిక ; సామాన్యుని కామనలు కూడ అలాంటి కాలాతీతమైన కళాఖండాలే ! "నని శ్రీశ్రీ ఉత్తమ కావ్యాలను పేర్కొంటున్నారు. వెను వెంటనే వీరు-"అంతకన్న విశేషం, యిక్కడ వివరాలు చర్విత చర్వణ కాకుండా చెప్పుకోవాలంటే - ఇటీవలి కాలంలో జ్వాల, ప్రజారథం పత్రికల కిచ్చిన ఇంటర్వ్యూలు !" అంటూ తమ సమ్యక్ దృష్టిని పొందు పరచారు. పైన పేర్కొన్నఉత్త కావ్యాల లిస్టుకుయిటీవలి కాలంలోదీటైనవీ-సాటైనవీ జ్వాలాది పత్రికల కిచ్చిన యింటర్వ్యూలేనని వీరి రసజ్ఞతా ప్రకటన ! విప్లవ 'మైకం'లో పడిన 'నిషా'దులకు ఏది కవిత్వమో, ఏది వాచాలత్వమో తెలియక పోవడంలో విడ్డూరం లేదు.

శుష్క రాజకీయ నినాదాలను కవి వల్లించి తీరాలని ప్రపంచంలో మహా విప్లవ నాయకులెవరూ అజ్ఞాపించలేదు. ఒక లెనిన్ కాని, ఆఖరికి స్టాలిన్

కాని యిలాంటి ఆజ్ఞలు జారీ చేయలేదు ఇటీవలి కాలంలో మన కళ్ళ ముందు జరుగుతున్న మహా విప్లవాలకు నాయకమణులైన హోచిమిన్ కాని, కాస్ట్రో కాని, ఎక్కడా ఉద్ఘాటించలేదు. కవుల కర్తవ్యం -గోడలమీదో, ఇంటర్వ్యూ లలోనో నినాదాలు రాయడమేనని ఎక్కడా నిర్ణయించలేదు. ఈ విప్లవ నాయకు లలో హోచిమిన్ వంటి వారు స్వయంగా ఉత్తమ కవులు పుష్కలంగా కవితా హృదయమున్న వారు. మానవులుగా పరమ ఔదార్యమైన శాస్త్రీయ మానవతా వాదులు! అనవసరంగా చీమనైనా చంప నొల్లని కరుణా శీలురు. శ్రామికవర్గ విప్లవాన్ని మనసా వాచా వాంఛించేవారు. ఫాసిస్టులవలంబించే నిర్దయతనీ కర్క శత్వాన్నీ ఆరాధించడమే ఉద్యమమనుకో కూడదు. చరమ పరిష్కారంగా అత్యవసరమైతే నిర్దయాత్మక హింసాయుత విప్లవానికి ప్రజా శ్రేణులనాయత్తం చేయాలి. ప్రజలు స్వీయ రక్షణకు ఆయుధాల అవసరాన్ని ఒత్తిడి చేస్తే తప్ప మనం వారిని సాయుధులను చేయనవసరం లేదని లెనిన్ అనేక పర్యాయాలు వివరించాడు. హింసాత్మక విప్లవం చివరిదేకాని, ప్రాథమికం గాదు

లెనిన్ హోచిమిన్ల వంటి విప్లవ నాయకులు కవిత్వాన్ని రాజకీయ నినాదాల స్థాయికి దిగజార్చడం వల్లనే యింతటి మహా విప్లవాలు సాధించారని పాపం ఈ వ్యాసకర్త భ్రమపడితే, అది ఆత్మవంచనా పరతంత్ర బుద్ధి తప్ప అన్యం కానేరదు! శ్రీశ్రీని విప్లవ కవిగా ఆరాధించేవారు, అతని యెడల నిజమైన ప్రేమాభిమానాలున్నవారు అతని బలాన్నీ బలహీనతనీ సంపూర్ణంగా ఎరిగిన వారు. అతను పసితసంతో శుష్క రాజకీయ నినాదాలు చేయబోతే "అది మీ పని కాదు, కవిత్వమే చెప్పండి మహాకవీ!" అనివారించి ఉండేవారు . . . వినకపోతే తీవ్రంగా అధిక్షేపించి ఉండేవారు! కాని స్వప్రయోజనాపరులైన నేల బారు 'విప్లవ' క్రిములకు నినాదాలూ, జ్వరోగ్రతలూ, ఉత్తమ కవితా సామగ్రిగా ద్యోతకమవుతాయి.

పైగా వీరు ప్రదర్శించిన మరో విచిత్రమైన సంతృప్తి ఏమిటంటే "కమ్యూనిస్టులమనుకుంటున్న వాళ్ళకు కూడా లేని నేతృత్వ శక్తిని ఆయన ప్రసాదిస్తున్నాడు! రాజకీయ కవి కాంచని చోట ప్రజా కవి కాంచుతున్నాడు! అంటున్న ఈ వ్యాసకర్త వ్యామోహం అవధులు దాటింది "రాజకీయ కవి కాంచని చోట'' వగైరాలకు గల అర్థం ఏమిటో? ఇదేదో న్యాయారంలాగో

ఆత్మ సంకేతం లాగో భాసిస్తోంది. కమ్యూనిస్టులమనుకుంటున్న వాళ్ళకు కూడా లేని నేతృత్వ శక్తి శ్రీశ్రీ గారికే ఉంటే విడిపోయిన యిన్ని పార్టీలూ కమ్యూనిస్టు అనే పదాన్నే ఇక వాడుకోవడమెందుకు ? శ్రీకాకుళంలో రక్తసిక్త "విప్లవాన్ని" ఆరాధిస్తున్న మాంధాతలంతా యికపై-శ్రీశ్రీపార్టీగా సేవ్యవహరించుకుంటేనే మేలు కదా! ఐతే వీరుద్దేశిస్తున్న' కమ్యూనిస్టుల మనుకునే వాళ్ళెవళ్ళో, వాళ్ళలో లుప్తమవుతున్న నేతృత్వ శక్తి ఏమిటో [illegible] ధీకులే సమాధానాలు శక్తివంతంగా చెబుతూనేవున్నారు. ప్రస్తుతాంశంగా [illegible]డించబడిన 'శ్రీశ్రీ చూపుతున్న నేతృత్వ శక్తి ఎట్టిదో, వారి రాజకీయ [illegible] అవకాశ వాదపు పిల్లి మొగ్గలు (Somersalts) ఎలాంటివో గత వ్యాసాలలో చర్చించాను. పునరుక్తి పుష్టికాదు కనక విడిచి పెడుతున్నాను.

అన్నింటా విచిత్రమైన సంగతేమిటంటే, శ్రీశ్రీ తదనంతర కవితా యుగంపై మరీ కరడు గట్టిన మితవాద విమర్శకులు ఎలాంటి ఆరోపణలు గతంలో చేశారో, అలాంటి ఆరోపణలనే ప్రస్తుతం మరీ అతివాదులమనుకునే వారు కూడా చేయడమే! ఒక అప్రస్తుత దృష్టాంతం జ్ఞాపకం వస్తోంది నాకు. మక్‌మహన్ రేఖ భారత చైనాల సరిహద్దు రేఖగా మేము గుర్తించమని' ఒకే ఒక్క సమయంలో అటు ఫార్మోజా నుంచి చాంగ్‌కైషేక్ ఇటు పెకింగు నుంచి మావో సేటుంగ్ ప్రకటనలు జారీ చేశారు. మరీ అతివాదులూ, మరీ మితవాదులూ, ప్రజా వ్యతిరేక ధోరణిలో పమైక్యం కావడం- సహజ పరిణామమే కాబోలు! కనుకనే అతివాద రాజకీయ సిద్ధాంతాలలో పొడసూపే తీవ్రతర అతివాదం- కేవలం పోలియో పక్షవాతం లాంటి బాలారిష్టమే తప్ప అన్యం కాదని లెనిన్ శంఖ ధ్వనితో ఉద్ఘాటించాడు. కళ్ళున్న వాళ్ళు చదువుకున్నా, చెవులున్న వాళ్ళు వినిపించుకున్నా, ఈ శంఖధ్వానం ఉత్తమ మానవతా మార్గాన్ని నిర్దేశించగలదు. కాని వారిని చరిత్ర ఎన్నటికీ క్షమించదు బుఖారిన్‌ని క్షమించలేదు. ట్రాట్స్కీని కూడా చరిత్ర క్షమించలేదు ప్రజలు నిర్మించే నూత్న చరిత్రకు బాగా తెలుసు, ఏఏ ధోరణులను డస్టుబిన్‌లోకి తోసెయ్యాలో! ఏఏ ధోరణులను తుంగలో తొక్కెయ్యాలో!

బుఖారిన్ విచారణలో యిచ్చిన చరమ సందేశాన్ని ఈ నూతన విప్లవ కారులు అధ్యయనం చేసుకోవడం అత్యవసరం. బుఖారిన్ తన చరమ సందేశంలో యిలా అంటాడు :

"నేను త్వరలోనే ముగిస్తున్నాను. బహుశా నేను నా జీవితంలో కడసారిగా మాట్లాడుతున్నాను. కాబోలు !

ఓ పౌర న్యాయ నిర్ణేతలారా, నేను మీకూ, నేర పరిశోధక మండలికీ కొన్ని ముఖ్య రహస్యాలు చెప్పదలచుకున్నాను. నా హృదయంలో చెలరేగిన కల్లోలం గురించీ, తీసుకున్న నిర్ణయాల గురించీ వివరించ దలచుకొన్నాను. సోషలిస్టు వ్యవస్థలో నూతన జీవితం అనుభవిస్తున్న సుఖ సంతోషాలకు వ్యతిరేకంగా మేము కొన్ని అమానుష చర్యలకు పూనుకొన్నాము. చాలా నేర సమ్మతమైన పోరాట పద్ధతులను మేమవలంబించాము. పైగా మేము వ్లాడిమిర్ ఇలిచ్ జీవితంపై కుట్రపన్నామన్న నేరారోపణను ఖండిస్తున్నాను. కాని నేనవలంబించిన విప్లవ ప్రతిఘాత ధోరణులు కేంద్రీకృతమై లెనిన్‌ను హత్య కావించడానికి ప్రయత్నించిన వారితో సమైక్యమై ఉన్నాను. పైగా విప్లవ ప్రతిపవాదులకు నేను నాయకత్వం కూడా వహించాను. పరిపూర్ణంగా నేను లెనిన్ విధానాలను హత్య చేయడానికి మనస్ఫూర్తిగా ప్రయత్నించిన మాట వాస్తవమే! అయినా ప్రస్తుతాంశం–పశ్చాత్తాపం కానేకాదు. కోర్టు ఈ నా హృదయా విష్కరణ (Confission) తో నిమిత్తం పెట్టుకోదని నాకు తెలుసు. పశ్చాత్తప్తుని క్షమించడం అనాగరిక మధ్య యుగాల నాటి ఆచారం !" అంటూ ముగించాడు. (చూడు : Literature of the Graveyard - by Roger Garaudy పుట : 64 అనువాద మీ రచయితది.)

వర్తమాన విషమ పరిస్థితుల పట్లగల ద్వేషం మేధావులను నిరాశావాదులుగానూ. దుస్సాహసీకులుగానూ మార్చకూడదు. అలా మారడం ఆత్మహత్యా సదృశమే తప్ప అన్యంకాదు. ఆంతరిక సంక్షోభమూ (ANXIETY)

విస్పృహ (DESPAIR) లు కేవలం ప్రజా విరుద్ధ చర్యలకే దారితీసాయి. వ్యక్తివాదపు అరాచికత్వానికి, భీభత్స వాదానికీ మాత్రమే యువతరాన్ని మళ్ళిస్తాయి. వర్తమాన జీవితం సాధిస్తున్న అనేక అత్యుత్తమ విజయాల పట్ల అంధులైనవారు మాత్రమే నైరాశ్య ధోరణితో హత్యా కార్యక్రమానికి పూనుకుంటారని చరిత్ర అనేక పర్యాయాలు కంఠోక్తిగా ఉద్ఘాటించింది.

భగవంతుని అచ్చాఫీసు
ప్రచురించిన మానవ ప్రకృతి కావ్యంలో
లెక్కలేని అచ్చు తప్పుల్ని
ఇక్కడ మానవుడే దిద్దుకోవాలి.

—ఆరుద్ర

తూకం రాళ్ళు

శీలా వీర్రాజు

"అప్పుడే ఏం తొందరొచ్చిపడిందీ స్కూల్లో కూసున్న పిల్లదాన్ని సూడకుండ ఎల్లిపోతున్నావ్" అంది సేవకుడి పెళ్ళాం.

సేవలతో ధనుస్సులా వొంగిపోయిన సేవకుడు ఆ మాటల్ని వినీ విననట్టే వెళ్ళిపోయాడు. వెళ్ళి వెళ్ళి తన జీవితంలో ఎక్కువ భాగం ఖర్చయిపోయిన ఓ భవంతి ముందు ఆగాడు.

అక్కడ—

వరండాలో పడక్కుర్చీలో అధికారి కూచున్నాడు. బంగారం పన్ను కట్టించుకున్న అధికారి, ఆ పంటికింద లంక పొగాకును కసిగా కమ్ముతూ అసహనంతో అటూ యిటూ చూస్తున్నాడు. ఆ చూపుకు గుచ్చుకుపోయి ఎరలాగ మెలికలు తిరిగి పోయాడు వానపాము లాటి సేవకుడు.

"ఏరా ! యింతాలస్యం అయ్యిందేం ?" అధికారిలో అధికారం గాలి కొట్టిన రబ్బరు బంతిలాగ, బండకేసికొట్టుకున్న కెరటంలాగ, కారుకింద పడ్డ కుక్క పిల్ల వొంట్లో విశ్వాసం నిండిన రక్తంలాగ తుళ్ళింది.

"ఇంటికాడ పనడ్డదండి." చేతులుకట్టుకున్న సేవకుడూ, సేవకుడి ముఖంలో తప్పు చేసిన బాధా, బాధకి రెప రెపలాడిపోతున్న మనసూ, మనసు లోంచి కప్పలా బెక బెకలాడుతోన్న విశ్వాసమూ—

ఏం లాభం ! విశ్వాసం గొంతు పిసికేస్తూ తిరుగులేని తర్కం. "అయితే యిక్కడ పని లేదన్న మాట ?"

సేవకుడు వొంగిపోయిన నడుం తడుముకున్నాడు. మాట సరిగా విని పించదేమోనని నిటారుగా నిలుచోబోయాడు గాని అతనిగూని శరీరం నిలుచో లేక మళ్ళీ వొంగిపోయింది. ఆ వొంగిపోవడమే ఒక విధంగా మంచిదైంది. అధికారి ముఖం కనబడక, అరిగిపోయిన చెప్పుల్లో తన పాదాలు తనకే కని పించి, ఆ ప్రక్కనే మెల్లగా పాకుతూ వస్తోన్న తేలు కంటబడి, చప్పున చెప్పుతో దాన్ని అణిచేశాడు.

"మాట్లాడవేంరా బెల్లం కొట్టిన రాయిలాగ ?"

—అధికారం జూలు విదిలించింది. పండిపోయిన తలేమో రెండు తెల్లటి వెంట్రుకలు కిందపడ్డాయి.

"మా పిల్ల సవర్తాడిందండి. అందుకని...." వాక్యాలు తిని వగ రుతో కంఠం పట్టేసినట్టు సేవకుడు గొంతులో కఫాన్ని మళ్ళీ లోపలికే మింగేశాడు.

అధికారం, బొచ్చుకుక్కలాగ తటాలున కుర్చీలోంచి దూకి మళ్లీ అంత లోకే యజమాని వొళ్ళోకి చేరినట్టు కుర్చీలో దర్జాగా కూచున్న అధికారి భుజం ఎక్కి మీసాలు పట్టుకుని ఉయ్యాల ఊగి ఆడుకుంటూ వుండిపోయింది.

అధికారి కరుణించాడు.

"సర్లే. లోపలికెళ్లి పని చూసుకో, ఆఁ మర్చిపోయాను, అబ్బాయితో నువ్వూ వెళ్లి భోజనాలవీ లిస్టు ప్రకారం చెప్పు."

సేవకుడు కాలు కదిపి మళ్ళీ తీసినచోటే వుంచాడు. చావకుండా యింకా ప్రాణంతో గింజుకొంటోంది తేలు. అ వొంటి కాలు మీదే బలమంతా మోపి దాన్ని పచ్చడి చేసి లోపలకు వెళ్లిపోయాడు.

ఆ రాత్రి యింటికి పోయాక సేవకుడు కిరసనాయిలు బుడ్డీ దీపం ముందు తన దొంగతనాన్ని పెళ్ళానికి చూపించాడు. సేవకుడిలో దొంగతనం చేసి నందుకు పశ్చాత్తాపం లేదు. బాధలేదు. చాలా సంతోషంతో, గర్వంతో పెళ్ళా నికి చూపించాడు.

పెళ్ళాం కళ్ళు మెరిసాయి,

ఆ నాలుగు మిఠాయి వుండల్లోనూ, ఒకటి చటుక్కున తీసుకుని నోట్లో వేసుకుని పలబారి, సగం కళుక్కుని, మిగతా సగం మింగి, త్రేన్చి, బాగున్నాయ్ అన్నట్టు చూసింది..

ఆ మెప్పంతా గొప్పగా తనే అందుకుని 'మరేవనుకున్నవేటి !' అన్నట్టు అచ్చం అధికారిలాగే చూశాడు సేవకుడు.

అక్కడి విశేషాలన్నీ చెప్పాడు. అధికారి యింటిదగ్గర పొర్లి వొంటికి అంటించుకొచ్చిన విశేషాలన్నీ పెళ్ళాం ముందు దులిపి ఉదుతా భక్తిని తన సేవాభావాన్ని ప్రకటించుకున్నాడు.

“అరికేటయ్యా, డబ్బున్నవోరు, అలాటోళ్ల సెయ్యకపోతే మనం టోళ్లు సేత్తవా. పిల్ల శీర్రోజుని మా తమ్ముడ్ని గూడ పిలుద్దరేటి” అంది సేవకుడి సేవకురాలైన ఆడది.

అధికారి మూడ్‌లోంచి మాట్లాడుతోన్న సేవకుడికి ఆ కోరిక; ఏనుక్కి చీమా, కొండమీదోడికి బండమీదోడూ, కోటీశ్వరుడికి ముష్టిదవా కనిపించినట్టు అతి అల్పంగా, పట్టించుకోవలసిన అవసరంలేనంత చిన్నదిగా అనిపించింది.

అచ్చం అధికారిలాగే సేవకుడూ తలవూపాడు.

ఊపినతల, పని చేయించిందీ లేనిదీ చెప్పడం అనవసరం అధికారి చెప్పినపని చేయడమే తప్ప, తన మనసు చెప్పినపని చేసుకోవడం సేవకుడు ఎప్పుడో మర్చిపోయాడు. తన వ్యక్తిత్వాన్ని ధనుస్సులా వంచి, సేవ అనే తాటితో బిగించాడు. ఎప్పుడైనా ఆ తాటిని సడలించినా, ఏళ్ళకొద్దీ వంగి వుండడం అలవాటైన వింటి బద్ద నిటాగ్గా రావడానికి వప్పుకోదు.

అయిదేళ్ళ తర్వాత సేవకుడు నిజంగానే నడుమంతా వంగిపోయి కిందకే తప్ప పైకి చూడ్డం మర్చిపోయాడు. అధికారికి అది చాల తృప్తి నిచ్చింది తన ప్రత్యక్షంలోనూ, పరోక్షంలోనూ తనంటే అణిగి మణిగి వుండే వాళ్ళంటే

అధికారికి పుట్టినరోజు జరుపుకున్నంత ఆనందం. అందుకే అధికారి సేవకుడ్ని తొలగించలేదు.

ఒకసారి ఆకాశమూ, గాలీ హాయిగావున్న సమయం చూసుకుని అధికారి ముందుకు వెళ్లి సేవకుడు వంగున్నాడు. అధికారి వింటున్నదీ లేనిదీ సేవకుడికి కనిపించదు కనుక. వింటున్నాడనే భావించి తనలో తనే మాట్లాడుకొంటునట్టు మొదలెట్టాడు సేవకుడు. పైగా అధికారి ఆరు మెట్లున్న వరండా మీద నుంచున్నాడు. సేవకుడు నేల మీదున్నాడు.

"బీదోణ్నండి బాబుగోరో. మా కుటుంబవంతా మీ వుప్పుతినే బతుకుతున్నాం గదండే. మీరు మా రాజులు. మీరునే పోతే నేనూ, నా పెళ్ళాం, పిల్లా సచ్చిపోయ్యేవోళ్ళం. ఉప్పుడుదాక కాపాడుకొచ్చారు మా సెర్మం వొలిసి సెప్పులు కుట్టిచ్చినా మీ రుణంతీర్దు. భగమంతుడు మీలాటోల్ని సల్లగ సూడాలి బాబయ్యా........."

లంక పొగాకు చుట్ట యిస్తోన్న ఆనందంలో పల్టీలు కొడ్తోన్న అధికారి, అంత ఎత్తు మీంచి ఓసారి గెద్దలాగ కిందున్న సేవకుడ్ని చూశాడు. ఆ చూడ్డం గెద్దలాగే చాలా సునిశితంగా, సూటిగా చూశాడు.

సేవకుడికి ఆ చూపులేవీ కనిపించలేదు. అసలు ఆగనుకూడా ఆగ లేదు. తన ధోరణిలో తను చెప్పుకుపోతున్నాడు.

"...............మా లచ్చికి పెళ్ళి సేసెయ్యమని మా యింటివిలోజూ పోరెట్టి సంపేత్తన్నాదండి. నాకాడ డబ్బేదండి బాబయ్యా సెయ్యడానికి మా బామ్మర్దికిద్దారంటే ఆడు వొట్టి తాగుబోతు ఎదవైపొయ్యాడండి దాన్ని బైటోడికే యిద్దారనుకున్నానండి. తవరే సాయం చెయ్యాలి బాబుగోరో. ఐదొందలిప్పిత్తే సంబంధం సూసి పెళ్ళయిపోయిందనిపిచ్చేత్తానండి."

అధికారి చుట్టని అవతలికి విసిరి పారేశాడు. అతనికి, సరిగ్గా పదిరోజుల క్రితం పెళ్ళి చూపులకని అమ్మాయిని చూడ్డానికివచ్చి, అన్నీ నచ్చి కట్నం దగ్గర పేచీ వచ్చిందని వచ్చిన దారంటే వెళ్ళిపోయిన విశాఖపట్నం సంబంధం

గుర్తొచ్చింది. అధికారికి కర్మ సిద్ధాంతం మీద నమ్మకం ఎక్కువ. ఈ మధ్య చేసేందుకు పనేమీలేక కాలక్షేపానికి భగవద్గీత చదవడం మొదలెట్టాడు. వచ్చిన సంబంధం వెనక్కి జారుకున్నప్పుడు అధికారి కూతురుతో కర్మ సిద్ధాంతం గురించి మాట్లాడబోతే ముఖం మాడ్చుకుంది కూతురు.

"చూడ్రా అబ్బిగా. నీ కూతురికి పెళ్ళి కాలేదని వొట్టినే బెంగెట్టుకు చస్తా వెందుకు, అయ్యే రోజొస్తే ఆగమన్నా ఆగదు. మనం ఎన్ని ప్రయత్నాలు చేస్తే మాత్రం లాభమేమిటి. దాని రాతలో ఎప్పుడు రాసి పెట్టుందో. దబ్బుంచేనే అవుతుంది, లేకపోతే కాదూ అవి అనుకోకు. మా అమ్మాయి సంగతే తీసుకో. డబ్బుకి కొదవ లేదుకదా. చదువు కూడా వుంది. అందం మాటనరే సరి. మరి యిన్ని సుగుణాలూవుండి కాలేదంటే ఏమనుకోవా లంటావ్? దానికి మనం బాధ్యులమా. విధి కలిసిరాలేదనుకోవాలి. అంతే. ఇంతకీ కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదని మన పూర్వులు చెప్పనే చెప్పారు. వినలేదట్రా........."

వినకపోవడమేమిటి. రోజూ పెళ్ళాం ఎదుట ఆ మాటే అంటున్నాడు సేవకుడు. కాని పెళ్ళాం పూర్వుల మాటని ఖాతరు చెయ్యడం లేదు మరి!

సేవకుడికి నడుంలాగి అక్కడ్నుంచి కదలి వెళ్ళిపోయాడు. అంతసేపు తను అలా నుంచోవడం తను చెయ్యాల్సిన పని తప్పించుకు తిరగడానికి కాదని అధికారికి చూపిస్తున్నట్టు అబ్బాయిగార్ని ఎత్తుకుని ఆడించాడు.

అధికారికి, వొచ్చే ఎన్నికల్లో యీ గొర్రెల మందని తన వెనకే నడిపించగలనన్న ధీమా కలిగింది. తన మాటలమీద తనకే నమ్మకం లేనంత విశ్వాసం కలిగింది.

ఆ సంతోషంలో అధికారికి సేవకుడి మీద గురివింద గింజంత ఎత్తు జాలి కలిగింది. కాని సేవకుడి గూని నడుం మీద గురివింద గింజ నిలబడలేదు. జారిక్రిందపడిపోయింది. సేవకుడికిమగనలుసుంటే యిచ్చిన దబ్బు ఎప్పటికైనా రావచ్చునన్న ఆశ వుండేది. కాని ఆ ఆశ లేదు. ఆ ఆశ లేకపోయాక డబ్బు తీసుకెళ్ళి గంగలో పోసినట్టే. గంగలో పోస్తే యింకా పుణ్యమైనా రావొచ్చు.

గోదావరి బ్రిడ్జికూడా. కృష్ణా బ్రిడ్జిమీదా రైలుపోతుంటే నదిలోకి చిల్లర పైసలు విసిరి పుణ్యం పోగుచేసుకునే నిజమైన భక్తులు ఎంతమందో! పైసకే అంత పుణ్యం వస్తే అయిదొందల రూపాయలకీ అయిదొందలూ యింటూ వొందా యింటూ పైసంత పుణ్యం వొస్తుంది కదా.

అధికారికి యీ మధ్య పుణ్య చింతన ఎక్కువయ్యింది. ఆంజనేయులు స్వామికీ, ఆరడుగుల కాంగ్రెసు కంచు మంత్రిగారికీ, ఆ పేటలో శివాలయం వద్ద శివరాత్రికి సాని సంస్కారి, చింతామణి నాటకాలు వేయించటానికీ, బల్వంత రాయ్ నిధికీ ఉదారంగా దానం చేశాడు. కాదనుకుంటే విరాళమిచ్చాడు. ఆమధ్య తిరుపతి వెళ్ళినప్పుడు అంతా చూస్తుండగా జేబులోంచి గుప్పెటతో ఏదో తీసి డబ్బీలో వేశాడు. కూతురికి పెళ్ళయ్యాక తిరుపతికి దంపతులిద్దర్నీ పట్టు కొస్తానని మొక్కుకున్నాడు. బట్ట తలమీద పాతికకన్న ఎక్కువ లేకపోయినా ఆ పాతిక తల నీలాల్నీ స్వామివారికి అర్పించేస్తాననుకున్నాడు.

కాని ఏం లాభం!

ఓరోజు అధికారి పడక్కుర్చీకోడు విరిగిపోయింది. కసికొద్దీ విసురుగా దానిమీద కూచోబోతే తాతల కాలంనించి వస్తోన్న అధికారి ఆసనం కాలిరిగి కుంటిదై పోయింది. సేవకుడ్ని పంపించి వడ్రంగి వీరన్నని పట్టుకురమ్మన్నాడు.

'అల్లా ఆ పురుషోత్తం గారింటి కెళ్ళి అమ్మాయి అక్కడ వుందేమో చూసిరారా' అని కూడా పని పురమాయించాడు.

సేవకుడికి వడ్రంగి వీరన్నయితే దొరికాడుకాని అమ్మాయిగారు మాత్రం దొరకలేదు.

అధికారి కాలు విరిగిన కుర్చీకి అతుకు వేయించుకుని కూచున్నాడు గాని ఆ పూర్వపు ఠీవేదీ, ఆ అందమేది, ఆ చందమేదీ.

అధికారికి వడ్రంగి వీరన్నమీద కోపం వచ్చింది. తెమ్మనంత మాత్రం చేత ఆ చేతకాని వెధవనే పట్టుకొచ్చిన సేవకుడిమీద కోపం వచ్చింది. అమ్మాయిగార్ని వెతకటానికి వెళ్ళి కనిపించలేదని వచ్చేసిన చవట సన్నాసు

లందరిమీదా కోపం వచ్చింది. ఆ కుర్చీమీద కూచుని అధికారి అందరి మీదా మండి పడ్డాడు.

అధికారి పెద్ద పులిలాగ గాండ్రించాడు. వసారా సాలలో పాలు తాగు తున్న పెయ్య తాగడంమానేసింది. ఆడుకోడానికి వచ్చిన ముష్టిది అడుక్కో కుండానే పక్క గుమ్మానికి వెళ్ళిపోయింది.

"పొండి. నా ముందు నుంచి పొండి. వెధవ ముఖాలూ మీరూనూ. సన్నాసి వెధవల్లారా వెళ్ళి గంగలో దూకి చావండి. చేతకాని దద్దమ్మలు. ప్రతీదీ చెప్పాలా. వెళ్ళి ఆ స్టేషన్లోనూ, బస్టాండులోనూ చూసి రమ్మనమని బొట్టెట్టి చెప్పాల్రా మీకు. పొండి. అవన్నీ వెతికి రండి."

అధికారం ఎర్రగా, కణ కణ మండుతున్న చింత నిప్పులా, తుపాకీ గుండు కక్కిన కాగిన రక్తపు బొట్టులా భయంకరంగా, అసహ్యంగా అధికారి కళ్ళ చుట్టూ.

సేవకుడూ, అతని లాంటి అరిగిపోయిన సన్నకారు మనుషులూ పిడుగు పడితే చెదిరినట్టు చెదిరిపోయారు. తలొక దిక్కూ పట్టుకుని పరుగెత్తారు. బస్సు స్టేండులో, రైలు స్టేషన్లో పకడ్బందీగా వెతికి వుత్త చూపుల్తో అధికారి దగ్గరకొచ్చి చేతులు కట్టుకున్నారు.

అధికారి అందర్నీ పంపించేసి సేవకుడ్ని ఒకడ్నీ వుండమన్నాడు. సేవ కుడు బోనస్ అందుకున్నంత సంబర పడిపోయాడు.

"ఒరేయ్ ! ఒకసారి అలా వెళ్ళి మన తోటలో నూతిలోనూ, అవతల చెరువులోనూ చూసిరా. పనిగట్టుకుని వెళ్ళినట్టు వెళ్ళబోక. ఏదో అలా పోతూ తొంగిచూసినట్టుగా చూసి త్వరగా వచ్చేసెయ్."

సేవకుడు, ఆ రెండేకాదు యింకో అరడజను నూతుల్ని కూడా చూసొచ్చాడు.

అదికారికి ఏం చెయ్యాలో తోచలేదు. నూతుల్లోనూ, చెరువులోనూ లేక పోయినందుకు మాత్రం కాస్తంత స్థిమిత పడినవాడిలాగ పడక్కుర్చీలో జార

బడి బుర్ర గోక్కున్నాడు. తిరుపతి వెంకట రమణుడి పరమైపోయిన పాతిక తల నీలాలలోనూ రెండు ఆ స్వామి వారికి చెందకుండా వూడిపడ్డాయి.

అధికారికిఆపరాధం తెలిసొచ్చింది. గదిలోకి పోయి.రహస్యంగా లెంపలు వాయించుకున్నాడు. ఆ తర్వాత అరుగుమీద వున్న పడక్కుర్చీని గదిలో వేయించుకున్నాడు, గది కిటికీ కాస్త ఎత్తులో వుంది అందువల్ల అందులో జారబడ్డప్పుడు అధికారి బయటికి కవిపించేవాడు కాదు. జారబడకుండా అటూ యిటూ తిరుగుతున్నప్పుడు మాత్రం కటకటాల వెనక ఏ పెద్దపులో పచార్లు చేస్తున్నట్టు వుండేది బయటి వాళ్ళకి.

అయిదు రోజుల తర్వాత అధికారి అరుగు మీదికి వచ్చాడు. ఆ రోజు వుత్తరం వచ్చింది. సమయానికి అందుకునే వాళ్ళెవరూ లేక తనే వచ్చి తీసుకున్నాడు. తీసుకుని మళ్లీ గదిలోకి వెళ్లిపోయి చదువుకున్నాడు. చదువుకుని ఎప్పుడెప్పుడు సేవకుడు వస్తాడా, వుత్తరాలు కొట్టుకు రమ్మనమని పంపిద్దామా అని ఎదురు చూస్తూ కూచున్నాడు.

ఎప్పుడూ సూర్యుడు రాకుండానే వచ్చే సేవకుడు ఈ రోజు సూర్యుడొచ్చి నెత్తికెక్కి కూచున్నా యింకా రాలేదు!

అధికారికి కోపం వచ్చింది. ఎంత కోపం వచ్చిందంటే సేవకుడ్ని పని లోంచి తీసిపారెయ్యకుండా అతగాడి జీతం తీసిపారెయ్యాలన్నంత కోపం వచ్చింది. మరొకరెవర్నో పంపించి వుత్తరాలు తెప్పించుకున్నాడు. సేవకుడ్ని వున్నవాడ్ని వున్న పళంగా లాక్కురమ్మన్నాడు.

సేవకుడు ఇంట్లో లేడు.

సాయంకాలం లబో దిబో మంటూ పరుగెత్తుకొచ్చాడు.

వాడి వాలకం ఏమాత్రం తిన్నగా లేదు. పొట్లకాయలాగ వొంకర తిరిగిపోయి వొళ్ళంతా దుమ్ము పట్టేసి వుంది. చెవ్వులు మట్టి కొట్టుకు పోయాయి. నడుం మరీ వొంగిపోయింది.

"బాబుగోరో ! అది నా కొంప నిలువునా కూల్చేసినాదండి బాబో. పొద్దు టేల లేసేతలికే కనిపిచ్చలేదండి టేషనూ, బస్సుటేండూ అన్నీ సూసొత్త న్నాను. పాడుముండ, నన్ను నట్టేట్లో ముంచేసింది బాబుగోరు"

'ఎవర్రా ?' అన్నట్టు చూశాడు అధికారి.

"ఇంకోరు బాబో. నాకూతురేండి. ఎంత పని సేసిందో సూడండి"

అధికారికి నవ్వొచ్చి కోపం కొట్టుకు పోయింది. జోకర్ని చూసినట్టు చూసి "సర్లే వెళ్ళు. వెళ్ళి, రేపు కూడా ఎగనామం పెట్టకుండా పొద్దున్నే తగ లడు" అన్నాడు.

సేవకుడు పదోసారి మళ్ళీ వూరంతా తిరిగాడు. స్టేషనూ, బస్సుస్టేండూ చూశాడు. నూతుల్లోనూ, చెరువుల్లోనూ మాత్రం చూళ్ళేదు. అమ్మాయిగారు పెట్టిన వరవడిలోనే కూతురుకూడ నడిచి వుంటుందనే విషయం సేవకుడికి తెలియక పోలేదు. అందుకే వొంటెద్దుబండి ఎంకన్ననీ, గుర్రబ్బండి కరీమ్‌నీ, బస్సు డ్రైవర్లు అప్పారావు, చంద్రయ్యల్ని, క్లీనరు సూరిగాడ్ని వాకబు చేశాడు. ఆ సాయంకాలం వరకూ తిరిగిన చోటే తిరిగాడు.

అలసిపోయిన సేవకుడు సిమ్మాద్రికొట్టు బల్లమీద ఓనిమిషంకూచుని చుట్ట కాల్చుకుందామని పొగాక్కాడలు ఓపావలావి తీసుకుని యీనెలు వలుస్తున్నాడు.

కొట్టు పక్క సన్నాసిగాడి హైరుషాపులో ఏమిటో సందడిగా వుంది. కో ఆపరేటివ్ సొసైటీ గుమాస్తా సుబ్బన్న పేపరు పట్టుకుని హడావుడి చేస్తున్నాడు.

"చూశారా ! నిజంగా ఆదర్శ వివాహం అంటే మన సత్తిరాజుగారి అమ్మాయిదే. లేకపోతే ఆ పురుషోత్తంగారి అబ్బాయి శంకరాన్ని రిజిష్టర్ మేరేజి చేసుకుందంటే ఏమంటారు మరి. లక్షలకు పడగెత్తిన ఆ సత్తిరాజు గారెక్కడ? ఎర్రని ఏగానీలేనిఅపురుషోత్తం గారెక్కడ? అసలు ఆపురుషోత్తం గారికి ఆస్థి ఏముందంట ? ఇల్లు కూడా తనఖాలోవుంది. సొసైటీలో తీసుకున్న అప్పు సంగతి – సరే సరి – అదంతా యిప్పుడు ఎందుగ్గాని నిలువెల్లా ఐశ్వర్యం

లో మునిగి వుండి ఏమీలేని ఆ పురుషోత్తంగారి అబ్బాయిని పెళ్ళాడిందంటే ఆ అమ్మాయిది ఎంత దొడ్డ బుద్ధో ఆలోచించారా. ఎంత ఆదర్శం ఆమెది? అదేనయ్యా లౌ మేరేజి అంటే అదే మరి, చూడండీ– పేపర్లో బంధు మిత్రులకు అభినందనలు తెలుపుతూ ఫోటో వేయించుకున్నారు.''

సేవకుడు ఫోటో చూద్దామనుకున్నాడు గాని అక్కడ మూగిన వాళ్ళు కుక్కల్లాగ పేపరుమీదికి ఎగబడేసరికి సేవకుడు ఓ నిమిషం చూచి, ఇంటికి ఆ వార్త మోసుకు పోదామన్న సంబరంలో కూతురు కనిపించలేదన్న మాటే పట్టించుకోక, పొగాక్కొట్టడలకి డబ్బివ్వలేదన్న విషయమే మర్చిపోయి హడావిడిగా బైలుదేరాడు,

అలా వెళ్ళిపోతోన్న అతన్ని బండ బూతుతో మేకు దిగేసి నిలేసినట్టు నిలేశాడు. పొగాక్కొట్టు సిమాద్రి.

ఆ బూతు తిట్టుకి సుబ్బన్న యిటు తిరిగి చూసి "సిమాద్రిగారూ ఆడు యిప్పుడు మనలో లేడు లెండి. ఆడికూతురు పొద్దున్నే దేశాటనకి బైలుదేరింది. ఆడూ, ఆడి పెళ్ళాం పొద్దుట్నించి కాళ్ళరిగి పోయేలా తిరుగుతున్నారు. ఆడి పిచ్చిగానీ యింకెక్కడ అది కనిపిస్తుంది, ఎప్పుడో వుడాయించేస్తేను. ఆడికి ఖర్చు మిగిల్చేసి ఎవడితోనో లేచి పోయివుంటుంది. దాని తప్పేమీ లేదు లెండి. ఆడిదే తప్పంటాను. ఎద్దులా అన్నేళ్ళొచ్చినా పెళ్ళి చేద్దామన్న ఆలోచనన్నా ఆడికి లేకపోయిందికదా. తగిన శాస్తే చేసింది లెండి ఎదవకి."

సేవకుడు ఏదో అనగాలనుకున్నాడు. అతనికి తన నడుం పడిపోయినట్టు చాలా కాలం క్రితమే తెలిసొచ్చిందిగాని యిప్పుడు నోరు కూడా పడిపోయినట్టు అర్థమైంది. అందుకే అతను ఏమి మాట్లాడలేక పోయాడు.

———

రచన ఎవరికోసం?

వర్గాలున్న ఈ సమాజంలో జీవిస్తున్న మీరుఎవరికోసం రాస్తున్నారు? నిజంగా మీరు స్వేచ్ఛా జీవులేనా? వర్గాతీతంగా మీరు వాస్తవ రచనలు చేయగలుగుతున్నారా? ఈ కోటికోట్ల సామాన్య ప్రజల భౌతిక సుఖాలకోసం—మానసిక చైతన్యం కోసం అన్యాయాలతో పోరాటం అవసరం కాదా? అన్యాయ రూపంలో వుండే శక్తులను సమూలంగా ఛేదించివేయాలంటే ప్రజలు ఎదురు తిరగాలికదా? ఆ ఎదురు తిరిగే ప్రజలకు నైతిక బలాన్ని ఇస్తూ, వారి త్యాగాల్ని గుర్తిస్తూ రచయితలుగా మన బాధ్యతను నెరవేర్చాలా వద్దా?

అని ఒక కథా రచయితను నేను మాటల సందర్భంలో ప్రశ్నించాను, ఆయన అన్నీ విని సావధానంగా—చల్లగా ఇలా సమాధాన మిచ్చాడు.

"నేను రచయితగా స్వేచ్ఛాజీవిని నా మెదడును చిలకొయ్యకు తగిలించి రచనలు చేయలేను. మీరు చెబుతున్న బాధ్యత ఇరుకుగా పరిణమిస్తుంది. అది బంధించి రచయితను సంకుచిత మనస్కునిగా చేస్తుంది."

నిఖిలేశ్వర్

ఆ కథా రచయిత ఈ నాటి సమాజంలోని యువతరానికి చెందినవాడు మంచి ఆదాయం వస్తున్న ఉద్యోగం చేస్తున్నవాడు ఆధునిక కాల సుఖాలు పొందుతున్నవాడు తన మధ్యతరగతి మనస్తత్వంతో చుట్టూవున్న సమాజాన్ని పరిశీలిస్తున్నవాడు ఆ స్థాయిలోనే ప్రతిస్పందించి రాస్తున్నవాడు - మరి అలాంటి ఆ కథా రచయిత తాను స్వతంత్రుడిగా ఎలా భావిస్తున్నాడో అర్థం కాలేదు

ఈపరకే తన మెదడును ఉద్యోగానికి అవసరాలకు—తన పరిమితమైన జీవిత పరిధికి తాకట్టు పెట్టేయలేదా? తన కథలను ప్రచురించే పత్రికల అభిరుచుల కనుగుణంగా రచనలు చేసి పేరు-డబ్బు గడించుకోవడం లేదా? వ్యాపార మనస్తత్వంతో లక్షలాది పాఠకుల అభిరుచిని సర్వనాశనం చేస్తున్న ఈ పత్రికల యజమానులు-సంపాదకులు ఆ రచయితను ఊడిగం చేయించడం లేదా? ఆ విధంగా తనకు తెలీకుండానే అమ్ముడుపోయి 'నేను స్వేచ్ఛా జీవి'నని అధికభావంతో భ్రమలు సృష్టించుకోడం లేదా?

ఈ ప్రశ్నలను జాగ్రత్తగా పరిశీలించినపుడు ఈనాటి రచయిత స్థానాన్ని అంచనా వేసినపుడు ఈ నిర్ణయానికి రాకతప్పదు— ఈ వర్గ సమాజంలో రచయితకూడా ఏదోవిధంగా ఒక వర్గానికి చెందినవాడే.

ఈ దేశం సంపదను-భావిని నిర్మించే కార్మిక-రైతాంగ శక్తిని ఎప్పుడు తక్కువగా అంచనావేయలేము. ప్రతిఒక్కడు ఏదోవిధంగా శ్రమజీవియైన కార్మికుడికి-రైతుకి వారసుడే. ఆ సంతతికి చెందినవాడే. అలాంటపుడు ఆ కార్మిక-కర్షక శక్తి నికృష్టమైన స్థితిలో వున్నపుడు వాళ్ల ఉన్నత స్థితికోసం రచయిత రచనలు చేయడం భావ్యం. కాదా? వాళ్ల పోరాటాలను సమర్థించివిప్లవ శక్తిని మరింత ప్రజ్వలింప చేయడం అవసరం కాదా?

అవసరం కాబట్టే ప్రపంచ వ్యాప్తంగా మేధావులు-రచయితలు తమ సొంతు సామాజిక బాధ్యతను నిర్భయంగా—నిస్సంకోచంగా నెరవేర్చుతున్నారు. ఆ బాధ్యతనే స్వీకరించి ఎన్ని కష్టాలైనా-ఎన్ని ఇబ్బందులైనా సార్త్రె, డెబ్రె, అగస్తినోనేతో, తదితర రచయితలు భరించి చెక్కుచెదరకుండా నిలబడి వున్నారు.

అందుకే కవిగా-రచయితగా నా రచనలు నాదేశం-నాప్రజల కోసమని కృత నిశ్చయంతో సరియైన చారిత్రక అవగాహనతో అంచనా వేసుకొన్నపుడు ఇలా అనిపిస్తోంది.—

ఇతర గ్రహాల్లోకి తొంగి చూసేముందు ఈ భూమి మీది మనిషి ఎంత నికృష్టమైన నీచస్థితిలో వున్నాడో చూసుకోవాలనీ, అందులో ఈ భూగోళంపై

గిరిగీసుకొని వున్న మన దేశం మరెంతటి భయంకరమైన క్లిష్ట పరిస్థితుల్లోకి జారిపోతున్నదో గమనించాలనీ మరీ ముఖ్యంగా ఈ నాటి తరమనే యువతరం రాబోయే దారుణ చారిత్రక పరిణామాలలో తమ పాత్ర ఏమిటో నిర్ణయించుకోవాలని అప్పుడే దారుణమైన అతిసమీప భవిష్యత్తు కనుచూపు మేరలోవున్నా అంతకంటే అనంతమైన మానవ భవిష్యత్తు ఉజ్వలంగా మెరుస్తూ రూపు దిద్దుకోగలుగుతుంది. ఆ రూపు దిద్దుకోగలిగే సామాన్యుని నిజమైన దేశంకోసం-నిజమైన ప్రపంచంకోసం-మరీ తనదే అయిన భవిష్యత్తుకోసం ఈనాడు త్యాగాలు కావాలి ఆ త్యాగాలే రేపటి కండగల భవిష్యత్తును-ఒకరి నొకరు కొల్లగొట్టని దేశాన్ని,చిన్నదేశాన్ని పెద్ద దేశం మింగేయని అంతర్జాతీయ సోదరప్రభుత్వాలను నిర్మించి నిజం చేస్తాయి.

ఈనాడు విచ్చలవిడిగా ప్రజల హక్కులను కొల్లగొడుతూ సామాన్యుల సౌఖ్యాలను కొందరంటే మరికొందరే పంచుకుంటూ, నేటి యువతరాన్ని దిక్కులేని శూన్యంలోకి తోస్తున్న ఈనాటి రాజకీయ వ్యవస్థ క్రమంగా ప్రేలిపోయే స్థితికి వస్తున్నది. ఆ తర్వాత కలగాపులగంగా వుండే జాతీయ శక్తుల ప్రతాపం బయటపడుతుంది. ఆ పరిపాలన క్రమంగా పరిస్థితుల్ని విషమింపచేస్తుంది. ప్రజాపోరాటాలు తీవ్రమవుతాయి. పోరాటం ఫలించి ఏకైక అభ్యుదయ శక్తికి దారిచేస్తుంది. అదే సోషలిస్టు ప్రజాస్వామ్యం. (ప్రజాస్వామిక సోషలిజమనే కరిమింగిన వెలగపండు సామ్యవాదం మత్రంకాదు) ఆ సామ్యవాద ప్రజాస్వామిక వ్యవస్థ కోసం పోరాటం ఏనాడో ప్రారంభమైనది. 1948 నుండి బీజాలుపడి క్రమంగా విప్లవశక్తులు అనుభవాలు పొందుతున్నాయి. ఆ అనుభవాలు ఎంతో అశ్రువాహినితో సంతరించుకోబడ్డాయి. అవి ఏనాటికి వృధాపోవు.

రాజకీయ-ఆర్థిక-సాంస్కృతిక సమన్వయంతో విద్యసాగితేనే తప్ప యువతరం తన బాధ్యతను గుర్తించదు. అలాంటి యువతరం నుండే అన్ని రంగాలలో బాధ్యతాయుతంగా ప్రవర్తించే వ్యక్తులు లభ్యమవుతారు. బాధ్యతాయుతంగా అయితే ఈనాటి ఈ పాలనా యంత్రాంగం ఆ అవకాశాన్ని యువతానికి దూరం చేసి నపుంసక విద్యావిధానంతో యువకులను పనికిరాని ఒంటరి

వాళ్లుగా చేస్తున్నది. అందువల్ల చారిత్రక భౌతిక వాదంతో అంచనా వేసుకుంటే మార్క్సిస్టు సమాజం తప్ప మరో మార్గంలేదు. అప్పుడు—

దేశం యావత్తు సామాన్యప్రజలది. దేశంలోని ఆస్తి సొంతం అందరిది.

అందుకోసం సొంత ఆస్తివద్దు. అందరికోసం అందరి ప్రభుత్వం ఏర్పడాలి. ప్రాథమిక హక్కుల సాకుతో దోపిడికి అవకాశాలను ఇచ్చే రాజ్యాంగం—దానినీడలు పెరిగే న్యాయశాస్త్రం అక్కరలేదు. సామ్యవాద ప్రజా స్వామిక వ్యవస్థలో ఈ కులాలు వుండవు మతాలు. వుండవు-బూటకపు దేవుడు వుండడు. మనుషులు అర్థంచేసుకొనే భాషలు వుంటాయి. మనిషిని గౌరవంగా శ్రమజీవిగా బ్రతికించే సమాజం వుంటుంది. వైజ్ఞానిక హేతువాదంతో నిజాన్ని కనుక్కొంటున్న మనిషి-మనిషిలా జీవిస్తాడు. అప్పుడే ఎవరి రచనైనా సార్థక మవుతుంది.

దరిద్రుల కష్టాలకు దేవుణ్ణీ,
పూర్వజన్మలో చేసిన పాపాలనూ
కారణాలుగా పేర్కొనే
రచయితలను
ఏం చేసినా పాపం లేదు

—కొడవటిగంటి కుటుంబరావు

గడ్డకట్టిన నిజం

—పరిగి రాధాకృష్ణ

ఇంకా టైమ్ కాలేదు
గులాబీలు పూయడానికి
ఇంకా వేళ కాలేదు
గుడి గంటలు మోగడానికి
గొంతుకలో ఇరుకిరుగ్గా
వెలువడుతున్న గీతానికి
వెల్లువ రాలేదు.
గడ్డ కట్టిన చరిత్ర నిజాల్ని
పగల గొట్టి చూపడానికి
ఏ ప్రక్రియా చాలటం లేదు
గుండె పగిలి కారుతున్న రక్తానికి
ధమనులూ సిరలూ ఆగటం లేదు
శిరసుల్ని లెక్క పెట్టుకుని
కరవాలాలు తిప్పుతున్న వాళ్ల చూపు
శిఖాగ్రాల మీదికి పోలేదు.
అంగ బలమో అర్థ బలమో
ఏదో ఒకటైనా లేనివాళ్ళ ఆపసోపాలు
ఏ ఆపద్ధర్మాన్నీ ఆదుకోవటం లేదు
సూర్యకాంతి లోకి రాలేక

కిటికీలు బిగించుకుని
నాలుగ్గోడల మధ్య
తమని తాము కుదించుకుని
ఏర్ కండీషనర్ వేసుకుని
వెచ్చని కలలు కంటున్న వాళ్ళకి
మిట్టమీదికి అతికష్టంగా
బండి లాగుతూ బోర్లపడుతూ
సొమ్మసిల్లుతూ తేరుకుంటూ
వెళ్తున్న వాళ్ళగుండెల్లో రగిలే
కుంపట్లు కానరావడం లేదు.
సోమరితనాన్ని కప్పుకుని
సురాపాన మత్తులై పడుకుని
సామాన్యుల కంటి చూపులోని
ముక్కంటి తనం తెలిసిరాలేదు.
మనిషి మనిషిగా బతకడానికి
కొంచెపన్న బరువు ఎరువు తెచ్చుకుని
అప్పటికీ చిత్తశుద్ధితో బతకలేక
అర్థంకాని వేదాంతపు నీడలో కునుకుతూ
ఏమీ సాధించలేని అజాగళ స్తనాలుగా
మిగిలి పోతున్న జాతి జీవితాల్ని చూసి
గుండె చెరువుకాక తప్పదం లేదు.

మార్చి

—యం. కె. సుగమ్‌బాబు

యుగయుగాలుగా నిర్మిస్తున్న
ఆశాసౌధం యిది !
మధ్యలో ఆపేయకు దీన్ని !
ఎన్నో ప్రాణ త్యాగాలతో
వెలుస్తున్న స్వర్గం యిది
పాతాళానికి త్రొసేయకు దీన్ని ! !

చీకటి ఆకాశం గుండెల్ని సర్రున చీరుస్తూ సాగే
నీ రేడియం కనుల ఆశయాల రాయంచల్ని
మళ్ళించకు వెనక్కు !
నీ విజయాలకు తలలు వంచి
బానిసలుగా నీచేత చిక్కిన వెలుగు కిరణాల్ని
మూర్ఖంగా పీక పిసక్కు :
ఇంద్ర ధనస్సై విరిసిన నీ మనో వికాసాన్ని
బురద గుంటల్లోపడి దొర్లనీకు !
పందుల్ని పీడితజనోద్ధారకులుగా భ్రమించి
పట్టాభిషేకం చేయబోకు !

అవును—
ప్రలోభానికో-పిరికితనానికో లోనై
భవిష్యత్తును గానంచేసే నవ్యాశల యువ పరభృతాల

రెక్కలు విరిచి మురిసి పోకు :
హిమన్నగంవంటి శాస్త్ర విజ్ఞానాన్ని
క్షుద్ర రాజకీయం కాలికి చెప్పుగా తొడగకు !
మళ్ళీ చరిత్ర గుండెల్లో జిల్లేళ్ళను పూయించకు !
ఇంకా పులులకు, తోడేళ్ళకు ప్రాణం పోయకు !!
అన్నా ! యిటు చూడు—
తడి ఆరని కన్నులతో
నీవు తెచ్చే చిరు వెలుగుకోసం నీ వాళ్ళెంత మందో :
అక్రమాల జులుం క్రింద అవుడు కరచిన దీనుల్ని
దుఃఖాల వూబిలోంచి నీవే పైకి లాగాలి !
బ్రతుకు తెరువు కోసం
స్వార్థ పరుల గుప్పిళ్ళలో
సాలె గూళ్ళలో చిక్కుకొన్న సీతాకోక చిలుకల్లా
విలవిల్లాడే సోదరుల్ని నీవే రక్షించాలి !
అహర్నిశలూ బానిసత్వపు చీకటి బుయ్యారాల్లో మ్రగ్గి
గానుగెద్దుల్లా ఎముకలు విరుచుకొంటున్నా
పట్టెడన్నానికి నోచుకోని
నోరులేని —
రైతులు, కూలీలు, కార్మికులకు నీవే వెలుగుచూపాలి :
జటిల సమస్యా సాగరాన్ని మథించి
నవ్య పరిష్కారామృతాన్ని వెలికి తీయాలి !
కుటిల నీతులతో జీవిత పోరాటాల్ని వక్రంగా చిత్రించి
బుల్లెట్ల రక్తదాహం తీరుస్తున్న ప్రజాస్వామ్యాన్ని
—రూపుమాపాలి !

నరనరాన్నీ పగిలిస్తున్న పగకు ప్రతీకారం
దుర్మార్గం సింహాసనం క్రింద

విప్లవం డైనమేట్ ప్రేల్చాలి !
మరువకు !
దారి తప్పి నడువకు !!

ఈ నాడు జాతి గుండెల్లో
నిద్ర లేచిన సహజ వీరోచిత శక్తుల్ని
మభ్యపెట్టి, జోకొట్టి మళ్ళీ నిద్ర పుచ్చకు !
భవిష్యత్తు మన చేతల్లో విరిసే సహస్రదళ సువర్ణ పద్మం
దాన్ని అవివేకంతో ముక్కలు చేయకు !
రేపు జాతిని పొగరుమోతు ఆబోతుల గిట్టల క్రింద
నలిగి నశించే విరజాజిని చేయకు !
అన్నా ! దారి తప్పి నడువకు !

రా ! జనంలోకి రా !
జీవితంలోకి, సమస్యలోకి రా !
వీరుని చేతి కరవాలంలా చీకట్లను చెండే దావాలనంలా
పైగంబరకవి వాక్కులోని వేయికాలాల సత్యంలా
ధ్వనిస్తూ, స్వనిస్తూ,
ముందుకు రా !

మరామత్తు పని

—గుత్తికొండ సుబ్బారావు

అబద్ధాల పూబాటల్లోంచి నడిచి రాలేదు నేను
నిజం ముళ్ళ కంచెల్ని దాటుకుంటూ వచ్చాను
లోకం మొహం మీద ఏవగింపు పేడ కళ్ళాపు చల్లాలి
నాలా అరణ్యంలో చిక్కడిపోయిన నా సోదరుల్ని పిలవాలి !

మమ్మల్ని అక్కడ వదిలేసి వచ్చిన పెద్ద మనుషులారా
దారి తప్పించి కనుమరుగైన జిత్తులమారి నక్కలారా
మీ క్షేమం కోసం మేం అహర్నిశలూ పలవరిస్తే
మా పీడ వదిలించుకోవాలనుకుంటున్నారా మీరు ?
మిమ్మల్ని మేం క్షమించినా లోకం క్షమించదు
లోకం క్షమిస్తే మాత్రం చరిత్ర సహించదు !

నగరంలోని నాజూకైన మేడలో
పెళ్ళాం కౌగిళ్ళ పొదరిళ్ళలో
నీతి వాక్యాల గుడ్లు పెడుతూ
ప్రబోధాల పొదుగు పొదగొద్దు
గుండెలుంటే మాతో కలిసి నిలబడండి
ఈ లోకం మరామత్తుపనిలో చేయి కలపండి.
నట్లు సరిచేసి పట్టు బిగించి
కలిసికట్టుగా పని చేద్దాం
యంత్రాంగాన్ని బాగు చేద్దాం
మంత్రాంగాన్ని మార్చి వేద్దాం——

ఏది ✿ కవిత?

అభ్యుదయ

అద్దేపల్లి
రామమోహనరావు

అభ్యుదయ కవిత్వం – అన్నది భావకవిత్వం మీద తిరుగుబాటుగా బయలు దేరిన ఉద్యమం. భావకవిత్వం కేవలం వ్యక్తి యొక్క అనుభూతుల్లో కూరుకుపోతున్న స్థితిలో, సామాజిక వాస్తవికత ప్రతిబింబించడానికి పూనుకొన్నది అభ్యుదయోద్యమం. కాబట్టి ఆరంభదశను బట్టి, సామాజిక చైతన్యం అభ్యుదయ కవిత్వం యొక్క ధ్యేయంగా కనిపిస్తుంది. భావ, అభ్యుదయ కవిత్వాలకి భేదం ఏమిటంటే మొదటిది 'వ్యక్తి' రెండోది 'సమాజం' అని స్థూలంగా నిర్వచించవచ్చును. కొడవటిగంటి కుటుంబరావుగారు "అభ్యుదయసాహిత్యం" అనే వ్యాసంలో ఈ విధంగా అంటారు

"అభ్యుదయ సాహిత్యం సాగాలంటే రచయితలకీ, సంఘానికీ ఒక సజీవ సంబంధం – (Organic Connection) — ఉండాలి. రచయిత తాలూకు ప్రభావం సంఘంమీద ఉన్నంత మాత్రాన లాభం లేదు. సంఘం యొక్క ప్రభావం రచయిత మీద కూడా ఉండాలి. ఇప్పటి కవులలోనూ అనేక మంది ఈ విషయం గుర్తించినట్లయితే ఉత్తమ అభ్యుదయ రచన చెయ్యగలరు. కాని "నేను సమాజం మీద నా ప్రభావం చూపుతాను. సమాజ మట్టుకు నన్నంటటానికి వీల్లేదు'' అనే వ్యక్తిత్వం — Individualism అవలంబించితే రచయిత అభ్యుదయ సాహిత్యం సృష్టించలేడు"

కాబట్టి అభ్యుదయ కవిత్వం యొక్క మొట్ట మొదటి కానుక సామాజిక దృష్టి. 1930 ప్రాంతాల నుండి దీని యొక్క విస్పష్టమైన తరంగాన్ని మనం

గుర్తించవచ్చు. అప్పుడు సామ్యవాద శక్తులన్నీ సమిష్టి స్పందన పొందుతున్న సమయం. ఆంగ్ల భాషలో టి. ఎస్. ఇలియట్ మార్గంమీద తిరుగుబాటుగా ఆడేన్, స్పెండర్ మొదలైనవారు సామ్యవాదాన్ని సామాజిక పరిష్కారంగా కవిత్వాన్ని మలుస్తున్న తరుణం. రష్యా విప్లవం దేశంలోని మేధావులకి మార్గ దర్శకంగా కనిపిస్తున్న కాలం. ఆ సమయంలో మన తెలుగు కవుల్లోని ప్రముఖులంతా సామ్యవాదాన్ని విశ్వసించి ఆ మూల సూత్రాల్ని కవితా వస్తువుగా చేసుకొన్నారు. వ్యక్తికంటె సమాజాన్ని ప్రబలమైన శక్తిగా గుర్తించేది సామ్యవాదం. ఈ సామాజిక స్పృహని తన కవిత్వంలో మొదటిసారిగా విశ్వరూపంగా చూపెంచినవాడు శ్రీశ్రీ.

"నా రచనలలో లోకం ప్రతిఫలించి
నా తపస్సు ఫలించి
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నా జాతి జనులు పాడుకొనే
మంత్రంగా ప్రమోగించాలని
నా ఆకాశాలను లోకానికి చేరువగా . . ."

"నా ఆకాశాలు" అంటే తానంతకు ముందు తేలియాడిన అస్పష్ట భావ సౌందర్య పూరితమైన ఊహాలోకాలు. స్థూలంగా అది భావ కవిత్వం అని వచ్చును. ఆ కవిత్వాన్ని లోకానికి చేరువగా తేవడమంటే చుట్టూ ఉన్న సమాజాన్ని గుర్తించడం. భావ కవిగా అడుగుపెట్టి అభ్యుదయ కవిగా వేగం సాధించిన శ్రీశ్రీ పరిణామాన్ని యీ పాదాల్లో గుర్తించవచ్చు. Socialist Realism — అని రష్యాలో కవులకి జీవస్పందనగా ఉన్న సిద్ధాంతాన్ని అడుగడుగునా అనితర సాధ్యమైన కవితా శక్తితో చెప్పడంచేత శ్రీశ్రీ అభ్యుదయ కవితా మార్గదర్శి అయ్యాడు.

సామాజిక స్పృహతర్వాత ముఖ్యమైన సిద్ధాంతంఈవ్యవస్థను మార్చడం ఇది సామ్యవాదానికి పునాది రాయివంటి భావం. "ఇంతవరకూ వేదాంతులంతా ప్రపంచాన్ని నిర్వచించారు. ఇప్పుడు దాన్ని మార్చాలి" అన్నాడు మార్క్సు తన శాస్త్రీయ సామ్యవాద సిద్ధాంతాన్ని గూర్చి. ఈ మార్పుఅనేదిగూడా శక్తితో

సాధించాలి అన్నది గూడా సామ్యవాద రహస్యం. "పెట్టుబడిదారీ విధానం గర్భంలో ఉన్న కార్మిక రాజ్యాన్ని వెలికి తియ్యడానికి శక్తియే (Force) మంత్రసాని" అన్నది మార్క్సు నిర్వచనం, ఈ సామాజికమైన మార్పు, దాని కొరకు ప్రయోగించవలసిన శక్తి — ఈ రెండూ గూడా శ్రీశ్రీ లో కవితాశరాలుగా దూసుకొచ్చినై. Force అన్నది సామ్యవాదపు గుండెకాయ కావడం. ఆ Force యొక్క విశ్వ రూపాన్ని తన శైలిలో, రీతిలో అద్భుతంగా ప్రదర్శించడం గూడా శ్రీశ్రీ కవిత్వానికి సామ్యవాదానికీ ఉన్న అవినాభావాన్ని తెలుపుతుంది.

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం, పోదాం పైపైకి"

త్రోసుకు పదమనడంలో Force నీ, ముందుకు పదమనడంలో మార్పునీ పలికిస్తున్నాడు శ్రీశ్రీ. "మహాప్రస్థానం" అనే గేయాన్ని మొట్ట మొదటి గేయంగా ప్రచురించడమే సామ్యవాదపు జీవశక్తియైన Force ను తన కవితా పతాకగా, భావనా మూల శక్తిగా చేసుకొన్న విధానం తెల్పుతుంది.

సామ్యవాదానికి మరొక ముఖ్య శక్తి భౌతికవాదం. (గతి తర్కాన్ని గూర్చి తర్వాత ఆలోచిద్దాం) దేవుడు, గ్రహాలు మొదలైన మానవుణ్ణి నడిపే ఏ అదృశ్య శక్తినీ నమ్మకపోవడం భౌతిక వాదం. తన పురోగతికి సృష్టికర్తగా తన శక్తినే నమ్ముకునే మానవుణ్ణి తయారు చెయ్యడం ఈ భౌతికవాద లక్ష్యం.

"మెదడన్నది మనకున్నది
అది సరిగా పనిచేస్తే
విశ్వ రహః పేటికా
విపాటన జరుగక తప్పదు.

శ్రీశ్రీకి మానవ శక్తి మీద ఉన్న నమ్మకం అటువంటిది. శుష్క వేదాం తపు నగ్న స్వరూపాన్ని ఈ క్రింది పంక్తుల్లో చూపిస్తారు—

"జమీందారు రోల్సు కారు
మాయంటావూ? బాబూ ఏమంటావు?
మహారాజు మనీ పర్సు
మాయంటావూ? స్వామీ ఏమంటావు?

ఇక సామ్యవాదానికి శిఖరం వంటిది "వర్గపోరాటం." ధనవంతు లోక పక్షం, నిరుపేదలోక పక్షం. నిరుపేదలు తిరగబడి ధనవంతులతో పోరాడి తమ హక్కులు తాము సాధించుకోవాలి. వర్గ పోరాటపు స్థూల స్వరూపం ఇది. ఈ వర్గ పోరాటం, కవిత్వంగా రూపొందడంలో రెండు అంతరువులున్నై. మొదటిది ధనవంతుల అహంకారాన్ని, దుర్గుణాల్నీ చెప్పి అసహ్యం కలిగించడం; బీదల బాధలు చెప్పి, వారి పక్షాన సానుభూతి కలిగించడం. రెండవది ధనవంతు లతోడి పోరాటానికి బీదల్ని సిద్ధపరచడం. ఈ రెండంతరువులూ శ్రీశ్రీ "మహా ప్రస్థానం"లో అవధుల్ని తాకినై. "వ్యత్యాసం" అనే గేయం ఈ వర్గ పోరాట భావానికి పరాకాష్ఠ.

"అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం"

ఈ మూడు పంక్తుల్లో విప్లవ స్వరూపమంతా ఉంది.

సామాజిక స్పృహ, సమాజపు మార్పు, మానవశక్తి, భౌతిక వాదం, వర్గ చిత్రణ (పోరాటం)—ఈ ఐదు భావాల్ని గూర్చి యింత వఱకూ వివరించ డం జరిగింది. కార్మిక విప్లవమూ, చారిత్రక దృక్పథమూ, అనే రెండు విశిష్ట

సామ్య సూత్రాల్ని తరువాత వ్యాఖ్యానిస్తాను. ఇప్పటికి వివరించిన ఈ ఐదు భావాల్లో ఒక వైచిత్రి ఉంది. వీటిని సామ్యవాదం తన ప్రధాన ధోరణిగా చేసుకున్నా, 20వ శతాబ్ది తొలుత నుండీ వికసిస్తూవచ్చిన సాంస్కృతిక పునర్వికాసం గూడా ఆధునికత అనే పేర ఈ భావాలన్నింటిని అంగీకరిస్తుంది. (వర్గ పోరాటాన్ని తప్ప) అందుకే అధునికతకి పునాదిరాళ్ళు వేసిన యుగకర్తగా గురజాడను గుర్తించడం జరిగింది. మానవతా వాదులు, నాస్తికులు, వ్యక్తి వికాసవాదులు—మొదలైన వారందరూ ఆధునికత నంగీకరించినా, సామ్యవాదమే ఆధునికతను ప్రధాన ప్రేరణగా చేసుకొన్నది. ఎప్పటి కప్పుడు దోపిడి రూపాలుగా మారిపోయే ఆచారాల్ని నిరసిస్తూ, వ్యక్తుల సమానత్వాని కడ్డం వచ్చే సంప్రదాయాల్ని ఛేదిస్తూ, ముందుకు పోవడం సామ్యవాద లక్ష్యం. అన్నింటినీ మించి ఆశావాద మొకటి సామ్య వాదపు బలం. తప్పకుండా వర్గ రహిత, సర్వ సమాన సమాజం నిర్మితం కాక తప్పదనేది దాని సిద్ధాంతం. ఇదే Historical Determinism. శ్రీశ్రీ మాటల్లో చాలా చోట్ల ఉరుములవలె ఈ నిశ్చయ సూత్రం వినవస్తుంది.

"ఈ స్వప్నం నిజమౌతుంది
ఈ స్వర్గం ఋజువౌతుంది"

ఈ విధంగా చూస్తే సామ్యవాదంలో రెండు పరిధులు కనిపిస్తై. ఆధునికతా పరిధి ఒకటి; విశిష్ట పరిధి ఒకటి. ఈ ఆధునికతా పరిధిని, అంటే, సామాజిక స్పృహ, మార్పు, శక్తి, భౌతికవాదం, వర్గచిత్రణ, ఆశావాదం—వీటిని సామ్య వాదులు కాని వారిలో గూడా చాలా మంది అంగీకరించవచ్చును. కాని వర్గ పోరాటం, చారిత్రక దృక్పథమూ, కార్మిక విప్లవమూ, గతితర్కమూ—అనే వాటిని సామ్యవాదులు మాత్రమే అంగీకరిస్తారు.

ఇట్లా రెండు పరిధులుగా విస్తృతమైన సామ్యవాదం అభ్యుదయోద్యమంగా అంగీకరించబడటంచేత, అభ్యుదయ కవిత్వం అన్నదానికి అత్యంత విశాలమైన అర్థం రావడం సంభవించిందనుకుంటాను. అభ్యుదయోద్యమంలో ప్రముఖ రచయితలలో మూడు పాళ్ళమంది సామ్యవాదాన్ని సంపూర్ణంగా అంగీకరించినవారు కాదు కాని, అందరూ అధునికతనూ, సామాజిక స్పృహనూ

ఒప్పుకొన్న వారే. అందువల్లే అనేక మంది Anti - Communists కూడా అభ్యుదయ రచయితలుగానే పరిగణింపబడ్డారు. కె. వి. రమణారెడ్డి సంకలనం చేసిన "అడుగుజాడ గురజాడది" అనే గేయ సంపుటి, "కల్పన" అనే గేయ సంకలనమూ అభ్యుదయోద్యమాన్ని అత్యంత విశాలార్థంతోనే తీసుకున్నట్లుగా స్పష్ట పడుతుంది. కుందుర్తి "వైతరణి" అనే కావ్యం పీఠికలో ఇట్లా అంటారు—

"ఒక దృష్టితో చూస్తే, గురజాడ, రాయప్రోలుతో ప్రారంభమైన నవ్య కవిత్వమంతా అభ్యుదయోద్యమంలో భాగమే. కొత్తను అన్వేషించిన ప్రతి ప్రయత్నమూ అభ్యుదయోద్యమ నిర్వచనం కిందికే వస్తుంది." ఈ విధంగా చూస్తే, మార్క్సిజాన్నే ధ్యేయంగా నమ్మిన కవులందరూ, అభ్యుదయోద్య మాన్ని మార్క్సిజానికి మాత్రమే అనుబంధించిన దాన్నిగా పరిగణించలేదని స్పష్టంగా కనిపిస్తుంది. "అభ్యుదయోద్యమం మార్క్సిజము పునాదిగాగల సాహిత్యోద్యమం" అని కొడవటిగంటి స్పష్టంగా కొన్ని చోట్ల చెప్పినా, ఎక్కువ భాగం దాని విస్తృతార్థాన్నే గ్రహించినట్లు, ఆయన వ్యాసాలవల్ల వ్యక్తమౌతుంది. అట్లాగే మిగిలిన మార్క్సిస్టు విమర్శకులందరూ.

ఈ విధంగా రాను రాను అభ్యుదయ కవి, అభ్యుదయ రచన— అనేవి వేరు వేరుగా పరిగణింపవలసిన అవసరం వచ్చింది. అభ్యుదయ కవి— అంటే మార్క్సిజమ్‌నే పూర్తిగా నమ్మి, దాన్ని తన కవిత్వానికి ఆత్మ లక్షణంగా చేసుకున్నవాడు. అభ్యుదయ రచన అన్నది ఆధునికత నాధారం చేసుకుని వ్రాయబడ్డ రచన. నిజమైన అభ్యుదయ కవులుగా శ్రీశ్రీ, కుందుర్తి, రెంటాల, గంగినేని, రమణారెడ్డి, సి. వి కృష్ణారావు, సోమసుందర్, అవసరాల, మొదలైన వారు పూర్వతరంలోను, సి. విజయలక్ష్మి, విప్లవ రచయితల్లో చాలా మంది, పరిగణింపబడతారు

నిజానికి ఆధునిక కవుల్లో మార్క్సిజాన్నే పునాది చేసుకుని వ్రాసిన వాళ్ళు కొద్ది మంది. ఆధునిక కవిత్వాన్ని నిరూపించిన వారు ఎక్కువ మంది. ఈ యిద్దరినీ కలిపి అభ్యుదయోద్యమం అనడంవల్ల రాగా రాగా అభ్యుదయ కవిత్వం, ఆధునిక కవిత్వానికి పర్యాయపదమై పోయింది. అభ్యుదయోద్యమం

యొక్క ప్రత్యేకత, దాని ఉద్యమశీలత మఱుగునపడిపోయింది. 1970 జూలై 4, 5 తారీకుల్లో హైదరాబాదులో "అభ్యుదయ రచయితల సదస్సు"లో మార్క్సిస్టులు, తటస్థులు, వ్యక్తివాదులు, సాంప్రదాయకులు, బి. సి. లకు చెందిన వారు-వీళ్ళందరికీ కలిపి ఒకే వేదికమీద ప్రభుత్వం సన్మానం చెయ్యబూనేటప్పటికి, అభ్యుదయోద్యమం చేతులారా ఎట్లా నాశనమైందో కొంత మంది సామ్యవాద కవులకి అవగాహన అయింది. దాన్తో, కొంతమందికి హఠాత్తుగా తమ ఉద్యమానికి విశిష్టత నిలుపుకోవాలన్న జిజ్ఞాస కలిగింది. అందుకే, ఆ సభలు జరిగిన అనంతరం "అభ్యుదయ" శబ్దం మీద కొన్ని చర్చలు జరిగినై. మోటూరి హనుమంతరావుగారు ఆ శబ్దంయొక్క విస్తృతార్థాన్ని గ్రహించగా, కొడవటిగంటి, రాచకొండ, రమణారెడ్డి, కేవలం మార్క్సిజమ్‌యొక్క పరిధినే నిర్దేశించారు. రమణారెడ్డి యీ విధంగా రాశారు. (ప్రభంజనం, 1-10-70)—

"అభ్యుదయ సాహిత్యం అంటే మార్క్సిస్టు భావ ముద్రతోటి, కమ్యూనిష్టు ఆదర్శ బలంతోటి 1943 తదనంతర కాలాన వెలువడిన సాహిత్యమే తప్ప, తదన్యమూ కాదు తత్పూర్వమూ కాదు!

ఈ మాటల్ని గట్టిగా చెప్పవలసిన అవసరం ఈ నాడు కలిగింది. నిజానికి అభ్యుదయోద్యమానికి, మిగిలిన లక్షణాలన్నీ ఎట్లా ఉన్నా, విప్లవం ప్రాణభూతమైంది. వర్గపోరాటాన్ని హృదయస్థం చేసుకోని కవిని, అభ్యుదయ కవి అనరాదు 1940లోనే శ్రీశ్రీ "సామ్యవాద సమాజమే అభ్యుదయ రచయితల ధ్యేయం. అందుచేత అభ్యుదయ రచయితలంతా సామ్యవాదులే అని నిరభ్యంతరంగా ఒప్పుకోవచ్చును." అని అన్నప్పటికీ వర్గపోరాటాన్ని చెప్పని ఆధునికులంతా అభ్యుదయకవులుగా అంగీకరింపబడడంచేతనే, నేడు అభ్యుదయ శబ్దార్థ వివాదం ఏర్పడింది. అందువల్లనే, అభ్యుదయ శబ్దం, విప్లవ దూరమైపోయిందని "విప్లవ రచయితల సంఘం" ఆవిర్భవించింది.

శ్రీశ్రీ మొదలుగాగల అభ్యుదయ కవుల చేతుల్లోనే వచన కవిత గూడ రూపు దిద్దుకొన్నది. ఈ నాడు రూప పరిణామంలో ఉత్కృష్ట స్థితి నందుకొన్న వచన గేయపు పరిణామ దశలన్నీ అభ్యుదయ కవుల రచనల్లోనే మనం దర్శించగలం. ప్రజలు, సామాజిక స్పృహ, వ్యావహారికం - ప్రధాన

మయ్యేటప్పటికి, సామ్యవాదులే వచన గేయానికి ఒక నిండైన స్వరూపాన్ని సంతరించగలిగారు. అది యీ నాడు, విస్తృతమై, ప్రతి కవికీ భావవాహికయై, ఒక శిల్ప పరిణామాన్ని గూడా పొంది, విశ్వరూపాన్ని ధరించింది.

నిజంగా ఆలోచిస్తే, ఒక ఉద్యమం అన్నది కొన్ని ప్రత్యేక సిద్ధాంతాల సమాహారంలో నుండే బయలుదేరుతుంది. అట్లాగే అభ్యుదయోద్యమం—మార్క్సిజమ్‌ను పునాదిగా పెట్టుకొని బయలు దేరినదే. కాని రాను రాను అది రాజకీయాలకి దూరంగా ఉంచబడడానికో, లేక విస్తరింపజేయబడడానికో, ఉద్యమ నిర్మాతలచేతనే విశాలార్థానికి ఒదిగింపబడింది. ఇంక నెమ్మదిగా, అభ్యుదయ శబ్దం నిష్క్రమించి, విప్లవ శబ్దం సామ్యవాద సూచి అయ్యేటట్లుంది. (అరసం విరసంయొక్క సైద్ధాంతిక విభేదాలను బట్టి కాదు. ఇక్కడ ఆ శబ్దాలకు గల అర్థాన్ని మాత్రమే పరిగణించాలి. సామాన్యుడు గూడా అభ్యుదయానికి సామాన్యార్థాన్ని. విప్లవానికి ప్రత్యేకార్థాన్ని ఈ నాడు గ్రహిస్తున్నాడు అరసం వారు విప్లవ రచన చెయ్యవచ్చు. విరసం వారు విప్లవం లేని రచన చెయ్యవచ్చు. ఇక్కడ ఆ శబ్దాలే విచారింపబడినై.) కాని, ఒక తరం మారిన తర్వాత అభ్యుదయోద్యమం అంటే ఏది—అనే ప్రశ్న వచ్చినప్పుడు, ఆధునిక భావాలుగల వచన కవితకే ఆ పదాన్ని పర్యాయ పదంగా పరిగణించడం తగదు. ఆ ఉద్యమం ప్రత్యేకతలోనే దాన్ని వివరించవలసి ఉంటుంది. లేకపోతే, అభ్యుదయ కవితకీ. ఆధునిక కవితకీ భేదం ఏమీ ఉండదు. అంటే, ఆంధ్ర సాహిత్యంలోని అభ్యుదయోద్యమం యొక్క లక్ష్యం సామ్యవాద సమాజ స్థాపనమే. విస్తృతంలో ఆ పదం ప్రయోగింపబడక ముందు, అభ్యుదయ కవుల ప్రాణ మూలాల్ని సంచలింప జేసింది మార్క్సీయ భావనయే. "కల్పన" గేయ సంకలనం యొక్క ఉపోద్ఘాతంలో రామదాసు ఇట్లా అంటాడు—

"ఈ యుగాన్ని ఆవరించిన ప్రధాన తత్వ దృష్టి మార్క్సిజమ్. నేటి

సాంఘిక విషబంధంలో చిక్కిన మానవునికి మార్క్సిజం గొప్ప విష్కృతి మార్గంగా కనిపించింది"

ఇట్లా చెప్పిన కవులందరూ గూడా తమ ప్రత్యేకత నిలుపుకోకుండా, తమలో అందర్నీ కలుపుకున్నప్పటికీ, ఈ నాడు అభ్యుదయ శబ్దానికి విస్తృర్థాన్ని చెప్పుకోవడం, ఉద్యమ కర్తల పవిత్ర భావానికి దెబ్బకొట్టినట్లౌతుంది. ఆ ఉద్యమం యొక్క అసమాన లక్ష్యాన్ని విస్మరించినట్లవుతుంది.

కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి
విస్తరించాలి చైతన్య పరిధి—
అగ్ని జల్లినా, అమృతం కురిసినా
అందం ఆనందం దాని పరమావధి.

— తిలక్

వేకువ

కె. శివారెడ్డి

దీపాల కళ్ళు మూసేసి
చీకటి వడ్డీ వ్యాపారం చేసుకుంటోంది.

చరిత్ర
బంగారు గుడ్లు పెట్టే బాతు
దాని పొట్ట చీల్చి చూస్తే
కలుషితం చేయబడ్డ
రక్త సరస్సులూ తప్ప
కారుణ్యేతి హాసాలు
తిరిగి రాయ బడ్డట్టు కన్పించదు

గతం
ఒకప్పుడు
బాగా బరువెక్కిన జేబు—
దాన్ని కుత్తుక కాన కత్తిరించి
సొమ్ము చేసుకుంటున్న
రాజకీయ నాయకులు
చచ్చిన దూడలాంటి

వర్తమానం తోలువలిచి
గడ్డి కుక్కి—
పురల దూడగా తయారుచేసి
ఎరచూపి ప్రజా సమూహం
పొదుగుల నుండి
రక్త పయస్సులు
పిండుకుంటున్నారు.

అవినీతి నువ్వుల నూనెతో
అధర్మ అర్థం పిండి వంటలు చేసుకుంటున్నారు.
మదరిండియా పొత్తి కడుపుమీద
బలమైన ఇనుప బూట్ల గాట్లు
రేడి పిల్ల లేత గుండె చీల్చి
రక్తస్నాతలైన పులి కోరలా
అతి భయంకరంగా
విలయంగా కన్పిస్తున్నాయి.

గుండెల్లేవు—
గుండెల స్థానంలో
చేదు చోటు చేసుకుని
రాజ్యాలేలుతుంది కాబట్టి
చీకటి పోషింపబడుతోంది

అర్థం తెలియని అనర్థం
ఆటవిక మనస్తత్వంతో
పదేళ్ళ పిల్ల మానవతను
రేప్ చేసిన దృశ్యాన్నే

హర్షం వర్షించే కళ్ళే ఎక్కువై
లయబద్ధ వికృతాన్ని
వెలిగక్కే చేతులే పెక్కులై
రాత్రించరుల
కరాళ నృత్య సారంభంలో
రహస్సు గుండె పగిలి పోతోంది.

చీకటి యాజమాన్యం కింద
కాంతి కళ్ళు కట్టివేయబడుతున్నాయి.
అజాగళస్తనాలే
పరిపూర్ణ పయః కుంభాలుగా
ఋజువు చేయబడుతున్న
ఋజు మార్గం
వర్తమాన శిలా ఫలక ఫాలం మీద
టెన్ కమాండ్‌మెంట్స్‌గా
చెక్కబడుతున్నాయి.

దోపిడీ వింత సృష్టి తలపెట్టిన
మాయల ఫకీరుల శ్రేయో రాజ్యంలో
'న్యాయం' బాలనాగమ్మ
'సత్యం' బాలవర్ధి
అందరి గుండెల్లో మండితే తప్ప
ఈ వర్తమానం
భవిష్యత్తు కడుపున
పుట్టకుండా ఉండదు.

శిలాసుమాలు

దాశరథి

కనపడని తీగెపై కొనలలో పూవులు
వినపడని నవ్వులో విరిసినవి తావులు

జాతి పూర్వ చరిత్ర చదివి చెప్పెడి పూలు
మలుసందె గాడ్పులో మాడిపోవని పూలు
తండ్రి తాతలనాటి ధనము
తంత్రిపై వినరాని స్వనము

కదలకే కూర్చుండి యెదను కదిలించేను
మెదలకే నిలుచుండి సొదను రగిలించేను
రాతి తోటలలోని పూవులు
చేతమ్ము నలరించు తావులు

ఆకురాలెడి కాలమనెడు రంపమ్మునకు
తెగిపోవని వసంత దివ్య సుమజాలములు
శబ్దమట్టుల శాశ్వతములు
శతాబ్దముల కనశ్వరములు

త్రుంచి వేసినగాని తొలగి పోవదు తావి
వర్తమానపు పూల వాసనయె కద భావి!

రాలలో మ్రోగు వాద్యాలు
పూలలో దాగు మద్యాలు

వాడిపోవని పూలు వచ్చి చూడండి
వీడిపోవని గతము పిలిచె రారండి
రాతి పూవులపైన మమత
చేతమ్ములో నింపె కవిత !

[ఓరుగల్లు కోటలోని శిల్పాలను చూచి— వాటిని
వికృతం చేసిన ముష్కరుల దుశ్చర్యకు వగచి]

ఉదయం కానే కాదనుకోడం విరాళ

ఉదయించి అట్లానే వుంటుందనుకోవడం దురాశ

చీకటిలో కనువిప్పిన వారికి వెలుతురంటే బూచి

వెలుతురులో కనుతెరచిన వారికి చీకటంటే పిశాచి

——కాళోజి

నేనూ, నా రచనా

—కుందుర్తి

సంపాదక మహాశయులు కోరిన విధంగా రాయాలంటే అదొక ఆత్మ కథ అంత అవుతుంది. సాహిత్యరంగంలో నాకు అంత స్థాయి వచ్చినప్పటి మాట చూద్దాం. మిత్రుడు వరదరాజేశ్వరరావు తన కావ్యానికి శీర్షిక పెట్టినట్లు "అందాక" యీ చిన్న వాస్యం.

ఎందుకైనా మంచిదని ముందుగానే మనవి చేస్తున్నాను: సాహిత్యంలో నేను నూటికి నూరు పాళ్ళూ ప్రయోజన వాదిని. సాంఘిక ప్రయోజనం లేని రచన నాకూ, నా హృదయానికీ దూరంగానే వుంటుంది. కవిత్వంలో కొందరు చెప్పే సౌందర్యవాదం నాకు ఏనాడూ పూర్తిగా అర్థం కాలేదు. కవిత్వంలో సౌందర్యం అంటే లలిత లలిత పదముల కూర్పుతో మనోహరమైన శయ్య సాధించడమా అంటే కాదేమోననిపిస్తుంది. అలాగే, లలితములైన భావాలు — అంటే పూలు, పరిమళాలూ, చంద్రుడూ, వెన్నెలలూ, ప్రేయసీ, పెదవుల మాధుర్యమూ వంటి ప్రకృతిలోని సుందరమైన వస్తువులను మాత్రమే భావన చేయడమా అంటే—అదీ కాదేమోననిపిస్తుంది. సౌందర్యవాదులైన కవులు, తెలిసో, తెలియకో, సుమారుగా యీ రెండింటి పరిధిలోనే తిరుగుతూ తమ తమ కవితలకు అన్వయం చెప్పుకుంటూ వుంటారు మరి యీ రెండూ కాని సౌందర్యం కవితలో ఏమిటి అనేది ప్రశ్న. "అలంకారాల భార మొల్లని అతి సహజ సౌందర్య వాదీ, నిజం నిజంగా భాసించే నీ కవితా శాఖ మూలమేదీ?" అని నన్ను నేనొక చోట ప్రశ్న వేసుకున్నాను. అంటే నా వూహలో సత్యం పలకడమే సౌందర్యం. ఇది నేను కొత్తగా కనిపెట్టిన విషయమని చెప్పడంలేదు.

ఎంతో హెచ్చి చెప్పిందే. సార్వకాలికమైన సత్యాన్ని ఎందరైనా, ఎన్ని సార్లయినా, చెప్పక తప్పదు. కళ్ళ ముందు కనిపిస్తున్నదానిని చూడకుండా తొలగిపోతుకుని పోవడం నిత్య సత్యాన్వేషి అయిన కవికి సాధ్యం కాదు. కనిపించే దంతా మిథ్య అనుకుని, సత్యం మరెక్కడో యిహలోకాతీతంగా వున్నదను కోవడంకూడా వెర్రి భ్రమే. కవి తన చుట్టూ వుండే మనుషుల్ని, వారి కష్ట సుఖాల్ని, మనస్తత్వాల్ని, మంచి చెడులనూ గురించే పాడాలి. డాబూ, దర్పమూ, దర్జా, అహంకారమూ, అవినీతీ, అక్రమ ప్రవృత్తీ, స్వార్థమూ పెన వేసుకుని, నిజమైన మానవ సంస్కృతికి దూర దూరంగా వుంటూ, కృత్రిమంగా తెచ్చిపెట్టుకున్న బలుపు బలంగా భావించుకుంటున్న సమకాలీన సమాజం మీద "కలం యుద్ధం" ప్రకటించవలసిన బాధ్యత యీ నాటి కవులకు వున్నది. విశేషమేమంటే సౌందర్యవాదులలో చాలా మందికి సామాజిక సత్య సందర్శనం గిట్టదు. ఈ కాలంలోనేకాదు; ఏ కాలంలోనైనా, సామాజిక స్పృహ లేని కవులు యీ పని చేయలేరు. నేనన్న ప్రయోజనవాదం సారాంశం యిదే. దీనిని మీరు అభ్యుదయ మనండి, ఆధునిక మనండి ప్రజా కవిత్వమనండి; మరే పేరు పెట్టి అయినా పిలవండి. నాకు అభ్యంతరం లేదు. కాని సామాజిక శ్రేయస్సు అనేది నేటి కవిత్వానికి నేను విధిస్తున్న మొదటి షరతు. ఇది అభ్యుదయ కవిత్వపు తొలి రోజుల్లోవలె పరమ వాచ్యంగా వుండి ప్రచార సాహిత్యమనే పేరు పొందడానికి యోగ్యత సంపాదించనవసరంలేదు. నేటి అధునాతన వచన కవిత్వంలోవలె, వ్యంగ్యంగా, గర్భితంగా ధ్వనికారుడికి సమ్మతంగా వుండొచ్చు; వుండాలి కూడా. 1942లో "మన్య విప్లవం" అనే గేయం రాసిన రోజుల నుండీ యిటువంటి భావనలే నా మనస్సులో మెదుల్తూ దాదాపు స్థిరపడి పోయాయి. ఫలానా సంమర్తి అనే కవి కేవలం కాలం వల్లనే కాక, ఊహ వల్ల కూడా యిరవయ్యో శతాబ్దం వాడు అనిపించుకుంటే నాకు చాలు. సాహిత్యంలో యీ మాత్రమే నేను కోరుకునేది. నేటి అందరు కవులూ అలా అనిపించుకోవాలనే ఆకాంక్ష కూడా నాకు వుంది.

పద్య రచన సాధన చేస్తున్న తొలి రోజుల్లో, మొదట్లో, రాయప్రోలు సుబ్బారావుగారు బాగా ప్రచారం చేసిన గీత పద్యాల శైలిలో నడిచేది నా కవిత. "షరా మామూలే" అన్నట్లు వస్తువు "నా ప్రేయసి". ఈ పేరుతో రాసిన

కవిత్వంమీద సంస్కృత భాష చేసిన దురాక్రమణ నాకు అంతగా ఇష్టం ఉండేది కాదు దీనికి కారణం నాకు సంస్కృత భాషలో పాండిత్యం లేకపోవడమేమో! ... గారు తెనుగు కవిత్వంలో చూపిన సొంపులు నచ్చినంతగా నాకు ప్రబంధాలలోని సంస్కృత భాషా భూయిష్టమైన సమాస రచనా చాతుర్యము నచ్చదు. అయితే మరి విశ్వనాథ వారివలె సమాస భూయిష్టమైన పద్య రచన ఎందుకు ...ట్లు? దీనికి సరియైన సమాధానం దొరకదు. కాని ఇవన్నీ కవిగా రూపొందుతున్న దశలో నామీద పడిన రకరకాల ప్రభావాలు. అసలు కవిత్వం రాయాలనే ఉద్దేశ్యం కూడా నాకు కలగడానికి అవకాశం లేని రోజుల్లోనే, అంటే నాకు 12, 13 సంవత్సరాల వయస్సున్నప్పుడే తెనుగు కవిత్వాన్ని చిలుక పలుకులతో కులికించిన జాషువాగారితో పరిచయం కలిగింది. వినుకొండలో నేను ఫస్ట్ ఫారమ్ పూర్తి చేసే వరకు ఆయన నాకు తెలుగు మాష్టారు. తెలుగులో నా తెలివితేటల్ని ఆయనఅప్పుడే పసికట్టాడు కావోలు క్లాసులో నన్నెంతో అభిమానిస్తుండేవాడు. ఆయన పిరదౌసి క్రొత్తగా వ్రాసిన రోజులవి. మా విద్యార్థులను సాయంకాలం స్కూలులో సమావేశపరచి పిరదౌశి వినిపిస్తుండేవాడు. ...టే పిరదౌశి కావ్యానికి ప్రథమ శ్రోతలలో నేనొకణ్ణి. మరి తేట తెనుగు ...ద మమకారానికి బీజం ఇక్కడ పడిందేమో! ఈ నాటి వచన కవిత్వంలో ...వహార భాషా పద ప్రయోగానికి ప్రాధాన్యమిచ్చి, సంస్కృత సమాస రచన ...లో ఇమడదని నేను పదే పదే చేసే వాదనకు ఇదీ ఒక కారణం కావచ్చు ...మో! జాషువా, విశ్వనాథ- వీరిద్దరూ తెనుగు కవిత్వంలో రెండు రకాల ...లకు యేకైక ప్రతినిధులుగా ప్రసిద్ధి పొందారు. వీరిద్దరితో పరిచయం ...గడం నాకు కలిగిన అపూర్వమైన ఒక అవకాశం అని నేననుకొంటాను. ...రోజుల్లో వీరుభయులు పరస్పరం శత్రువులని లోకం చెప్పుకుంటూ వుండేది. ... నేను వీరిద్దరిలో మెలగుతో యిద్దరి సద్భావాన్నీ పొందగలిగాను. ఈ ఉభయులను ఒకే సభలో నేనెప్పుడూ చూడలేదు; చూచినవారు చెప్పిన సంగతులు ... తప్ప. మొన్న సౌమ్య ఉగాది సందర్భంగా విజయవాడ రేడియోవారు ...ర్పాటు చేసిన కవి సమ్మేళనలో ఒక గ్రూపు ఫోటో తీశారు. అనుకోకుండా ...ం ముగ్గురం ఒకచోట నిలబడ్డాం. జాషువా గారు, విశ్వనాథవారిని పలకరించారు; "ఏం మాట్లాడకుండా మౌనంగా ఉన్నారు" అని. "ఏమీలేదు మామూలే" అని సత్యనారాయణగారి జవాబు. వీరుభయులు మాట్లాడగా వినడం నాకదే

మొదటిసారి. గురువుగారు మౌనంగా వుంటేనే మంచిదిలే అని మనస్సులో అనుకుని నాలో నేను నవ్వుకున్నాను. బి. ఏ. చదివే రోజుల్లో అంటే సేప్త్రికం రాసే రోజుల్లో సత్యనారాయణగారి కవిత్వం అందరికి చదివి వినిపించి ప్రచారం చేయడం, ఆయన మహాకవి అని వారందరిచేత ఒప్పించడం అనే బాధ్యతలు నాఒక్కడికే అన్నట్లుగా ప్రవర్తిస్తుండేవాడిని. నా మిత్రులలో, నా ముందు సత్యనారాయణగార్ని యేమైనా అనడానికి చాలా మందికి దమ్ములుండేవికావు. మిత్రులు సుబ్రహ్మణ్యం, రామదాసులు కూడా నా అంత కాకపోయినా కొంత వరకు ఆయన భక్తులే.

క్రమంగా, కొంత వరకు నా ప్రచారంవల్ల, మారిపోయిన ఆంజనేయ ప్రసాదు నా కంటే యెక్కువ ఆయన భక్తుడైనాడు. ఆ రోజుల్లో మా మిత్ర బృందంలో దోగుపాటి ఆంజనేయ శర్మ అనే ఒక మిత్రుడుండేవాడు. అతడు కొంచెం విమర్శకుడు. విశ్వనాథ వారికి మనసా విరోధి. అతన్ని ఒప్పించడానికి కొన్ని నెలలపాటు రాత్రుళ్ళు కూర్చోబెట్టి రామాయణ కల్పవృక్షం బాల కాండ చదివి విశేషార్థాలు చెప్తుండేవాడ్ని. చివరకు అతను నాకంటే వీర విశ్వనాథవాది అయినాడు. ఆ సమయంలోనే ఒక వ్యాకరణ పండితుడికి బాలకాండ ఇచ్చి చదవమన్నాను. రెండు రోజుల తర్వాత ఆయన నన్ను పిలిచి అందులో 6, 7 వ్యాకరణ దోషాలు చూపించాడు. పండితులందరూ ఇంతేలే అని నేను మనస్సులో కలిగిన చికాకు మనసులోనే అట్టి పెట్టుకొని మంచిగా బైటికి వచ్చేశాను. కారణం నాకు వ్యాకరణంలో పాండిత్యం లేదు కాబట్టి. పండితులను దోషజ్ఞులన్న దిందుకేనేమో ! నాటికీ నేటికీ పండితుడై వుండి కూడా కావ్యం చేతికి వస్తే దోషముల జోలికి ఏమాత్రం పోని పండితుడు నా అనుభవంలో ఒక్కడే కనిపించాడు. ఆయన శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు. ఏ కావ్యము చేతికిచ్చినా అందులోని మంచిని హంసలా యెత్తి చూపించగల నేర్పు ఆయన సొమ్ము. ఆ రోజుల్లో నవ్య కళా పరిషత్ అనే ఒక చిన్న సంస్థ పెట్టుకున్నాం; నేను, ఏల్చూరి, రామదాసు, అనిసెట్టి, పూర్వాశ్రమంలో దండమూడి కేశవరావు (ఇప్పుడు పూజ్యశ్రీ కేశవ తీర్థ స్వాముల వారు) తరువాత పోలూరి, తిలక్, సి. వి. క్రిష్ణారావు, జూనియర్ సముద్రాల ప్రభృతులను చేర్చుకున్నాం. మాకు ప్రధాన పోషకుడు శ్రీ దేశిరాజు క్రిష్ణశర్మ. ఈ సంస్థపేరుతోనే 1944లో

నయాగరా ప్రకటించబడింది. ఈసంస్థ ప్రారంభకుల్లో నేనులేను. కాని అందులో ప్రముఖుడుగా వుండే వాడిని. నవ్య సాహిత్య పరిషత్‌లా, వార్షిక సభలు జరుపు తుండేవాళ్ళం. దీనికి చివరిసారి జరిగిన అధ్యక్ష ఎన్నికలలో నేను యెన్నికై నాను. ఆ తరువాత దీని కార్య కలాపాలు పూర్తిగా స్థంభించి పోయాయి. సంస్థ పోతే పోయింది. గానీ నాకు జీవితాంతం అధ్యక్ష పదవి ఇచ్చిపోయిందని మనస్సులో అనుకొని అప్పుడప్పుడు నవ్వుకొంటుంటాను.

నవ్య సాహిత్య పరిషత్‌లోని హేమా హేమీలవలె మేమూ గొప్ప వారం కావాలని ఆ రోజుల్లో ఉబలాట పడే వాళ్ళం. ఏలూరులో నవ్య సాహిత్య పరిషత్ వార్షిక సమావేశం జరగటానికి పదిరోజులు ముందుగా శ్రీ శివశంకరశాస్త్రి (స్వామి శివశంకర స్వామి)గారి దగ్గరికి వెళ్ళి నేనూ, పోలూరి,ఏల్చూరి, మొదలైన వారందరూ పద్యాలు వినిపించాం. గుంటూరులోని థియో సాఫికల్ లాడ్జిలో ఆయన అప్పుడు వుండేవాడు. ఏలూరు సమావేశంలో మమ్మల్ని పాల్గొననివ్వవలసిందని కోరడానికి వెళ్ళి ఆయన ముందు మా కవితా ప్రదర్శనం చేశాము. యువ కవులంటే ఆయనకు ఎంతో యిష్టం. వారిని ప్రోత్సహించే తత్వం. రెండు రోజుల ఏలూరు సమావేశంలో పూర్తిగా ఒకపూట మా నవ్య కళా పరిషత్‌కు కేటాయించే యేర్పాటు ఆయన చేశాడు. ఏలూర్లో నాకంటే పోలూరి ఆంజనేయ ప్రసాద్ బాగా చదివి పేరు తెచ్చుకున్నాడు. సత్యనారాయణ గారివలె పద్యం మనోహరంగా చదువుతాడని నాకు అప్పుడు పేరుండేది. నేనేమో అప్పటికే పద్యం కొంత వరకు వదలి మాత్రాచ్ఛందస్సులు సాధన చేస్తున్నాను. "నానా సాహెబ్"నుగురించి మాత్రాచ్ఛందస్సులో రాసిన గేయాలు చదివాను. కాని ఎందుకో పూర్తిగా ఆరోజు ఫెయిల్ అయిపోయినాను. అప్పటికే నాకు నవ్య సాహిత్యపరిషత్ కవిప్రముఖులలో చాలామందితోచక్కని పరిచయం యేర్పడింది.

కవితా ప్రారంభ దశలో పోలూరి ఆంజనేయ ప్రసాదూ, నేనూ, కలిసి తిరుగుతూ వుండే వాళ్ళం. మేమిద్దరం కలసి రోజుకు ఒకటో రెండో పద్యాల చొప్పున ఒక ఆరు నెలల పాటు వసు చరిత్రను అధ్యయనం చేశాం. ప్రతి రోజు సాయంత్రం బెజవాడ

రామమోహన్ లైబ్రరీలో ఇదీ మా పని. సవ్యాఖ్యానంగా వున్న వసు చరిత్ర ప్రతి, ప్రతిరోజు లైబ్రేరియన్ మా కోసం రిజర్వ్ చేసివుంచేవాడు. నాటికీ నేటికీ నేను క్షుణ్ణంగా చదివిన కావ్యం అదొక్కటే. మిగిలిన కావ్యాలు, దాదాపు ఆ గ్రంథాలయంలో వున్నవన్నీ కొన్ని వందలు చదివాను గానీ అంత పట్టుదలతో మరి దేనిని చదవలేదు. వసుచరిత్ర పూర్తి చేసేటప్పటికే భట్టుమూర్తి చెప్పినట్లు "ఈ బహుళాంధ్రోక్తి మయ ప్రపంచ " మంతా మనోగోచరమైనట్లనిపించింది. తెనుగు కావ్యాలలో వసు చరిత్రను మించిన కావ్యం అంతకు ముందుగానీ తర్వాతగానీ లేదనే యిప్పటికీ నా విశ్వాసం అటువంటి దానినే ప్రథమంగా, క్షుణ్ణంగా చదవడంగూడా ఒకవిధంగా నా అదృష్టం.

2

ఈ కథంతా 1942కి పూర్వం జరిగింది. మరొకసారి నవ్య సాహిత్య పరిషత్ వార్షిక మహాసభ విజయవాడలో రామమోహన లైబ్రరీ పై అంతస్తులో విశ్వనాథవారి అధ్యక్షతన జరిగినప్పుడు శ్రీశ్రీని నేను మొట్ట మొదటి సారిగా విన్నాను. శ్రీశ్రీ చదవటం పూర్తి చేశాక, సత్యనారాయణగారు లేచి శ్రీశ్రీని కౌగలించుకుని ఆనంద బాష్పాలతో ఆవేశంతో ప్రశంసించారు. తరువాత గుంటూరులో చదువుతున్నరోజుల్లో శ్రీశ్రీ కొత్త కవితా ప్రభావం నా మీద క్రమంగా పడసాగింది. మిత్రుడు శ్రీ మాచిరాజు దేవీ ప్రసాదరావు ఒక చిన్న పాకెట్ సైజు డైరీలో శ్రీశ్రీ గేయాలు కొన్ని మద్రాసునుంచి తెచ్చాడు. ఆ వ్రాత ప్రతి మా అందరికీ అప్పటిలో ఆధారం. అభ్యుదయ కవితోద్యమం కొత్తగా అల్లుకుంటున్న రోజులవి. ప్రతిరోజు సాయంత్రం బ్రాడీ పేటలో రైలు పట్టాల దగ్గర పది పన్నెండు మంది మిత్రులు చేరి కవితా విమర్శలూ చర్చలూ చేసుకుంటు వుండేవాళ్ళం. క్రమంగా నేనూ, రామదాసు, సుబ్రహ్మణ్యం అభ్యుదయ కవిత్వం వైపు పూర్తిగా మొగ్గిపోయాము. మిగిలిన వారిని కూడా మావైపుకి లాక్కోవాలని వాళ్ళను ఒప్పించడం ఒక ఉద్యమంగా భావించి

చర్చలు జరిపే వాళ్ళం, మాదగ్గరికి వచ్చే వాళ్ళలో శ్రీ ముదిగొండ వీరభద్ర మూర్తి, శ్రీ కోట వీరాంజనేయ శర్మవంటి, అప్పటికీ యిప్పటికీ మారని సనాతన వాదులు కూడా వుండేవారు. అటువంటి వారితో శాస్త్రబద్ధమైన రస విషయిక చర్చలు చేసే భారం నాది. మా రామదాసు వారు చెప్పినది విని విని, చివరకు గంభీరమైన ఒక వెకిలి నవ్వు నవ్వి వాళ్ళను చిత్తుచేసేవాడు. ఏల్చూరి సుబ్రహ్మణ్యం మధ్యవర్తిగా వుండేవాడు. శ్రీయుతులు ధనకుధరం, అబ్బరాజు శర్మ, కొంపెల్ల శ్రీరామమూర్తి అనే ముగ్గురు యువకులు అష్టావధానము ఆశు కవిత్వమువంటి స్థాయిలో వుండి మా దగ్గరకు వచ్చేవారు. శ్రీరామమూర్తి నా సేప్తికంలో మొదటి పది పద్యాలకు కాబోలు వ్యాఖ్యానం వ్రాసుకవచ్చి చూపించాడు. నా కావ్యానికప్పుడే వ్యాఖ్యానం వ్రాసేవారు కూడా తయారైనారనే విజయగర్వం మనస్సులో ఒకవైపు కదిలింది. కానిఅప్పటికే నేనుసేప్తికానికీ పద్య కవిత్వానికీ ఒకనమస్కారం పెట్టేసినస్థితి లోవున్నాను. అందువల్ల నాకంత ఉత్సాహం కలిగించలేదు ఆ ముగ్గురిలో ధనకుధరం, తరువాత తరువాతబాగాఅభ్యుదయ కవిత్వంవైపుక్రమంగామొగ్గాడు. అలాగే మాపోలూరిఆంజనేయ ప్రసాదు కూడా. సనాతన వాదులు మా చర్చల్లో తరచు హేళనకు గురి అవుతుండేవారు. ఇక్కడ యెక్కువగా మా రామదాసు పని. ఆరోజుల్లో కరుణశ్రీ మొదలైన వారు వచ్చినా దాసు హేళన చేస్తూవుండేవాడు. నేను మాత్రం నిజమైన ప్రజాస్వామ్యవాదిగా మర్యాదగా మాట్లాడి వారిని ఒప్పించేవాడిని. అందుకే శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, కోట వీరాంజనేయ శర్మ (యిప్పుడు అష్టావధాని) ప్రభృతులకు కూడా అప్పటికీ ఇప్పటికీ నేనంటే గౌరవము, ప్రేమాభిమానాలు. సనాతనవాదులను ఒప్పించాలనే యీ తత్వము యిప్పటికీ నాలో కొద్దో గొప్పో, ఉండనే ఉంది.

3

1944 లో నయాగరా ప్రకటించడంతో కవిత్వంలో నా మార్గము స్థిరపడి పోయింది. వెంటనే నవ్యకళాపరిషత్తు తరపున ఒక మానిఫెస్టో ప్రకటించారు.

"వెర్స్‌లిబ్రే" అనే కవితారూపము ఆధునిక కవిత్వానికి తగిన రూపమనీ దానిని ప్రచారం చేయడానికి మేము ప్రయత్నిస్తామనీ సామాన్య మానవుడి జీవితగాథలే మాకు కావ్య వస్తువని ఆ మానిఫెస్టోలో చెప్పినదాని సారాంశము. నయాగరా తరువాత నేను వ్రాసిన ప్రతి రచనలోనూ ఈ ఆదర్శము తొంగి చూస్తూనే వుంటుంది. ఆనాటినుండి నాకు కవితా జీవితం ఒక వచన కవితా ప్రయోగశాలగా మారింది. వచన కవిత్వంలో సంపూర్ణ కావ్యం రాయాలనే కాంక్షతో తెలంగాణా, (1949) ప్రారంభమయింది. పాత్రలచేత వచన కవిత పలికించడం ఏలాగో చూడాలన్న అభిలాషతో ఆశ (1956) మొదలు పెట్టడం జరిగింది. "ఆచార్లగారమ్మాయి" అనే నాటిక కూడా ఈ కోవకు చెందినదే. ఆ తరువాత ప్రారంభించిన "దండియాత్ర" కూడా ఒక మహా కావ్య నిర్మాణ లక్ష్యంతో కూడుకున్నదే. మరొక కావ్యం "భగవంతునికి బహిరంగ లేఖ" అభ్యుదయ తత్వంతో భగవంతుడ్ని వుద్దేశించి దాదాపు శతకకవిత్వపు పద్ధతిలో సాంఘిక పరిస్థితుల చిత్రణకు వుద్దేశించినట్టిది. ఈ చివరి రెండూ అసంపూర్ణములు. "నగరంలో వాన" వంటి సుదీర్ఘమైన గేయాలూ, అముద్రిత కావ్యం వంటి కథా కావ్యాలు బృహత్ కావ్య రచనాభిలాషకు సంబంధించినవే. "నాలోని నాదాలు" కేవలం ఆత్మాశ్రయ రీతిలో చెప్పిన ఖండికలు. ప్రతి వారముయేదో ఒక రచన చేస్తూవుంటే సాధన జరుగుతుందనే ఉద్దేశ్యంతో ప్రతివారం ఆంధ్రజనత పత్రికకు ఒక ఖండిక రాస్తూ కవిత్వపు "కాలం" నిర్వహించాను.

"నయాగరా" తర్వాత విశ్వనాథవారి ప్రభావంనుండి పూర్తిగా తప్పుకుని "నేనే నా రచన" అన్నపద్ధతిలో నేను నేనుగా కనిపించడానికి ప్రయత్నం ప్రారంభమైంది. 1944 నుండి 56 వరకు దాదాపు 12 సంవత్సరాలు నేను పట్టుదలకోసం పద్యం రాయలేదు. అంటే వచన కవితా సాధనలోనే మనస్సును లగ్నం చేశాను. పద్యంమీద నాకు యిష్టంలేదని భ్రాంతిపడిన కొందరు మిత్రులకు సమాధానంగా "యుగే యుగే" పీఠికలో "నన్నయాదులచే తీర్చిదిద్దబడిన పద్యం మాకు తల్లి" అని మనవి చేసుకున్నాను. పన్నెండేళ్ళ అజ్ఞాతవాసం తరువాత మొట్టమొదటిసారిగా రాసిన "తెనుగు బొద్దం" అనే పద్యాలు చూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. అయితే మొదటినుంచీ లెక్కవేసు

కుంటే పద్యాలు కొన్ని వందలసంఖ్యలో వ్రాసానేకాని వేలసంఖ్యలో వ్రాసినవాడ్ని కాదు. కాని పూర్వపు కావ్యాభ్యాసం చేత నా పద్యం రసజ్ఞులకు ఆకారశయంగానే వుండేది.

పూర్వ కావ్యాభ్యాసం కొంతమంది ఆధునిక కవులలో శైలిని క్లిష్టపర చడం, పాత కవిసమయాలను అతిగా వాడటం, వర్ణనాధిక్యం మొదలగు దుర్ల క్షణాలకు దారి తీసినట్లు నాకు మొదటినుంచీ అనుమానం. అందువల్ల దాని ప్రభావం నా ప్రస్తుత రచనలమీద పడకుండా నేను జాగ్రత్తగా మెసులుకుంటుం టాను. ఏమాత్రం దాని ప్రభావం పడినా ప్రజాకవిత్వం అనే ఆదర్శానికి దెబ్బ తగులుతుందేమోనని భయం నాకు.

ఆ రోజుల్లో, అభ్యుదయ కవిత్వం స్వైర విహారం చేస్తున్న సమ యంలో, మార్క్సిస్టు కానివాడు అభ్యుదయ కవికాలేడు అనే వాతావరణము ప్రబలంగా వుండేది. నిజానికి నాడూ నేడూ కూడా మార్క్సిజం పట్ల నాకు అభిమానం మెండుగానే వుంది. మొదట్నుంచి కూడా కొన్ని రిజర్వేషన్లు ఉన్న మార్క్సిస్టునేమోనని నాకు అనుమానం. కాకుంటే తెలంగాణా కావ్యం పూర్తి అయిన వెంటనే "దండియాత్ర" ప్రారంభించిన కవి ఆనాటి ప్రమా ణాల దృష్ట్యా అభ్యుదయ కవి కాజాలడు. గాంధీతత్వము పరమ అభివృద్ధి నిరోధకమైనదని మార్క్సిస్టు దృక్పథంలో వ్యాఖ్యానించినవారు చాలామంది వున్నారు. అయితే నాదృష్టిలో మార్క్సిజంగానీ,గాంధీయిజంగానీ,మరేదిగానీ, —వాటిలోని మానవత, కరుణావాదము, ప్రజోద్యమ సంభవం ; ఇవే ముఖ్యము, వీటి నుండి పొందిన స్ఫూర్తి నా కవిత్వంలో ప్రతిఫలిస్తూ వచ్చింది అంతేకాని సంఘాన్ని మార్చడానికి ప్రతిపాదించబడిన రకరకాల రాజకీయ ఆర్థిక, సాంఘిక సిద్ధాంతాల్లోని వ్యత్యాసాల జోలికి, వైరుధ్యాల సరసకు నా భావన పోలేదు. నిజానికి కవి అంతలోతుకు వాటి విషయాలలో పోనక్క ర్లేదేమో. వాటిలో తగు మాత్రంగానే ప్రమేయం పెట్టుకుని కవి ప్రజలను ఉత్తేజ పరచవచ్చు. కొందరాధునిక కవులు తమకు యే 'ఇజమూ' అక్కర్లేదని గట్టిగా చెప్పారు. కానీ నా తత్వము అన్ని "ఇజము" లతో ప్రమేయం పెట్టు కోవడం. అన్నింటిలోనుండి సారభూతమైన మంచిని పిండే యీ ప్రయత్నము

నా బ మో బలహీనతో తెలియదు. అంత విప్లవ కావ్యము తెలంగాణా వ్రాసి చివరిలో ప్రజా స్వామ్యము విజయము పొందినందుకు అల్ప సంతోషమును ప్రకటించాను. అంతవరకు ఒక మెట్టు అని నా ఉద్దేశ్యము ఒక దాని తరువాత ఒకటిగా మెట్లెక్కిపోయి సంఘం మార్పు శిఖరాన్ని చేరుకుంటుంది. ఈ ప్రయాణంలో ప్రతి మెట్టుకీ ప్రాధాన్యముంది.

తెలంగాణాకు స్వర్గీయ గోపీచంద్ పీఠిక వ్రాశారు. అది వ్రాయడానికి ఆయన అయిదారు నెలలు ఆలస్యం చేశారు ఆ దెబ్బతో మరెవరితోనూ పీఠికలు రాయించుకునే ప్రయత్నం చేయలేదు. పైగా ఆయన పీఠిక రాస్తూ నా వచన కవితా శైలి ప్రభావానికిలోనై తానూ పీఠిక చివరి భాగం వచన కవితలో వ్రాశాడు. కవిత్వం అనగానే అతిశయోక్తి ప్రత్యక్షమవుతుందిగదా। కొత్త బిచ్చగాడు ప్రొద్దెరుగడన్నట్లు ఆయన కొత్తగా కవిత్వం ప్రారంభించి "విశ్వ దృష్టిని పెంచు యీ కవి, మహాకవి నామాట వినుడు. మహర్షి వాల్మీకి కంటె ఘనుడు, పోనీండి సముడు" అన్నాడు. ఇది నాకు too much అనిపించింది. ఆ భాగం తీసెయ్యమని కోరాను. ఆయన నా కంటె పెడవాడు. నామాట వినలేదు. అది వుండవలసిందేనని పట్టుపట్టాడు వస్తువులోనూ. శైలిలోనూ వున్న క్రొత్తదనం ఆయనను అంతగా వ్యామోహ పరిచింది ఆయనేకాదు, అతి నిరాడంబరమైన నా శైలికి, ప్రజా కవిత్వం అనిపించుకోడానికి ప్రయత్నం చేసే సులభమైన నా శైలికి మహా మహా పండితులే పడిపోవటం చూసి నాకు ఆశ్చర్యం వేస్తుంది. సోవియట్ బహుమతి వచ్చిన సందర్భంగా జరిగిన ఒక సన్మాన సభలో డా. దివాకర్ల వెంకటావధానిగారు నా కవితలో చూపిన పసందులు నాకే దిగ్భ్రాంతి కలిగించినవి. "కుందుర్తి కవితలోని మర్మాలని వెలికి తియ్యడానికి విశ్వ విద్యాలయంలో ఒక ఆచార్యపీఠం ఏర్పాటు చేయాలని" ఆయన ఉద్రేకంగా అన్నారు. ఆపీఠం ఆచార్యత్వానికి మీరే తగిన వా ని ప్రేక్షకులు వెంటనే జవాబు చెప్పారు. సన్మాన సభ సందర్భంగా అన్న మాటలు కనుక అవిఅలాగే వుంటాయిలే అనుకున్నాను. కాని వేదాంతంలోనూ, వ్యాకరణంలోనూ దిట్టమైన పండిత కవి మిన్నికంటి గురునాథ శర్మగారు నా అముద్రిత కావ్యంలోని చివరి ఘట్టం "అవసాన వార్ధక్యం" గురించి యెంత ఘనంగా పొగుడుతాడో ఆయననోట వినవలసిందే.

మరి అవి సన్మాన సందర్భంగా అనే మాటలు కావు. వార్ధక్యం ప్రత్యక్షంగా అనుభవిస్తున్న ఆయనకు ఆ భావాలు అంత ఘాటుగా తగిలాయి.

ప్రజల భాషకు దగ్గరగా వుండి భావ యుక్తమైన కవిత ఎంతటి కావ్య భాషా ప్రియులైన పండితుల హృదయాలనైనా సులభంగా ఆకట్టుకోగలుగుతుందనే విషయానికి ఋజువులు చెప్పడానికే ఇదంతా. ఇది వ్యవహారిక భాషలోనూ అది పునాదిగా పెరుగుతున్న వచన కవితలోనూ ఉండే గొప్ప శక్తి.

4

గత పన్నెండు సంవత్సరాల్లో అంటే ఆంధ్రప్రదేశ్ ఏర్పడి నేను హైదరాబాదు వచ్చిన తరువాత నగరంలోనూ, జిల్లాల్లోనూ, వందలాది కవి సమ్మేళనాల్లో పాల్గొన్నాను. నాకు ముఖ్య మిత్రులైన ఆధునిక కవులు కొందరికి కవి సమ్మేళనాలలో పాల్గొనడం పాత పండిత కవుల సరసనపోయి నిలబడడం అంతగా ఇష్టంలేదు. వారు ఇళ్లల్లోనో, హోటళ్ళలోనో బార్ల లోనో కూర్చొని కవిత్వ చర్చలు చేసుకుంటూ పాతవారిని విమర్శించుకుంటూ కాలం గడుపుతారు. సంప్రదాయ వాదులను జయించే కార్యక్రమంలో నాపద్ధతి వేరు. ఈవిషయంలో నేను దాదాపు ఏకాకిని. పాతవారితోపాటు ప్రజల దగ్గరికి వెళ్ళి వారి కవిత్వం వినిపించిన మరుక్షణమే నా కవిత్వం వినిపించి ఏది మంచిదో తేల్చుకునే అవకాశం ప్రజలకు ఇవ్వడమే నేను అనుసరించిన పద్ధతి. అనేక కవి సమ్మేళనాలలో నేను వచన కవితకు ఏకైక ప్రతినిధిగా పాల్గొన్నాను. ప్రజల ఆమోదం పొందాను. మొదట్లో తటపటాయించినా ప్రజల ఆమోదపు వత్తిడికి లొంగిపోయి అనేక పండిత కవులు నన్ను ఆమోదించక తప్పలేదు. యీ విధమైన నా పథకం విజయం పొందిందనే నా నమ్మకం. ఈ నాడు హైదరాబాదులో ఏ కవి సమ్మేళనం జరిగినా అధిక సంఖ్యాకులైన కవులు వచన కవిత్వమే వినిపిస్తున్నారు. గడచిన దశాబ్దకాలంలో జరిగిన పరిణామం యిది. దీని ప్రభావం తెలంగాణా జిల్లాలన్నింటిమీదా పడింది. ఈనాడు తెలంగాణాలో వచన కవిత ఒక పెద్ద ఉద్యమంగా వర్ధిల్లుతున్నది. నగరంలో ఫ్రీవర్స్ రచయితల సమావేశాలు ఆరంభించిన నాటి నుండి "ఫ్రీవర్స్ ఫ్రంట్" స్థాపించి కృషి చేయడం వరకూ వచన కవితా రంగంలో ఎంతో స్థిరత్వం చేకూరింది. దీనికి కారణం నేను కాదనీ, కాలమేనని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

(సశేషం)

నీ పాట — ఎన్. గోపి

నీ మౌనం తీగెలు సాగి
ఏ పాట మీదకో ప్రాకి పోయింది
పాట కరిగి కరిగి
నిశ్శబ్దంలోకి జారిపోయింది
కాని, నీకు తెలియదు
సన్నని నీ రాగంతో
సున్నితంగా గుండెను కోస్తున్నావని—
అదృశ్య కిరణమేదో
అతి మృదువుగా సోకి
ఏ పొరల కిందనో అణగివున్న జ్ఞాపకం
మేలుకొని మెల్లగా కదలుతున్నదని—
నీకు తెలియదు
నీకు తెలిసిందల్లా పాడడం మాత్రమే—

మొనదేరిన శిఖరానికి తగిలి
ఇన బింబం గాయమయినపుడు
ఆ వేదనలో తడిసి
హృదయంలో సుళ్ళు తిరిగి
ప్రతి చెట్టునూ, గట్టునూ దీనంగా పలుకరించి

ఎవరూ తీర్చని బాధను
ఎవరూ దించని బరువును
ఎవరికో ఎవరికో నివేదించుకోవాలని
ఎటో వెళ్ళిపోయిన పాట
మళ్ళీ ఈ నాడు...
రాగాల మలుపుల్లో
నలిగిన హృదయంతో
ఆలాపనల అలలమీద
మెల్లగా- బరువుగా ఊగుతూ
గుండె చుట్టూ పేరుకొని పోయిన
అనుభూతుల పరిమళాల్లో
ఎప్పుడూ నీ పాటను పీలుస్తూ
ఇలాగే జీవిస్తాను. **

రచయితలకు మనవి

* రచనలు క్లుప్తంగా, స్పష్టంగా వుండాలి.

* కాగితానికి ఒక వైపునే రాసి పంపాలి.

* నిరాకరింపబడిన రచనలు తిప్పి పంపబడాలంటే, తగినంత తపాలా బిళ్ళలు అంటించిన కవర్లు జతచేసి పంపాలి. కవర్లు జతచేసి పంపని రచనలు తిప్పి పంపబడవు.

—సంపాదకుడు

హర్రాజ్ !

—పి. లక్ష్మీనారాయణ్

రాజకీయాల కొరివి దయ్యాలు తిరిగే
భయంకర స్మశానం ఈ సమాజం
గొణిగే గబ్బిలాల గుబురు చీకటిలో
భయం బూడిద కమ్ముకున్న హోరుగాలి
రాజుకుంటున్న స్వార్థపు చితి మంటల్లో
నిండు ప్రాణాలతో కాలిపోతున్న మానవత
చుట్టూ మూగిన ఇజాల అలజడిలో
నీతి నిస్సహాయంగా చేస్తున్న ప్రేలాపన—
మతాల గతపు మన్నును పైకితోడే నక్కల కూతల్లో
కాకుల గద్దల కోలాహలంలో
అమాయకపు బొమికల దీనాలాపన—

దూరాన
మసక మబ్బులావరించి
ఎవరికీ కనిపించని పొలిమేరల్లో
దేవుడైనా తొంగిచూడని గుడిశెల గూడేలలో
ఏడుపులు పెడబొబ్బల చీకటిలో
గుడ్డి దీపం వేస్తున్న గుటకలు . . . . . .
దగ్గరలోనే తలలాడించే మేడలు
[illegible]

అవినీతి యంత్రాంగాల కార్ఖానాలు కర్మాగారాలు
సమ్మేళ సైరన్ చప్పుళ్ళలో
ఉలిక్కిపడి వెనుకకు ముందుకు చూసే
మహా నగరాలు !
అన్యాయపు లావాదేవీల నాగరికతా నల్లబజారులో
బహిరంగంగా బాహాటంగా హర్రాజ్ !
దేశ భవిష్యత్ హర్రాజ్ !?
అవకాశం దొరకని స్వచ్ఛంద సేవకుని హర్తాల్ !
ఆ మరుక్షణమే ఆమరణంగా భూక్ హర్తాల్ !!

పొగలు ధూళి కమ్మిన ఫైరింగులో
నేలకొరిగిన పసివాని నోటి నురుగుల్లో
కడుపుకాలి ఏడ్చే తల్లి కన్నీరులో
తొణికిన కాలపు నల్లని మచ్చలు !
ఓట్లు సీట్లు
పరిమిట్లు గ్రాంట్ల పరోపకారంలో
ఊపిరి సల్పని ప్రజా వ్యాపారంలో
ఏటేటా కరువుల కాటకాల ప్రాఫిట్లు
కూటికిలేని కూలివానికమ్ముతున్న లాటరీ టికెట్లు
సామాన్యుని కోసం దిగుమతి అవుతున్న కల్తీలేని దారిద్ర్యపు
కేటాయింపులు ఖర్చులు ఖాతాలు
స్వదేశీ స్మగ్లర్లు దళారీ బేరగాళ్ళు !
పరాయివాడెవడూ ప్రవేశించకుండా పహరా కాస్తున్న
మహా సైన్యాలు సేనలు- లంచాల సంచుల సప్లయి సంస్థలు
ఇదంతా చూడలేక
మనసంతా నొచ్చుకొని

నిజాన్ని నగ్నంగా నడిబజారు కీడ్చాలని
అరుస్తూ పక్కమీద నుండి పరుగెత్తినవాడు
పాపం ! మళ్ళీ కనుపించలేదు
న్యాయాన్ని వెతుక్కుంటూ నడిరాతిరి వెళ్ళిపోయిన నిరుద్యోగి
రైలు పట్టాలపై పడుకున్న వార్త ఊరంతా పాకిపోయింది
ప్రతివాడలో కూడలోని కంచు విగ్రహాలు రాల్చిన కన్నీటితో
గాలి తడెక్కి పోయింది
నిర్దోషి రంగును పులుముకున్న ప్రతివాడు
"పాపం" అని అంగలార్చాడు

ముష్టివాళ్ళ మూల్గులు
కష్ట జీవుల కుష్ఠు వ్యాధుల అరపులు
ఇంకా ఎవరికీ వినిపించలేదు
ఆవేశపు గుండె చప్పుడు ఆగిపోయి
ఆదర్శాల నాడి పనిచేయని యువత
చైతన్య పథాన్ని చూడలేదు
నెత్తురు చచ్చి సత్తువణిగిన జాతి
భవిష్యత్ వైపు నడవలేదు
సోమరి తనపు సమాధుల్లో నిదురించి
సంప్రదాయపు మూలల్లో ముడచుకొన్న ముసలితరం
మరో ప్రపంచపు సరిహద్దులు సమీపించలేదు !
రాళ్ళు రప్పల ఇరుకు తోవలు విడిచి
కర్తవ్యపు కొత్త తోవ తొక్కినపుడు
ఆచరణ ఆవరణంలోకి ప్రవేశించినపుడు
ఆశించిన భవిష్యత్ హారతులందుకొని ఎదురుగా నడచివస్తుంది.

బాధ్యత

ఎగరగొట్టి
పగలగొట్టు
ఈ ఆటవికమూకల కొవ్వుపట్టివుబ్బిన టోపీలు
నల్లబజార్లో వెలుగుతున్న సూర్యులు చంద్రులు
బహిరంగ సభల్లో యిచ్చిన హామీల
కడుపుకి పుట్టిన సిఫిలిస్ శిశువుగా
22 సంవత్సరాలలో పశువుగా మారిన
కాలం—

కాదు కాదు అపరాధం కాదు పుట్టడం
గొడ్రాలైన యీ సంఘ వ్యవస్థ చన్ను కుడవడం
నేరం

సుఖ వ్యాధుల గుహల్లో
తపస్సు చేసే చర్మ వ్యాపారి
రంగుల్లో హంగుల్తో తీసిన సినిమా
ఈ ఇరవయ్యో శతాబ్దం
జీవితం.—

తెరమీదే తగల బెట్టు
జుట్టుపట్టి యీడ్చుకొచ్చి
చెట్టుకట్టి నాగరికత ఒళ్ళంతా చిట్లగొట్టు
మానవత్వం మందు పట్టు

(రచయిత సౌమనస్య సౌజన్యంతో)

నగ్నముని

తెలుగు వారిచేత పుస్తకాలు కొనిపించేందుకూ
రచయితల స్వంత ప్రచురణల వ్యాపారాభివృద్ధికీ
అంకితం చేయబడ్డ సంస్థ

స్పందన డిస్ట్రిబ్యూటర్స్

వాన చినుకులు

(శ్రీమతి డి. కామేశ్వరి కథల సంపుటి) రు. 2_00

రా

(దిగంబరకవి భైరవయ్య కవితా సంపుటి) రు. 2_50

శ్రీశ్రీ కవితా ప్రస్థానం

(అద్దేపల్లి రామమోహనరావుగారి వ్యాస సంపుటి) రు. 3_00

మూడు పుస్తకాలు ఒకేసారి తెప్పించుకుంటే 25 శాతం మినహాయింపు
ఏ రెండుపుస్తకాలు కావాలన్నా 15 శాతం మినహాయింపు
ఒక్కొక్కటే కావాలంటే మాత్రం పూర్తిధర పంపాలి.
వి. పి. ద్వారా పంపబడవు.

స్పందన డిస్ట్రిబ్యూటర్స్
1_8_17/2 చిక్కడపల్లి
హైదరాబాదు-20

అనతి కాలంలోనే

అనన్య ప్రచారం పొందిన

సచిత్ర మాస పత్రిక

ప్రస్తుతం ఉన్న ఆకర్షణలు

యుద్దనపూడి సులోచనారాణిగారి పెద్దకథ, అవసరాల రామకృష్ణారావు
సి. ఆనందారామంగార్ల సీరియల్ నవలలు, ప్రవీణ్‌గారి మాట కచ్చేరి,
యవ్వనంలో అడుగు పెడుతున్న కన్నె పిల్లల మనసులోని
కోరికలకు దర్పణంగా "నా కాబోయే భర్త ఎలా వుండాలి"
శీర్షిక, ఇంకా 'నిత్యజీవితంలో', 'మీరు నమ్మాలి' శీర్షికలూ...

మీ రూపాయికి మించిన విలువ నిచ్చేది స్వాతి

కొత్తదనానికి ప్రతీక స్వాతి

ప్రతినెలా ఒకటో తేదీకి ముందుగానే వెలువడుతూంది

విడిప్రతి : ఒక రూపాయి
సం॥ చందా : 12 రూపాయలు
అర్ధ సం॥ చందా : 6 రూపాయలు

ఏజంట్లు వివరాలకు వ్రాయండి
స్వాతి
సచిత్ర మాసపత్రిక
రాంకోటి, హైదరాబాదు-1

సమీక్ష

రా

రచన

భైరవయ్య

మూల్యం : రెండువందలయాభై పైసలు

ప్రతులకు :

స్పందన డిస్ట్రిబ్యూటర్స్
1-8-17/2 చిక్కడపల్లి
హైదరాబాదు-20

దిగంబర కవితా ఉద్యమం దిక్కులేనిదై పోయిందే అని అనుకుంటున్న సమయంలో "లేదు, లేదు, ఇంకా ఈ ఉద్యమం చావలేదు" అని చాటుకోవడానికన్నట్టు భైరవయ్య "రా" అన్నాడు.

హఠాత్తుగా ఏదో ఆకాశాన్నుంచి ఊడిపడ్డట్టు ప్రారంభమైన ఈఉద్యమం గాలివిప్పదీసిన సైకిల్ ట్యూబ్‌లా చప్పున చతికిలబడిపోయింది. దిగంబరకవుల 'దిక్సూచి' ఓ దుర్ముహూర్తాన హఠాత్తుగా హుంకరించి వాళ్ళని మూడు దిక్కులకు విసిరి పారేసింది. ఈ ఉద్యమం ద్వారా ఏమేమో సాధిద్దామనుకుని ఎన్నో తీయని స్వప్నాలలో తేలిపోయిన మహాస్వప్న ఉద్యమానికి 'ద్రోహం చేసిన' మిత్రులను ఉప్పు పాతర వేసినంత పని చేశాడు. జ్వాలాముఖి, చెరబండరాజు, నగ్నముని, నిఖిలేశ్వర్, తామొక యుగకర్తలం, ఉద్యమ నిర్మాతలం అని గొంతు చించుకుని అరిచామన్న సంగతే మరచిపోయి, కొత్త ఆర్భాటంతో, కొత్త గాంభీర్యంతో కొత్తముఠా కట్టారు- విరసం వెలిగించారు. భైరవయ్య ఒక్కడూ ఎటూ తోచక, ఏమీ చేయలేక ఇంకా దిగంబర కవితా దివాణంలోనే పడిగాపులు పడుతున్నాడు.

లోకం కళ్ళలో దుమ్ము చల్లడానికి దిగంబర కవులు ఎన్ని సంగనాచి కబుర్లు చెప్పినప్పటికీ, ఈనాటి సాంఘిక రాజకీయ 'కుష్ఠు వ్యవస్థ'ని ఎంతగానో తిట్టినప్పటికీ, తమలోనే బాగా జీర్ణించుకుపోయిన ఈ కుష్ఠురోగాన్ని దాచుకో లేక పోయారు. దాచుకోవడానికి ప్రయత్నమైతే చేశారుగాని సఫలీ కృతులు కాలేక పోయారు. శ్రీరంగనీతులు చెప్పడంలో, ప్రగల్భాలు పలకడంలో, మేనిఫెస్టోలు ప్రకటించడంలో, మాటలు గారడీలో వీళ్ళు మన రాజకీయ వినాయకులకేమీ తీసిపోలేదు. వాళ్ళకంటే రెండాకులు ఎక్కువే చదువుకున్నా మనిపించుకున్నారు.

రాజకీయ నాయకులు సాంఘిక రాజకీయ ఆర్థిక రంగాలను కలుషితం చేస్తే, వాటి మరమ్మత్తుకు దోహదం చేయవలసిన సాహితీ రంగాన్ని వీళ్ళు కలుషితం చేశారు.

అజ్ఞానం, అవివేకం, అహంకారం, ఆత్మస్తుతి, పరనింద, అసందర్భ ప్రలాపం, అవకాశవాదం వగైరా వగైరా అవలక్షణాలు రాజకీయ నాయకుల మని చెప్పుకునే రాక్షసుల్లోనేకాదు, కవులమని చెప్పుకునే కీచకుల్లోనూ ఉంటా యని వీళ్ళు రుజువు చేశారు.

సినిమా లోకాన్ని, దానిలోని కుళ్ళును ఎంతగానో చీదరించుకున్నట్టు నటిస్తూనే, సినిమా తారలకంటే సిగ్గుమాలిన పద్ధతులను అవలంభించారు.

"ఈ ప్రాపంచిక ఆచ్ఛాదనల్ని చీల్చుకుని కొత్త రక్తాన్ని ఇంజెక్ట్ చెయ్యే దానికి (తమ) గుండెల్లోంచి ధైర్యంగా స్థయిర్యంగా దూసుకొచ్చిన కేకలు" వినిపించ వచ్చిన మగధీరులు, (తమ) "నిజ రూపాల్ని దర్శిస్తూ, చుట్టూవున్న మనుషులందర్నీ ప్రేమిస్తూ వాళ్ళనికూడా ఆ ప్రయత్నం చేయమని" ప్రబోధించే ప్రవక్తలు "మంచికోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషికోసం కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, అహోరాత్రులు ఆరని అగ్నిలో నడచిన ఆత్మలలోంచి పలుకుతున్న" ఆత్మ స్వరూపులు తమ అసలు పేరుతో, నిజ స్వరూపంతో ప్రజలముందు నిలబడడానికే భయపడ్డారు. మతం పేరుతో మంత్ర తంత్రాలు ప్రదర్శించి మత్తుమందు చల్లుతున్న మారుపేర్ల స్వాములార్లలాగే వీళ్ళు కూడా సాహిత్యం పేరుతో మాటల గారడీచే

కొందర్ని మైకంలో పడేశారు. తమ అవసరం తీరగానే ఒక మతం వదిలేసి మరో మత ప్రవేశం చేశారు. అందుకే వీళ్ళు "ఎక్కడా బిక్ష దొరక్క కవితా శాస్త్రానికి నిప్పంటించి, బూడిదకోసం కాచుకూర్చున్న జంగాలు" అన్న అవహేళనకు పాత్రులైనారు.

దిగంబర కవులకు తాము ఆడుతున్న నాటకం తెలుసు. తమపై రాగల విమర్శల స్వరూపమూ తెలుసు. అందుకు ముందుగానే జాగ్రత్తపడ్డారు— రంకు నేర్చినమ్మ బొంక నేర్చినట్టు. తమను విమర్శించే వాళ్ళను బెదిరించడానికి తిట్ల దండకాలు చదివారు. ఈ తిట్లన్నీ తమకే తు. చ. తప్పకుండా తగులుతాయని మాత్రం గుర్తించలేక పోయారు. అందుకే అసహ్యాం, అసహనం, అరిగి, పుచ్చి, కుళ్ళి దుర్గంధాన్ని వెదజల్లే మాటల్ని, సమాసాల్ని, భావాల్ని పట్టుకుని వేలాడారు.

ఒకరి మాటల్నే మరొకరు వాడి, ఒకరి సమాసాల్నే మరొకరు అరువు తెచ్చుకుని, ఒకరి భావాల్నే మరొకరు కాపీ కొట్టి, తిరగేసి మరగేసి తీరుకొక్క కవిత రాయగలిగినట్టు చూపుకుని కుతి తీర్చుకున్నారు.

"ఈ వెన్నెముకలేని యువకులు, మైథున కవిత్వంతో ఆధునికుల మనుకునే క్షుద్రశవ భోగులు, ఈ సిఫిలిస్‌గాళ్ళు" ఆంధ్ర సాహితీ రంగాన్ని ఒక 'లేవెట్రీ'గా మార్చడానికి విఫల ప్రయత్నం చేశారు. అందుకే ఎప్పుడో చచ్చి, రోడ్ల పక్కన బురద గుంటల్లో దొర్లుతున్నారు.

పేడ పురుగులకన్నా హీనంగా తయారై కుష్ఠువ్యవస్థని దుర్గంధ సంస్కృతిని పోషిస్తున్న వాళ్ళ పంచనజేరి పబ్బం గడుపుకుంటున్నారు.

X X X X

దిగంబర కవితా దుకాణాన్ని ఇంకా తెరుచుకు కూచున్న భైరవయ్యా పాత సారానే కొత్త సీసాలో పోసి అమ్ముతున్నాడు. దిగంబర కవులందరూ కలిసి ప్రకటించుకున్న మూడు సంపుటాల్లోని తన పాత కవితలను కొన్నింటిని ఏరుకొని ఈ కొత్త పుస్తకంలో నింపుకున్నాడు. మూడవ సంపుటిలోని "నేను దేవుణ్ణి నమ్ముతున్నాను," "దద్దోజనం" అనే రెండు కవితల్ని ఎందుకో వదిలే

కాడు. ఈ కొత్త పుస్తకానికి పేరు పెట్టడంకోసం పడ్డ తాపత్రయం లాగుంది— 'రా' అన్న కవితను చేర్చాడు.

దిగంబర కవులందరికీ ఉన్న స్వకుచమర్దన వ్యాధి భైరవయ్యకూ ఉంది. ఇందులో తాను 'నిప్పురవ్వ'నని చెప్పుకున్నాడు. "ఈ 'నిప్పు రవ్వ'కు ప్రపంచంలోకి ప్రస్థానం ఇష్టం: స్మశానంలో చెంగల్వలు పుట్టించడం కోర్కె: అయోమయంలో లయమవుతున్న ఈ ప్రపంచం మారాలంటే ప్రతి మనిషీ ఒకఅగ్ని కణం కావాలంటుంది ఈ నిప్పురవ్వ" ఇదీ ఈయన పరిచయం; ఇదీ ఈయన మేనిఫెస్టో.

తానూ + తన అయిదుగురు దిగంబర కవి మిత్రులూ సాహితీ రంగంలో సాధించిన విజయ పరంపర గురించి ఈయన ఒక ప్రకటన కూడా చేశారు. అది "దిగంబర కవిత్వం స్తబ్దుగా పడివున్న తెలుగు సాహితీ రంగంలో చైతన్యం కలిగించి, సాహిత్యం ప్రజల సమస్యల్ని పట్టించుకునేట్టుచేసి, మత్తుగాపడి వున్న యువతరాన్ని మేల్కొలిపి అక్రమాల్నీ, దౌర్జన్యాల్నీ ఎదుర్కొనేట్టు చేసింది" అని.

ఈ మాటే నిజమైతే 'రా' ప్రచురణ శుద్ధ దండుగ. నిజం కాదని భైరవయ్యకే బాగా తెలుసు. అయినా బుకాయింపు దిగంబర కవుల జన్మహక్కు కనుక మనం కాదనడానికి వీలులేదు. భైరవయ్య మాటల్లోనే చెప్పాలంటే. "ఈ దేశం బాగు పడడానికి నేడు వున్న ఈ వ్యవస్థ మొత్తం మారాలి. దీన్ని అన్ని వైపుల్నుంచీ యువతరం ఎదుర్కొవాలి ఈ వ్యవస్థలో వున్న ఛండాలాన్నంతటినీ పూర్తిగా నాశనం చెయ్యాలి.'' అన్నాడు.

నేడు జరుగుతున్న సర్వతోముఖ పోరాటంలో పాల్గొనమని ఆహ్వానించాడు. అయితే ఆ పోరాటం ఎక్కడ జరుగుతున్నదో, ఎలా జరుగుతున్నదో ఎవరికీ చెప్పకుండానే భైరవయ్య "అగ్ని ప్రవేశం" చేశాడు.

అబద్ధాల కత్తి అంచులమీద నిజంలా
మిన్నంటుతున్న జ్వాలల కొసలపై పొగలా (నిలుచుని)
రుద్రపాలం మీది నేత్రంలా

చిక్కటి ఇరుల ఉడుపుల వెనుక దాగిన
తొగరు అంచాల తేజంలా
(చూశాడు) ఎదురుగా
కాల భైరవుని సన్నిధిలో కంకాళ నృత్యం
మరుభూమిలో కాలిపోతున్న సగటు మనిషి జీవితం
పుష్పాల పయనించే పూబోడుల కుసుమ పరాగం
తమతో కలవమనే ముందు తరాల ఆహ్వానం

తన కెదురీదమనే కాల వాహిని సవాలు కనిపించింది.

ఇవన్నీ ఒక్కటిగానే భైరవయ్య కళ్లకు కనిపించింది. భైరవయ్య చెవిటి వాడేమో చెవులకు మాత్రం ఏమీ వినిపించలేదు. వినిపించకపోయినా, కనిపించినదానితోనే ఉద్విగ్నుడైనాడు. బలహీనపు గుండెగలవాడేమో.

ఉత్తేజాన్ని ఊపు చేసుకుని
నిబ్బరాన్ని గుండెలో పోసుకుని
(మనం కూడా హడలి పోతామనుకుని)
చుట్టూ భయంకర సత్యాలు సృష్టిస్తూ
కన్ చెదురుగా—దిల్ బెదురుగా
వచ్చాడు.

ఇలా—

"నిశీధి మంటల్లో
మిన్నంటుతున్న భావాల జ్వాలల్లో
మస్తిష్కం విహరిస్తుండగా"
రావడంతో అది కాస్తా మాడిపోయినట్టుంది.

ఈ "అగ్ని ప్రవేశం" ఫలితంగా—
ఫెళ్ళున ఎక్కడో ఎండుపుల్ల విరిగింది
ఒక పాచినోట్లో వెర్రి నవ్వు దూకింది
("దిగంబరి" అవతరించింది)

"దిగంబరత్వం
బట్టవిప్పి బారచాచి
వడిరోడ్లో గంతులేయడం కాదు
పదాలతో వలువల్ని ఒలిచేయడం
అంతకన్నా కాదు"—
"దిగంబర కవిత్వంలో అక్షరాలు
కామంతో పుచ్చిపోయిన
లతాంగి పయోధరాలపై
నూతన నఖక్షతాలు కావు"

అంటూ ఈ భయంకర దిగంబర పిశాచి నిజ స్వరూపాన్ని కప్పి పుచ్చ డానికి భైరవయ్య నానా యాతనా పడ్డాడు. అయినా, ఎవరైనా పసిగట్టి అసలు రంగు బయట పెట్టడానికి యత్నిస్తారేమోనని భయపడి, ఎందుకైనా మంచిది; వాళ్ళకి ముందుగానే నాలుగు వడ్డించి హడల గొట్టేద్దామనుకున్నాడు. అనుకుని—

ఇవి అర్థం గావు
అహంకారులకి—అహంభావితులకి
పదాల గారడీలో
పరమార్థం చూసే పక్షులకి
ప్రబంధాల - పురాణాల
అసలు తత్వం విడిచి పెట్టి
చూర్లు పట్టుకు వేళ్ళాడే చుంచులకి
తమలో—ప్రపంచంలో
కొత్తదనం- చైతన్యం
కోరని- హర్షించని—సహించని కొజ్జాలకి
తామే యుగకర్తలమని
తమదే సాహిత్యమని
తప్పెట్లు కొట్టుకునే భ్రష్ఠులకి—
అన్నాడు.

కాని అహంకార మనేది దిగంబర కవుల్లోనే అధికం అనేది మరచి పోయాడు. ''అహంకారం-అహంభావం" రెండూ కేవలం పదాలగారడీకోసమే వాడాడు ప్రబంధాల పురాణాల అసలు తత్వం తెలిసిన వాడైతే దిగంబరి ప్రబంధ సుందరి కాదు. అని చెప్పుకోవలసిన అవసరమే లేదు. తామే సాహితీ రంగంలో యుగకర్తలమని, తమదే సాహిత్యమని తప్పెట్లు కొట్టుకున్న భ్రాష్ఠులు దిగంబర కవులేనన్న నగ్న సత్యం కూడా మరచి పోయాడు.

పైగా—
భైరవయ్యకు భాష తెలియదనీ, వాక్య నిర్మాణం తెలియదనీ మీరను కుంటారేమోనని మంత్రగాళ్ళు కట్టుబాటు చేసినట్లు—
ఇవి అర్థం కావాలంటే
మీరు
మొహమాటంతో కట్టుకున్న బట్ట విప్పి
ఒంటరిగానైనా నగ్నంగా నిలబడి
మీలోకి చూసుకోవాలి.
అంటూ ఆంక్ష పెట్టాడు.

అందువల్ల మీరు పది మందిలో కాకపోయినా, ఒంటరిగానైనా నగ్నంగా నిలబడగలిగినప్పుడే భైరవయ్య కవితలు చదవాలి. లేకపోతే "మీ మెదడు ఎముక తెచ్చుకున్నదవుతుంది, మీ కళ్ళు పుచ్చిపోయిన వవుతాయి" అని శపించాడు.

"అసహ్యం, అసహనం. అరిగి, పుచ్చి, కుళ్ళి, దుర్గంధాన్ని వెదజల్లే మాటల్ని. సమాసాల్ని, భావాల్ని, పట్టుకుని వేలాడే" అలవాటు దిగంబర కవుల నరనరానా జీర్ణించుకుపోయింది. వాళ్ళ కవిత్వమంతా ఈ కంపు వాసనతో గబ్బు కొడుతోంది. ఉదాహరణకు :

"ఖబడ్దార్"లో—

మీ రాజకీయాల రంకు నీతికీ
మీ కుహనా విధానాల వాదాల కీచులాటకీ

మీ కీర్తి తామర దురదలకీ
మీ పదవీ కాముక హస్త మైథునాలకీ
మీ చుట్టూ ఉన్న రొచ్చులకీ
మీరు పెంచే పందులకీ—

"షష్టిపూర్తి"లో—

ముదితల మర్మాంగాల
వేదాంతపు వేదికెక్కి

"నరమాంసం రుచి మరిగి"లో—

మీరంతా ఊర పందుల్లా బతుకుతున్నారు
అంట్ల వెధవల్లా
మొగుడు చచ్చిన ముండల్లా
మొగుడు చాటు పోరంబోకు లంజల్లా...

నీ దేశం మీద
నీ బతుకు మీద
నీ పెళ్ళాం మీద
భయంకర పైశాచిక రతి సలుపుతుంటే ..

ఇలాంటివి చాలా ఉన్నాయి.

భైరవయ్య కవితా రచనలో కొజ్జాలు, త్రాష్టులు, భటాచోర్లు, బాడఖావులు, జరితెగించిన రండాలు బాగా తోడ్పడుతుంటారు. ఆయన చుట్టూ ఎప్పుడూ రొచ్చులుంటాయి. ఆయనకి నిఖార్సైన అప్రాచ్యుడుగా కవిత్వం రాయడం. ముద్రాక్షతలతో తన రాక్షసత్వాన్ని లిఖించుకోవాలని తాపత్రయ పడడం, దగుల్బాజీ మాటలు, వెకిలి నవ్వు. వెకిలి చేష్టలు, పొలికేకలు, పెనుకేకలు, చావు బాకాలు, ఊర పందుల్లా బతకడం, హస్త మైథునం వగైరాలు చాలా ఇష్టంగా కనిపిస్తోంది.

భైరవయ్య వాగాడంబరం బాగానే ఉంది. కాని. ఆయనకు భాషా జ్ఞానం బహు తక్కువ అందుకే "కల్మష భూయిష్టమైన కూపస్థాలలో తమ జీవనం

గడిపేస్తూ", "పగిలిన శంఖారావాలతో" "కొడి గట్టిన సూర్యుల్ని ప్రజ్వలించి" "మనకి స్వతంత్రం రాలేదు" "ఇరవై మూడు సంవత్సరాల స్వాతంత్ర్యత" "బుద్ధుడిదో మరో దద్దమ్మదో సూత్రాలు", వగైరా ప్రయోగాలు చేశాడు.

ఈ కవికి ఆలోచన కంటే ఆవేశం ఎక్కువ. భావాల ఎక్స్ప్రెషన్‌లో క్లారిటీ తక్కువ. శ్రీశ్రీనో మరెవ్వరినో అనుకరించాలన్న ఆరాటం ఎక్కువ. కమర్షియల్ అడ్వర్టైజు మెంట్స్‌లో "అంధకార జ్యోతిర్మయ నిర్మాలనా ప్రకాశిక" వంటి అర్థం పర్థం లేని సమాసాలు వాడినట్టే పరస్పర సంబంధంలేని, అర్థం అంతకంటేలేని శబ్దాలు, వాక్యాలు, పేరాలు, పుంఖాను పుంఖంగా గుప్పడం అలవాటు. "స్మశానంలో సూర్యుడు" "అగ్ని శిఖలు" "ఆకాశం ఈ సారి నిజంగా బావుంది" వగైరా కవితలు తీసుకోవచ్చు.

ఇన్ని దోషాలు ఉన్నా అహంకారానికీ, అసహనానికీ మాత్రం కొదువ లేదు భైరవయ్యలో. "పాపం నీ అడ్రసు దొరకటం లేదు" అన్న కవితలో— తన కిష్టంలేని కవులకు "పెద్ద బాలశిక్ష తప్ప మరేదీ తెలియదు" అంటాడు. భైరవయ్యకు పెద్ద బాలశిక్షయినా తెలుసునా అని అనుమానం వేస్తోంది ఆ మాత్రం తెలుసుంటే కొంతైనా సంస్కారం అబ్బుతుంది మరి!

దిగంబర కవులందరిలాగే భైరవయ్యలోనూ తానేదో గొప్ప కవినని పించుకోవాలి, పెద్ద రచన చేశాననిపించుకోవాలి అనే తాపత్రయమే ఎక్కువగా కనిపిస్తుంది. కావి లక్ష్యశుద్ధి చిత్తశుద్ధి కాని క ని పి ం చ దు. తాము ఎవరికోసం రాస్తున్నారో, ఎందుకోసం రాస్తున్నారో, ఏమి రాస్తున్నారో కూడా తెలియని అయోమయ స్థితిలో సాగుతుంది వీళ్ళ రచన.

నిజంగా సామాన్యుడికోసం రాసేదైతే నిత్యం వాడుకలో వుండే పదాలనే వాడుతూ, సామాన్యుడికి బాగా పరిచితమైన ఉపమానాలనే ప్రయోగించడం అవసరం అవుతుంది. అతని గుండెకు హత్తుకు పోవాలంటే సూటిగా, స్పష్టంగా చెప్పడం అవసరమవుతుంది. ఇంత వరకూ ప్రజల కోసమే కవిత్వం రాస్తున్నామని బాకాలు ఊదుకుంటున్న వాళ్ళెవ్వరూ ఈ సత్యాన్ని గమనించినట్టు తోచదు. అందులో దిగంబర కవులు మరీ వెనుకబడినవారు. ఈ కళలో ఆరితేరినవాడు కాళోజీ ఒక్కడేనేమో!

మరో ముఖ్య విషయాన్ని కూడా భైరవయ్య మరచి పోయాడు అది పదాలను పొదుపుగా వాడుకోవడం—(economy of words). ఉద్యమకర్తలం అనుకునే వాళ్ళు ఛందోవ్యాకరణాలను సందుగల్లో పెట్టేసినా తప్పేమీ లేదు కాని, రచనల్ని ఎంత కుదించుకుంటే అంత మంచిది. అది చేత కాని వాడు యుగ నిర్మాత అవడం అటుంచి, ఉద్యమ నిర్మాతనని చెప్పుకోడానికి కూడా తగడు.

ఇందులో 'రా' అనే దొక్కటే పధ్నాలుగు పేజీలుంది. మొత్తం పుస్తకంలో ఆరవభాగం అన్న మాట.

భైరవయ్య 84 పేజీలలో ప్రకటించినఇరవయి కవితల్లోనూ పునరుక్తుల (repetitions)నూ కేవలం పాండిత్య ప్రదర్శనం కోసం ఉపయోగించిన అనవసర పదజాలాన్నీ కత్తిరించేస్తే అవి 40 పేజీల్లో ఒదిగిపోతాయి. వాటి effect ఏ మాత్రమూ తగ్గదు. పైగా ఇంకా ఎక్కువవుతుంది కూడా.

"చెరచబడ్డ గీతాన్ని" అనే కవిత చదువుతున్నప్పుడు దిగంబర కవుల చేతుల్లో పడ్డ గీతం కరుణార్తనాదం వింటున్నట్టు అనిపిస్తుంది. భైరవయ్య అంతరాంతరాల్లో ఎక్కడో తాను తప్పుచేస్తున్నానన్న బాధమూలుగుతూందన్న మాట మంచిదే!

ఇలాగే "అణుయజ్ఞం" చదువుతున్నప్పుడు భైరవయ్య ఈ గీతంలో ఆత్మావిష్కరణ చేసుకుంటున్నాడా అనిపిస్తుంది.

ఈ రెండూ మనల్ని కదిలిస్తాయి. ఇలాంటివే "అహింసవి బోధించమంటావా బాపూ" "తిరుగుబాటు నిజం" "అగ్నిశిఖలు" "కబళించిన కాలం" "ఈ జడత్వంలోంచి" అన్న కవితలు. వీటిలో నిజంగా "ఈ దేశంలో, ఈ లోకంలో ఊపిరి పీల్చే ప్రతిమనిషి ఉనికికోసంపడ్డ తపన, తప్పిపోయిన ఆత్మను ట్టి యిచ్చి, మనిషిని మనిషిగా చూడాలన్న కోరిక; "ప్రతి వాక్యంలోనూ నిపిస్తాయి." పాశవిక ప్రవృత్తుల ఫలహారం పెట్టే పదజాలం గాని, భావాలు ాని కనిపించవు. ఇవి హృదయాన్ని కదిలించి మెదడును ఆలోచింపచేటట్టు ేస్తాయి మనిషిలో ఆత్మాభిమానాన్ని రెచ్చగొట్టి కర్తవ్యోన్ముఖుడిని చేస్తాయి

ఈ రచయిత అమాయకత్వం, నిష్కాపట్యం, కారుణ్యభావం ఆత్మ పరిశీలన, పశ్చాత్తాపం వీటిలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఈ కవితలన్నీ చదివిన తరువాత కవిలో పరస్పర విరుద్ధమైన రెండు వ్యక్తిత్వాలు ఉన్నట్టు, ఆ రెంటికీ మధ్య నిరంతర సంఘర్షణ జరుగుతున్నట్టు అనిపిస్తుంది. సహవాస దోషంవల్ల ఆయనలో పెరిగిన రాక్షస వ్యక్తిత్వం క్రమంగా అంతరించిపోయే సూచనలు కూడా కనిపిస్తాయి. అదే జరిగితే మున్ముందు నిజంగానే అన్నీ ప్రయోజనకరమైన కవితలే అందియ్యవచ్చు.

సామాజిక ప్రయోజనం ప్రధానంగా చేసే రచనల్లో లక్ష్యశుద్ధి చిత్తశుద్ధితో పాటు భావశుద్ధి, భాషా శుద్ధి కూడా అత్యంతావసరం.

సామాన్యుడి కోసం ప్రచురిస్తున్నామని చెప్పుకుంటున్న పుస్తకాలు సాధ్యమైనంత చౌకగా ఉండడం కూడా అవసరం. ఇందులో భేషజాలకు తావు లేదు. త్రివర్ణ ముఖ చిత్రాలు అంతకంటే అవసరంలేదు. లేకపోతే ఎనబై నాలుగు పేజీల పుస్తకానికి రెండున్నర రూపాయల ఖరీదు పెట్టవలసి రాదుగదా!

—మామిడి రమాకాంతరావు

అందమైన అచ్చుపనులు - సరసమైన ధరలకు
సకాలంలో అందివ్వబడాలంటే

ది హైదరాబాద్ సన్ ప్రెస్
ప్రింటర్స్ & బైండర్స్
మెయిన్ రోడ్, చిక్కడపల్లి హైదరాబాదు-20

సమీక్ష

వెల
ఒక రూపాయి

త్రివేణి

ప్రచురణ
స్పందన సాహితి

ప్రతులకు :

అంచల లక్ష్మీనారాయణ
8-2-22/బి పంజాగుట్ట
హైదరాబాదు-1

సాహిత్యాన్ని సరసమైన ధరకే సామాన్యుడికి అందుబాటులో ఉంచాలన్న ఆశయంతో ప్రారంభమైన స్పందన సాహితివారి మూడవ ప్రచురణ 'త్రివేణి' ధర సరసంగానే వుంది. కవిత్వం ఎలా వుందో చూద్దాం!

ఇందులో ముగ్గురు కవుల కవితలు త్రివేణీ సంగమంలా కలపబడ్డాయి వారు సర్వశ్రీ ప్రభంజన్, శాంతమూర్తి, భావశ్రీ.

ప్రభంజన్ గారు శ్రీశ్రీకి జోహార్లు చెబుతూ కవిగా కలాన్ని కత్తిగా మార్చి రక్తంతో దిగంబర కవిత్వం రాస్తానని—అన్ని విధాల భ్రష్టత్వం పొందిన సంఘాన్ని సమూలంగా సమాధి చేస్తానని శపథం చేస్తున్నారు. వీరిలో ఆవేశం వుంది— తపనా వుంది. ఇప్పుడున్న ఈ జడత్వం వదిలి కొత్తదనం రావాలనే కోర్కె వుంది.

'సంఘం' అనే కవితలో

'సంఘం అంటే ఏమిటో తెలుసా ?
సగం చచ్చిన మనుష్యుల కూటమి

అని చెబుతూ

వచ్చిన వాళ్ళ గొప్పలు చెప్పటం
వచ్చీరాని భాషలో గొంతు చించుకు చావటం
దేశభక్తి కాదన్నారు.

'నువ్వు పేదవా' అన్నదాంట్లో పేదరికాన్ని ఒక పదవిగా భావించి అది పూర్వ జన్మ కర్మ పరిపక్వంగా ప్రకటించే నిరాశావాదుల మీద విరుచుకు పడ్డారు

"అభ్యుదయ మంటే ప్రోగెస్ (పిల్లి అంటే మార్జాలమన్నట్లు) ప్రవచించే అభ్యుదయవాదుల్ని రచ్చకీడ్చి 'నీ కీర్తి కండూతి మండా' నీ కన్నా గాడిద నయం' అని అసహ్యించుకుంటున్నారు.

'సంపూర్ణ స్వాతంత్ర్యదినం' అన్న కవితలో

ప్రభుత్వం ప్రజలతో జూదం ఆడుతోంది
లక్షలాది కొంపల్ని కూల్చి
లక్షాధికారి నొక్కడ్ని చేసి
లక్కీ లాటరీలతో
లక్ష్యాన్ని సాధిస్తామనే
దేశ నాయకులు పరిపాలించిన
ఈ రోజుల్లో, ఈ దేశంలో
ఎక్కడ స్వాతంత్ర్యం
ఏది స్వాతంత్ర్యం

అని గుండె మీద చెయ్యి పెట్టి ప్రశ్నిస్తున్నారు. ఎవరు సమాధానం చెబుతారు. అందుకే 'ఓటుకు అమ్ముడుబోయే బానిసగా బ్రతుకుతున్నాం' అని నిక్కచ్చితంగా చెప్పారు కనుక, సంఘంలో మార్పు రావాలంటే, ఈ విషవలయంలోంచి తప్పుకోవాలంటే

'సంఘంలో సంస్కారం పెరిగితే తప్ప
మనుష్యుల నావరించిన
భూతకాలం భూతం వదిలితే తప్ప
ఒక తీరానికి చేరటం సాధ్యంకాదు"

"ఏ అయిుదంతస్తుల మేడ మీదో పడి
దర్జాగా వుండవలసింది పోయి
ఒక పూర్ పూరిగుడిసె మీద పడి
అంతలో జారి భూమ్మీద పడిపోయినందుకు
విచారిస్తు కూచుందొక వాన చినుకు"

ఏదో ఒకటి చెప్పాలన్న ధోరణిని అధిగమించి వారు కోరుకున్న ట్లుగా మంచి కవిత్వాన్ని సాధించడానికి ప్రయత్నం చేయడం ఉత్తమం అనుకుంటాను.

పాత కొత్తల మేలు కలయిక సాధించాలన్న ఆశయంతో బైలుదేరిన వారు భావశ్రీ. వీరివి పదకొండు కవితలున్నాయి. ఆదిగా దేశానికి ద్విపద కావ్యపు పంథాలో జోహార్లర్పించారు. వీరి కవితలు ఎక్కువగా ప్రబోధ గీతాల్లా వుంటాయి వాటిల్లో కొస మెరుపు 'మేఘ సందేశం' అన్నది.

"కాళిదాసులా ఘనముగా నిన్ను
నీకైరున్నత స్తోయనమై" యని విలువగట్టలేను
వీలైతే నాదొక చిన్నమనవి అని చెబుతూ,

మధ్యవర్గం కుటుంబాలలో
స్వయం చితిలా రగులుతూ
మానం ప్రమిదల కాపాడుకుంటున్న
మహిళల సంతప్తహృదయాంతరాళాలలో
శీతల సుధా రసధారలా
చినుకుల్ని కురిపించమని వేడుకున్నారు.

మనసుని లగ్నం చేస్తే చక్కటి కవిత్వాన్ని అందించగలరని ఈ కవిత చెపుతోంది. ముమ్ముందు వారి కలం నుంచి భావస్ఫూరితమైన కవిత్వం రాగల దని ఆశిదాం.

మరింత సరసమైన సాహిత్యాన్ని ఇలాగే సరసమైన ధరకి స్పందన సాహితివారు మనందరికీ అందించగలరని ఆశిద్దాం.

—మనోమోహన్

గ్రంథ స్వీకారం

1. రచన (వ్యాస సంపుటి) రు. 5-00

ప్రచురణ : యువ భారతి 5, కింగ్స్‌వే, సికిందరాబాదు.

2. కొత్త చిగుళ్ళు (గేయ సంపుటి) 1-00

రచన : రాజీవ

ప్రచురణ : రజనీ పబ్లికేషన్స్ రాష్ట్రపతిరోడ్, నిజామాబాద్.

సమీక్షార్థం రెండేసి ప్రతులు పంపాలి.

హృదయం కోసం వెతకటం చేతనైన వారికి
ఇందులో కవిత్వం దర్శనీయం కాకపోదు.

—అరిపిరాల విశ్వం

తుంగతుర్తి విశ్వనాథశాస్త్రి గేయ సంపుటి

నీలాటి రేవు

(ద్వితీయ సంపుటి)

యాభై రెండు పేజీలు ✲ వెల ఒక రూపాయి

ప్రతులకు :

ఆంధ్రసారస్వత పరిషత్తు, తిలక్ రోడ్,

హైదరాబాదు-1

VEKUVA Jan—Mar 1971 Re. 1.

వేకువ

సాహిత్య త్రైమాస పత్రిక

చందా వివరాలు

విడి ప్రతి.................ఒక రూపాయి

సంవత్సరం చందా....నాలుగు రూపాయలు

ప్రకటనల రేట్లు

నాలుగవ కవరు పేజీ	—రు. 400-00
రెండవ, మూడవ కవరు పేజీలు	—రు. 200-00
లోపలి పేజీ	—రు. 100-00
అర పేజీ	—రు. 60-00

ఇంకా వివరాలకు :

గౌరవ నిర్వాహకుడు
'వేకువ'
సాహిత్య త్రైమాస పత్రిక
1-8-17/2 చిక్కడపల్లి
హైదరాబాదు - 20

Edited & Published by K. Siva Reddy M. A., (Litt)
and Printed at The Hyderabad Sun Press, Chikkadpalli, Hyd-20.